
రామాయణం

# బాలల బొమ్మల సంపూర్ణ రామాయణం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని స్క్రిబ్డ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: https://www.scribd.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో స్క్రిబ్డ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Helpline: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

**http://www.scribd.com**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# నా మాట

పాఠక మహాశయులారా!

శ్రీ మహావిష్ణువుయొక్క అవతారములలో శ్రీరామావతారమే పూర్ణావతారమనుటలో అతిశయోక్తి లేదనుకుంటాను. శ్రీరాముడు మానవ లోకానికి ఆదర్శపురుషుడు, పూర్ణ పురుషుడు. మొదటిసారిగా రామాయణము బ్రహ్మ అనుగ్రహముతో వాల్మీకి మహాముని వ్రాసినారు. ఆ తరువాత యెంతోమంది యెన్నో విధాలు వ్రాసారు. కాని, యీ రామచరిత్రలో వున్న గొప్పతనం యేమిటంటే, దీనిని యెవరెలా వ్రాసినా పాడినా యెంతో వినసొంపుగానూ, యింపుగానూ వుంటుంది.

ఈ రామాయణము సమస్త లోకాలకు పూజనీయమైన పవిత్ర గ్రంథము. ఈ తరంలోని పిల్లలకొరకు సులభశైలిలో వచన కావ్యముగా ఎన్నో రామాయణములను వ్రాయుట జరుగు చున్నది. అటువంటి కృషిలో ఒక భాగమే ఈ బాలల బొమ్మల సంపూర్ణ రామాయణము కూడా. ఈ పవిత్ర గ్రంథాన్ని ప్రచురించదలచిన "శ్రీ గొల్లపూడి"వారు అభినందనీయులు. ఈ గ్రంథమును వ్రాసే అవకాశము నాకు కల్పించిన శ్రీ "గొల్లపూడి వీరాస్వామి సన్"వారికి నా ధన్యవాదములను తెల్పుకుంటున్నాను.

నా యీ రామాయణ కృతిని - నా అభివృద్ధికి సర్వవిధాలా తోడ్పడుతున్న సహృదయులూ - సోదర తుల్యులూ అయిన శ్రీ డా॥ వై.సన్యాసిరావు దంపతులకు హృదయ పూర్వకంగా అంకితం యిచ్చుకుంటున్నాను.

ఇట్లు
గ్రంథకర్త్రి
జి.యస్.ధనలక్ష్మీదేవి

# ముందుమాట

భారతీయులందరకూ శిరోధార్యములైన గ్రంథములు మూడు గలవు. వానిలో మొదటిది రామాయణ మహాకావ్యము రెండవది భారతేతిహాసము. మూడవది భాగవత పురాణము.

పసినాటినుండియు, తల్లిదండ్రులు తమ బిడ్డలకి గాథలు చెప్పుట మన దేశమున ఆనవాయితీగా వచ్చుచున్నది. కాని అధునాతన కాలమున యేర్పడిన జీవన వేగము వలననూ, వివిధములైన కారణముల చేతనూ - ఆ పరంపరా కథన మించుక వెనుకబడినది. ఇట్టి సమయములో - పిల్లలు తమకు తాముగా ఆ దివ్య గ్రంథములను పరిచయము చేసుకొనుటకుగాను - అనువైన భాషలో ప్రచురించుట అవశ్యకముగా తలంచితిమి.

అనాదిగా మేము ప్రచురించిన గ్రంథముల నాదరించిన అసంఖ్యాక పాఠకులకు కృతజ్ఞులము. అశేష ప్రజలొసంగిన ఆదరణయే అండదండలుగా భావించి మా తలపులను ఆచరణకు దెచ్చి - తొలి యత్నముగా ఈ బాలల బొమ్మల సంపూర్ణ రామాయణమును మీ ముందు వుంచుచున్నాము.

బాలలకు వుత్సుకత కలిగించుట కొరకు నడుమ చక్కని చిత్రములను గీయించినాము. వర్ణమాల క్షుణ్ణముగా వచ్చిన పిల్లలకు కూలంకషముగా అర్థమగు రీతిలో తేట తెనుగు శైలిలో యీ గ్రంథమును వ్రాయించినాము.

బాలల వారి ఉత్సాహమును, పెద్దలు తమ ఆశీస్సులతో బాటు తగు సలహాలను అందించినచో మరింతగా మీ సేవయందుండగలవారమని మనవి చేసుకొను చున్నాము.

ఇట్లు

ప్రచురణ కర్తలు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నారదుని ఆగమనము | 9 |
| 2. | బోయవాడు - క్రౌంచపక్షి | 10 |
| 3. | బోయవాని మరణము | 11 |
| 4. | బ్రహ్మ అనుగ్రహము | 12 |
| | **బాలకాండము** | |
| 5. | దశరధుని రాజ్యపాలన | 14 |
| 6. | అశ్వమేధ యాగము | 15 |
| 7. | పుత్రకామేష్టి ప్రారంభము | 16 |
| 8. | దేవతలు - మహర్షులు విష్ణువుతో మొరపెట్టుకొనుట | 17 |
| 9. | యజ్ఞఫలము | 18 |
| 10. | పుత్రోదయము | 19 |
| 11. | వానరుల పుట్టుక | 19 |
| 12. | నామకరణ మహోత్సవము | 20 |
| 13. | విద్యాభ్యాసము | 21 |
| 14. | విశ్వామిత్రుని ఆగమనం | 22 |
| 15. | రామలక్ష్మణులు విశ్వామిత్రునితో వెడలుట | 24 |
| 16. | తాటక వధ | 25 |
| 17. | యాగ సంరక్షణ - మిధిలానగర ప్రయాణము | 26 |
| 18. | అహల్యా శాప విమోచనము | 28 |
| 19. | మిధిలలో స్వాగత సత్కారములు | 29 |
| 20. | సీతా స్వయంవరం | 30 |
| 21. | సీతారాముల కళ్యాణము | 31 |
| 22. | పరశురాముని గర్వభంగము | 32 |

## అయోధ్యా కాండము


| | | |
|---|---|---|
| 23. | శ్రీరాముని పట్టాభిషేకపు ఏర్పాట్లు | 34 |
| 24. | మంథర దుర్బోధ | 34 |
| 25. | కైకేయి వరాలు - శ్రీరాముని వనగమనం | 35 |
| 26. | గుహుని స్వాగతము | 38 |
| 27. | భరద్వాజుని ఆశ్రమము | 39 |
| 28. | దశరథుని మరణము | 40 |
| 29. | భరతుడు అడవికి బయలుదేరుట | 41 |
| 30. | భరతుడు శ్రీరాముని కలుసుకొనుట | 41 |
| 31. | పాదుకా పట్టాభిషేకము దండకారణ్య ప్రవేశము | 42 |


## అరణ్యకాండము


| | | |
|---|---|---|
| 32. | అగస్త్యుని కానుక | 44 |
| 33. | పంచవటిలో నివాసము | 44 |
| 34. | శూర్పణఖా పరాభవము | 45 |
| 35. | ఖరదూషణాదుల వధ | 46 |
| 36. | బంగారు లేడి | 46 |
| 37. | సీతమ్మ నిందా వాక్యములు | 48 |
| 38. | మాయా జంగము | 49 |
| 39. | జటాయువు సాహసము | 50 |
| 40. | కళావిహీనమైన పర్ణశాల | 51 |
| 41. | కబంధుని శాప విమోచనము | 52 |
| 42. | శబరి ఆతిధ్యము | 53 |

## కిష్కింధా కాండము


| | | |
|---|---|---|
| 43. | అంజనీ పుత్రుని కలియుట | 54 |
| 44. | సుగ్రీవునితో మైత్రి | 54 |
| 45. | సప్త తాళములు | 55 |
| 46. | వాలి సుగ్రీవుల యుద్ధము | 56 |
| 47. | వాలి వధ | 58 |
| 48. | సుగ్రీవుని పట్టాభిషేకం | 59 |
| 49. | సీతాన్వేషణము | 60 |
| 50. | సముద్రము దాటిన వాయుపుత్రుడు | 62 |


## సుందరకాండము


| | | |
|---|---|---|
| 51. | హనుమంతుని లంకా ప్రవేశము | 64 |
| 52. | హనుమ అంతఃపుర ప్రవేశము | 65 |
| 53. | హనుమంతుడు సీతను చూచుట - మాట్లాడుట | 66 |
| 54. | స్మశానంగా మారిన అశోకవనము | 70 |
| 55. | లంకా దహనము | 71 |
| 56. | హనుమంతుడు తెచ్చిన సమాచారము | 73 |


## యుద్ధకాండము


| | | |
|---|---|---|
| 57. | రావణుడి మంత్రాంగం - విభీషణుడి దేశ బహిష్కరణ | 74 |
| 58. | సేతువు నిర్మించుట | 75 |
| 59. | మాల్యవంతుని హితవు | 76 |
| 60. | అంగద రాయబారము | 76 |
| 61. | రాక్షస - వానరుల యుద్ధము | 77 |
| 62. | కుంభకర్ణుడు | 78 |
| 63. | ఇంద్రజిత్తు మరణము | 79 |

| | | |
|---|---|---|
| 64. | లక్ష్మణుడు మూర్ఛపోవుట | 80 |
| 65. | మందోదరి ప్రార్థన | 82 |
| 66. | రావణ సంహారము | 83 |
| 67. | అగ్ని పరీక్ష | 84 |
| 68. | పుష్పక విమానము | 86 |
| 69. | సీతారామ పట్టాభిషేకము | 87 |


## ఉత్తరకాండము


| | | |
|---|---|---|
| 70. | రామరాజ్య వైభవము | 89 |
| 71. | భద్రుడు తెలిపిన దుర్వార్త | 89 |
| 72. | రాముడు సీతను విడనాడుట | 90 |
| 73. | కుశలవుల జననము | 91 |
| 74. | అశ్వమేధ యాగము | 93 |
| 75. | కుశలవులు అయోధ్యకు చేరుట | 94 |
| 76. | లవుడు అశ్వాన్ని బంధించుట | 96 |
| 77. | భరత, లక్ష్మణ - కుశలవుల యుద్ధము | 98 |
| 78. | శ్రీరామ - కుశలవుల యుద్ధము | 101 |
| 79. | వాల్మీకి - సీతను, కుశలవులను శ్రీరామునకు వప్పగించుట | 105 |
| 80. | సీతాదేవి భూ ప్రవేశము | 106 |
| 81. | కుశలవుల పట్టాభిషేకము | 107 |
| 82. | కౌసల్యాదుల నిర్యాణము | 108 |
| 83. | యముడు, రాముడు, రహస్యాలోచన - దుర్వాసాగమనము | 108 |
| 84. | లక్ష్మణుని నిర్యాణము | 110 |
| 85. | శ్రీరామాదుల అవతార సమాప్తి | 110 |
| 86. | మంగళం - ఫలశ్రుతి | 111 |

శ్రీరస్తు - శుభమస్తు

# బాలల బొమ్మల సంపూర్ణ రామాయణము

## నారదుని ఆగమనము

త్రిలోక సంచారి, పరమ భక్తుడు బ్రహ్మ మానసపుత్రుడూ అయిన నారదమహర్షి హరినామ స్మరణ చేయుచూ, తపశ్శాలి అయిన వాల్మీకి మహామునినిచూచుటకు ఆశ్రమానికి వచ్చాడు. వాల్మీకి నారదుని పూజించి, కుశల ప్రశ్నలను వేశాడు. తరువాత నారదా! నీవు వచ్చావంటే ఏదో గొప్ప విశేషమే వుంటుంది. కనుక, నీ రాకకు కారణమేమిటో సెలవీయవయ్యా'' అనగా



నారదుడు వాల్మీకియొక్క సందేహమును తీర్చుట

"ఆఁ ఏమిలేదు - నిన్ను ఒకసారి చూడాలనిపించి వచ్చాను, అంతే. అదీగాక నీవు త్వరలోనే "ఆదికవి" అవుతావని తెలిసింది''అన్నాడు నారదుడు.

"అదేమిటి నారదా! నేను ఆదికవినా? చిన్న సందేహానికి సమాధానము తెలుసుకోలేని నేను 'ఆదికవి' నెలా అవుతానయ్యా" అని ఆశ్చర్యబోయాడు వాల్మీకి.

ఏమిటి నీ సందేహం : నాకు చెబితే తీర్చగలనేమో ప్రయత్నిస్తాను" అన్నాడు నారదుడు.

అప్పుడు వాల్మీకి మహాత్మా! నారదా! ఈలోకంలో అన్ని ఉత్తమగుణములూ కలిగిన పరాక్రమ వంతుడు, సకల ధర్మ శాస్త్రములూ తెలిసిన మహాపురుషుడు యెవరైనా వున్నారా? అసలు వుంటారా?'' అని తనకు గల సందేహాన్ని తెలిపాడు.

నీకు ఆ సందేహము కలగడం సహజమే. ఎందుచేతనంటావా? సకల సద్గుణ సంపన్నుడు సమస్త శాస్త్రముల నెరిగినవాడు వుండడం అసంభవమే. అయినా యిప్పటి ప్రజల అదృష్టము వలన సకల ధర్మములూ తెలిపిన మహాత్ముడు, అజేయ పరాక్రమశాలి, అజానుబాహుడు, నీలమేఘశ్యాముడూ అయిన వాడున్నాడు. ఆయనే దశరధుని ముద్దుల తనయుడు. కౌసల్యాదేవి కంటివెలుగు అందానికి పూర్ణచంద్రుడూ అయిన శ్రీరామచంద్రుడు''అని చెప్పగా, వాల్మీకి మహానందభరితుడైనాడు. ఒక గొప్ప మనిషిని గురించి అన్వేషిస్తున్న వాల్మీకి మహామునికి, ఆవ్యక్తి దొరికిన ఆనందంతో నారదునికి సాష్టాంగ ప్రణామములు చేసి మరల పూజించినాడు. పూజలందుకొని నారదుడు హరినామ స్మరణతో ఆకాశమార్గాన వెళ్ళిపోయాడు.

## బోయవాడు - క్రౌంచపక్షి

తరువాత వాల్మీకి తన శిష్యులను వెంటబెట్టుకుని తమసా నదివైపు వెళ్లాడు. మిగుల రమణీయముగా, అతి చల్లగా నిర్మలంగా వున్న ఆ నదిని చూడగానే స్నానం చేయాలనిపించి, ఆ నదినీళ్ళవైపు వెడుతున్నాడు. అదే సమయమున ప్రక్కగా చెట్టుపైన వున్న క్రౌంచపక్షుల జంట సంతోషముతో మధురముగా పాడుతూ నున్నవి. వాల్మీకి ఆ గానాలాపమును విని అవి ఒకదానితో మరియొకటి యెంతో ప్రేమతో నున్నట్లుగా భావించి, ముగ్ధుడై వాటినే చూస్తూ నిలబడిపోయాడు.

ఇంతలో క్రూరుడైన బోయవాడొకడు అక్కడికివచ్చి, తన బాణముతో మగ పిట్టను కొట్టెను. వాల్మీకి చూస్తుండగానే ఆ బాణం దానికి తగిలి ఆ దెబ్బతో అఱచుచు క్రిందపడినది. రెండవపిట్ట ఏమియు చేయలేక యేడవసాగింది.



బోయవాడు క్రౌంచపక్షిని కొట్టుట

## బోయవాని మరణము

అది చూసిన వాల్మీకి దాని స్థితికి జాలినొంది, ఆ దుస్సంఘటన వలన కలిగిన విషాదముతో బోయ వానిని దూషించెను. ఆ దూషణ ఒక శ్లోకరూపమున వెలువడినది.

శ్లో॥ "మా నిషాద ప్రతిష్ఠాం త్వం - అగమః శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునా దేకం - అవధీః కామ మోహితం"

**శ్లోకానికి అర్థం :-** కిరాతకుడా! మన్మథ క్రీడా పారవశ్యములోనున్న క్రౌంచపక్షుల జంటలో నొక దానిని చంపినావు కనుక, నీవు యిక యెంతోసేపు జీవించవు."

వేటగానికది శాపరూపమైన శ్లోకము. అది వెలువడిన వెంటనే బోయవాడు మొదలు నరికిన చెట్టులా నేలకూలి ప్రాణాలు వదిలినాడు.

ఇలాంటి వాక్యములు తననోట రాగానే ఆశ్చర్యముతో "ఏమిటి యిలా జరిగినది? ఈ శ్లోకం బోయవానికి శాపమై, మరొకరికి దీవెన అయినదేమి" అని మరల మరల చదువుకొని వీణ తీగెలతో సమానంగా లయవేసి, పాడుట కనుకూలంగా నున్నదని




వాల్మీకి శాపము వలన బోయవాడు మరణించుట

సంతోషము చెందినవాడై వాల్మీకి బోయవాని మరణానికి, క్రౌంచపక్షి దుస్థితికి విచారిస్తూ, శిష్యులతో కూడా స్నానాదికములు ముగించుకుని ఆశ్రమానికి వచ్చాడు.

## బ్రహ్మ అనుగ్రహము

ఆశ్రమం చేరిన వాల్మీకి, శ్లోకరూపం దాల్చిన ఆ పద్యమును గురించి భరద్వాజునితో చర్చించుచుండగా, లోకకర్త అయిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయినాడు. బ్రహ్మను చూచిన వాల్మీకి మరింత ఆశ్చర్యము చెందినవాడై, పరిశుద్ధమైన మనస్సుతో ప్రణామము చేసి, పరమ పూజితమైన ఉత్తమాసనము వేసి పూజించినాడు. "దేవా! నీ సాక్షాత్కారము వలన మా జీవితాలు ధన్యమైన''నవి అని అన్నాడు. అందుకు బ్రహ్మ "వాల్మీకి! నీ జీవితం మరింత ధన్యతగాంచే మహాకార్యము నీపై నున్నది'' యని చెప్పాడు.

"మహాత్మా! నాతో పరిహాసమాడుతున్నారా? అని అడిగాడు వాల్మీకి. "లేదు మహర్షి! లోక సంబంధము పూజనీయము అయిన గ్రంథ రచనకు నాంది పలుకగలవాడవు నీవే! ఇంతకు ముందు నీ నోటివెంట బోయవాని గురించి వెలువడిన పదాలే నిన్ను ఆదికవిని



వాల్మీకి బ్రహ్మ అనుగ్రహము పొందుట

చేశాయి. ఈ రోజు అన్ని లోకాలకూ పండుగరోజు. పవిత్రమూ, పూజనీయమూ అయిన గ్రంధరాజమొకటి నీచే వ్రాయబడాలి. అందుకు నాందిగానే బోయవానిని గురించి నీవనిన పదాలే శ్లోక రూపమున వచ్చుట జరిగినది. ఆ గ్రంథము సమస్త లోకాలకి ఆదికావ్య మౌతుంది. అదే శ్రీరాముని చరిత్రం. శ్రీ సీతారామచంద్రుల కథ అంతా నీ కళ్ళముందు కనిపించేటందుకై నీకు సహాయముగా వాణి అంశను నీలో వుంచుతున్నాను. ఆ గాథలో నీవు వ్రాసే యే మాటా అసత్యము గాదు కొండలూ, నదులూ, వున్నంతకాలమూ ఆ గ్రంథం అందరిచేత అన్ని కాలాలా కూడా పారాయణ చేయబడుతూ వుంటుంది" అని చెప్పి, వాల్మీకిని అనుగ్రహించి, బ్రహ్మహంస వాహనముపై వెళ్ళి పోయినాడు. వాల్మీకి యీ సంఘటనతో చకితుడై. బ్రహ్మవరముచేత రామాయణరచనకు పూనుకొని, తాను వ్రాసే రామచరిత్రను. చదివే వారికి అనుకూలముగా యేడు కాండలుగా విభజించినాడు.

అవి : 1) బాలకాండము, 2) అయోధ్యాకాండము, 3) అరణ్యాకాండము, 4) కిష్కింధా కాండము, 5) సుందరకాండము, 6) యుద్ధకాండము, 7) ఉత్తరకాండము



# బాలకాండము

## దశరథుని రాజ్యపాలన


భారతదేశమునకు ఉత్తర భాగానగల సరయూనదీ ప్రాంతములో కోసలదేశము కలదు. ఆ దేశమును పాలించిన ధర్మస్వభావులైన సూర్యవంశపు రాజులలో మొదటి వాడయిన మనువు కోసల దేశమునకు రాజధానిగా అయోధ్యా పట్టణమును కట్టించెను. ఆయన తరువాత పాలించిన చక్రవర్తులలో ఆ పట్టణమునకు కీర్తిప్రతిష్ఠలు గలగజేసిన వారిలో ముఖ్యుడు దశరథ మహారాజు. ఆయన పాలనలో అయోధ్య భూతల స్వర్గమనిపించింది ప్రజలందరూ అన్ని విధాలా తృప్తిగానున్నారు. ధర్మము నాలుగు పాదములా నడిచి పాడిపంటలతో రాజ్యము అన్ని వేళలా కలకలలాడుతూ వున్నది.

దశరథ మహారాజునకు కౌసల్య, సుమిత్ర, కైక అను ముగ్గురు భార్యలు కలరు. ఆయనకు గొప్ప ప్రజ్ఞా ప్రభావములు గల యెనమండుగురు మంత్రులున్నారు. వశిష్ఠుడు, వామదేవుడు, గురు, పురోహితులు, రాజ్యరక్షణకు గొప్ప సైన్యమున్నది. ఎటుచూచినా అన్నివిధములా సుఖ సంతోషములు తాండవించే రాజ్యములో రాజుకు, ప్రజలకు ఒక్క కొఱత మాత్రం వున్నది. అది దశరథునికి పిల్లలు కలుగకపోవుటయే.

సంతానము కొఱకు దశరథుడూ అతని భార్యలూ చేయని వ్రతములు, దానములు లేవు. ఎన్నో పుణ్యనదులలో స్నానముచేసి, పవిత్ర క్షేత్రములన్నీ దర్శించినారు. అయినా ఫలితము లేకపోయింది. వీరుడైన కుమారుని కొఱకు యెంతగానో తపించి పోయేవారు. అదే బాధ వారిని యెప్పుడూ వేధిస్తూ వుండేది. తమతోనే సూర్యవంశము అంతరించి పోతుందేమోనని క్రుంగి, కృశించిపోతూ వుండేవారు.

# అశ్వమేధ యాగము

అదే చింతలోనున్న దశరథునికి ఒక ఆలోచన తట్టి వెంటనే మంత్రులను వశిష్ఠాది పురోహితులను పిలిపించి "అశ్వమేధ యాగము చేస్తే పుత్రసంతతి కలుగుతుందని పెద్దలు చెబుతూ ఉంటారు. అందుచేత నేను కూడా 'అశ్వమేధయాగము చేయాలనుకుంటున్నాను" అని చెప్పాడు. అది విని మంత్రులు, పురోహితులు ఆనందించారు. దశరథుడిని మరింత ప్రోత్సహించారు. దశరథుడు సరయూనది సమీపమున యజ్ఞశాలను నిర్మింపచేసి, యజ్ఞదీక్ష వహించి, ఆ యజ్ఞశాలలో ప్రవేశించినాడు గుఱ్ఱాన్ని బాగుగా అలంకరించి పూజలు చేసినాడు. తరువాత వదలివేసినాడు. సమర్థులైన వీరులు కొంతమంది ఆ గుఱ్ఱాన్ని అనుసరించి వెళ్ళారు. ఒకనాడు యజ్ఞదీక్షలో నున్న దశరథ మహారాజువద్దకు తాను నమ్మినబంటు, మిత్రుడూ అయిన మంత్రి సుమంత్రుడు వచ్చి "మహారాజా! తమ కుమార్తె శాంతాదేవీ అల్లుడు ఋష్యశృంగుడూ విచ్చేసి, తమచేత పుత్రకామేష్టి చేయించినట్లయితే తమకు పుత్రులు కలుగుతారని సనత్కుమార



దశరథుడు యజ్ఞాశ్వమును వదలుట

మహాయోగి తమకు లోగడ చెప్పియున్నాడు కదా! వారిని రప్పించి, అదికూడా చేస్తే బాగుంటుందని చెప్పగా, దశరధుడు సంతోషించి, వెంటనే తన మిత్రుడూ శాంతాదేవి పెంపుడు తండ్రి అయిన అంగదేశపు రాజు రోమపాదునకు తనకుమార్తెనూ, అల్లుడినీ తీసికొని రావలసినదిగా తగినరీతిలో ఉత్తరమును వ్రాసి పంపెను. ఆ లేఖ చేరిన వెంటనే రోమపాదుని వెంట వచ్చిన తనకూతురినీ, అల్లునీ గౌరవించి విషయము చెప్పగా, అందరూ సంతోషించారు. ఋష్యశృంగుడు దశరధుని చేత పుత్రకామేష్టి జరిపించుటకు వసంత కాలము బాగున్నదని చెప్పి ముహూర్తము నిశ్చయించి యేర్పాట్లు చేయవలసినదిగా చెప్పాడు.

దేశాలమీదకు వెళ్ళిన గుఱ్ఱము దిగ్విజయయాత్ర చేసి తిరిగి వచ్చినది. ముహూర్తము నిశ్చయించిన వసంతకాలము ప్రవేశించినది.

## పుత్రకామేష్టి ప్రారంభము

నిర్ణయించిన ముహూర్తము ప్రకారము పుత్రకామేష్టిని ఆరంభించినారు. ఋష్యశృంగాది మునులు వేదమంత్రాలతో అగ్నిహోత్రంలో హోమము చేయించినారు. ఆ యజ్ఞ హవిర్భాగము లందుకొనుటకు బ్రహ్మదేవుడూ, తదితర దేవతలూ వచ్చారు. అపుడు బ్రహ్మతో దేవతలంతా కలసి తమ బాధలను చెప్పు కున్నారు. "ఓ బ్రహ్మదేవా! రావణుని వలని బాధలను భరింపలేకున్నాము-నీ అనుగ్రహము వలన రావణుడు మరింత బల సంపన్నుడై పట్టపగ్గాలు లేక మమ్ములను చాలా క్రూరంగా బాధించుచున్నాడు. మునులు, దేవతలు గంధర్వులు బ్రాహ్మణులు ఎవరు అయినా లక్ష్యము చేయక అందరినీ అష్టకష్టాలూ పెడుతున్నారు.

సూర్యుడు సరిగా యెండకాయలేక పోతున్నాడు. వాడి పేరెత్తితే సముద్రములో కెరటాలు ఆగిపోతున్నాయి. వాయువు వాడి ప్రక్కనుండి కదలటానికే భయపడుతున్నాడు. అందుచేత వాడి నాశనము కొరకేదైనా ఉపాయము చెప్పవలసిన"దని మొరపెట్టుకొన్నారు.

అప్పుడు బ్రహ్మ "భయపడకండి. రావణుడు గర్వముతో మానవులను వానరులను లెక్కచేయక, వారివలన చావులేకుండా వరం కోరలేదు. వారిని అల్పులుగా భావించాడు. కాని, ధైర్యము చేసి ఆ రాక్షసుడిని చంపగల మానవులెవ్వరూ లేరు" అన్నాడు. బ్రహ్మ చెప్పినది విని దేవతలు సంతోషించినవారై మరో మార్గము కనిపించక తమవెంట కొంత మంది మహర్షులను కూడా తీసుకొని బ్రహ్మదేవునితో కలిసి వైకుంఠమునకు వెళ్లారు.

# దేవతలు, మహర్షులు విష్ణువుతో మొరపెట్టుకొనుట

శంఖ, చక్ర గదాధారి అయి, పాలసముద్రమున శేషపాన్పుపై పవళించియున్న శ్రీ మహావిష్ణువు దగ్గరకు వెళ్ళి భక్తితో ప్రార్థించారు.

ప్రభూ! లోకబాంధవా! శ్రీహరీ! లోకాల మేలుకోరి నిన్ను ప్రార్థించుచున్నాము. వరబలంతో రావణా సురుడు అజేయ బలపరాక్రమవంతుడై మూర్ఖత్వంతో దేవతలు, మునులు, ఆడవారు అనే విచక్షణ లేకుండ అందరినీ అనేక రీతులుగా దుర్భరమైన యాతనలు పెట్టుచున్నాడు. ఇక వాడిబాధ భరించలేము. దయామయుడవు, లోక రక్షకుడవు, ఆది మధ్యాంత రహితుడవు అగు నీవుతప్ప మమ్ములనెవ్వరూ రక్షించలేరు. మానవునిగా జన్మించి యీలోకాన్ని రక్షించు దేవా నీ శరణుకోరివచ్చినారము' అని ప్రార్థించగా



దేవతలు, మునులు మహావిష్ణువును శరణు కోరుట

ఆర్తత్రాణ పరాయణుడయిన ఆదిదేవుడు వారి ప్రార్ధనల నాలకించి, తాను అవతరించుటకుగాను, పుత్రకామేష్టి జరుపుకొనుచున్న దశరధుని తండ్రిగా నెంచుకున్న వాడయి, చిరునవ్వుతో వారికి అభయ మొసగి అంతర్ధానమయ్యెను.

## యజ్ఞ ఫలము

అదే సమయమున యజ్ఞము జేయుచున్న - ఆ హోమగుండములో నుండి చేతిలో బంగారు కలశంతో ఒక దివ్యపురుషుడు బ్రహ్మాండమైన తేజస్సుతో పైకి వచ్చాడు. దశరధుడు ఆశ్చర్యముతో ఆ దివ్యపురుషునికి ప్రణామము లాచరించి "మహాత్మా! స్వాగతం" అన్నాడు.

ఆ మహాపురుషుడు చిరునవ్వుతో "రాజా! నీవు గొప్ప అదృష్టవంతుడవు, నీ యాగానికి సమస్త దేవతలూ సంతోషముతో ఉప్పొంగిపోతున్నారు. ఈ పాయసపాత్రను స్వీకరించి



యజ్ఞ పురుషుడు పాయస కలశాన్ని దశరధుని కిచ్చుట

నీ భార్యలకు పంచి యిమ్ము. దీనిని భుజించి నీభార్యలు గర్భవతులై దైవాంశ సంభూతు లయిన కుమారులను పొందెదరు'' యని చెప్పెను. దశరధుడు సంతోషముతో ఆ పాత్రనందుకొని ఆ మహాపురుషునికి ప్రదక్షిణ నమస్కా రములు చేసెను. అంతట మహాపురుషుడు అందరూ చూస్తుండగానే యెలావచ్చాడో అలాగే అదృశ్యమైనాడు. యజ్ఞ ఫలము లభించినందుకు ఋష్యశృంగుడూ మొదలగు వారందరూ అపరిమితానందము పొందినారు.

## పుత్రోదయము

దివ్యకాంతులు విరజిమ్ముచున్న ఆ పాయసపాత్రను తీసుకొని ఆనందముతో దశరధుడు అంతఃపురమునకు బయలుదేరెను. ఈ వార్త తెలిసిన నగరమంతా శరత్కాలంలో చంద్రకిరణాలతో ప్రకాశించే ఆకాశం వలె యెంతో కాంతితో వెలిగి పోయినది. అంతఃపురము ప్రవేశించిన దశరధునికి మొదట కౌసల్య యెదురైనది. జరిగినదిచెప్పి, ఆ కలశములోని పాయసమును సగభాగము కౌసల్య కిచ్చాడు. ఇంతలో సుమిత్ర, కైక వచ్చారు. మిగిలినదానిలో సగము సుమిత్రకు, దానిలో సగము, కైకకు ఇచ్చాడు, ఇంకనూ మిగిలిన పాయసం యెవ్వరికివ్వాలి. అని యనుకొని అతిదగ్గరలో నున్న సుమిత్ర కిచ్చాడు. భార్యలు ముగ్గురూ అది భుజించిన వెంటనే సూర్యబింబములై ప్రకాశించినారు. కొద్దిరోజులకే ముగ్గురూ రాణులూ గర్భవతు లైనారు, అది మొదలు దశరధుడు పిల్లల్లేరను బాధను మరచి సంతోషముతో నుండెను.

## వానరుల పుట్టుక

లోక కళ్యాణము కొరకు వైకుంఠమును వదలి శ్రీహరి దశరధుని తనయునిగా మానవ జన్మమున అవతరించుచున్నాడు. కనుక, ఆయనకు సహాయముగా నుండుటకు కొంత సైన్యమును కూడా సృష్టించ దలచిన బ్రహ్మ, దేవతలనూ గంధర్వులనూ పిలిపించి- "భూలోకమున విష్ణువునకు సహాయముగా యిపుడే నేను ఆవలిస్తుంటే యెలుగుబంట్లలో ఉత్తముడు. సదాచార సంపన్నుడు అయిన జాంబవంతుడు సృష్టింప బడి నా నోటినుండి వెలువడినాడు కనుక మీరుకూడా మీ మీ శక్తులను బట్టి వానరులను పుట్టించండి వాళ్ళకు అమృతము త్రాగినవారికివలె ఆకలిదప్పులుండ''వని చెప్పెను. దేవతలందరూ బ్రహ్మ మాటను పాటించి యెవరి శక్త్యనుసారంగా వారు వానరులను పుట్టించసాగారు. అందు

ముఖ్యులుగా దేవేంద్రుడు వాలిని, సూర్యుడు సుగ్రీవుని, కుబేరుడు గంధమాదనుని, విశ్వకర్మ నలుని, పేరెన్నికగన్న అశ్వనీకుమారులు మైంద ద్వివిదులను, వరుణుడు సుషేణుని పర్జన్యుడు శరభుని, వాయువు హనుమంతుని, తతిమ్మా దేవతలు తమ శక్తినంతా ఉపయోగించి చీమల పుట్టవలె అరణ్యప్రాంతంలో లెక్కలేనంత వానర జాతిని సృష్టించారు. ఈ వానర మూకలో హనుమంతుడు మాత్రము వజ్రదేహుడు, కాంతిమంతుడై గరుత్మంతుని మించిన వాయువేగముగల అతిపరాక్రమవంతుడుగా జన్మించెను.

అందు వాలి మొదలైనవారు అందరిలోనూ ముఖ్యులుగా-వారు కూడా వీరులైన కుమారులను కన్నారు. ఆవిధంగా కోతులు, కొండముచ్చులు, భల్లూకములు - వాలి సుగ్రీవులు రాజులుగా అన్ని ప్రాంతాలూ ఆక్రమించి కొండలలో, చెట్ల నివాసాలు యేర్పరచుకొని, వాలి పాలనలో మహాబలవంతులయిన మానవ రూపములో జన్మించ బోయే విష్ణువునకు సహాయార్ధమై ప్రపంచమంతటా తామే అయి తిరుగుచుండిరి.

## నామకరణమహోత్సవము

మలయమారుతంతో, కోకిల గానములతో వసంత ఋతువు ప్రవేశించెను. అన్నివిధములా లోకమున ఆనందము తాండవించింది. అది చైత్రమాసం, "ఇక కుమారు లెప్పుడు కలుగుతారా?" అని దశరథుడు యెదురు చూడసాగెను. ఆ శుభతరుణం రానే వచ్చినది, నవమితిథి, కర్కాటకలగ్నంలో గురుడూ, శుక్రుడు వుండగా- పునర్వసూ నక్షత్రమున కౌసల్యకు శ్రీరామచంద్రుడు, మరునాడు కైకకు భరతుడు, ఆరెండవ రోజున సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులును జన్మించిరి. భరతుడు పుష్యమీ నక్షత్రయుక్త మీనలగ్నంలోను, లక్ష్మణ శత్రుఘ్నులు, ఆశ్లేష నక్షత్రయుక్త కర్కాటకలగ్నంలో రవి వుండగానూ జన్మించిరి.

కుమారుల జన్మదినోత్సవముల పేరుతో దశరథ మహారాజు ప్రజనుల కందరకూ సంతృప్తికరంగా ధన, కనకరాసులు దానం చేశాడు. ప్రజలు కూడా ఆనందముతో పండుగలు జరుపుకున్నారు. అప్సరసలు నాట్యముచేశారు. దేవతలు దుందుభులను మ్రోగించినారు. వందిమాగధులు స్తోత్రం చేసారు. కల్పవృక్షాలు అంతఃపురమున పుష్పవర్షము కురిపించాయి. నారదమహర్షి సంతోషము నాపుకొనలేక హరినామ సంకీర్తనము చేయుచూ అయోధ్యనుండి లంకాపురమువరకు విహరించినాడు, దివ్య తేజస్సులతో పట్టణమంతా వైకుంఠమువలె వెలుగొందినది.



పుత్రులకు నామకరణ మహోత్సవము చేయుచున్న దశరథ మహారాజు

ఒక సుముహూర్తమున దశరథుడు భార్యలతో, కుమారులతో పీటలపై కూర్చున్నాడు. కులగురువు వశిష్ఠుడు నలుగురికి పుణ్యాహవచనం చెప్పి, నామకరణం చేశాడు. కౌసల్యాదేవి కొడుకుపేరు రామ చంద్రుడు, కైకేయి కొడుకుపేరు భరతుడు. సుమిత్ర కొడుకులు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు.

శుభలక్షణములు కలిగి, దివ్యతేజస్సులతో తొలకరి మెరుపులవలె తల్లిదండ్రుల అమితానురాగంతో ఆ నలుగురు అన్నదమ్ములు ఆల్లారుముద్దుగా దినదిన ప్రవర్ధ మానులై అయిదేండ్ల వయసువారయినారు. ఒకనాడు దశరథుడు తమకుల గురు వయిన వశిష్ఠ మహామునిని పిలిపించి, నలుగురు కుమారులకు అక్షరాభ్యాసము చేయించినాడు.

## విద్యాభ్యాసము

అది మొదలు నలుగురు అన్నదమ్ములు వశిష్ఠ మహామునికి శిష్యులై వేదవేదాంగాలు, ధనుర్విద్య, గుఱ్ఱపుస్వారి మొదలగు అన్ని విద్యలు కొద్ది కాలములోనే నేర్చుకొని

యౌవనంలో అడుగుపెట్టారు. ఆ నలుగురు అన్నదమ్ములలో రెండు జంట లేర్పడినవి. శత్రుఘ్నునికి భరతునితో యెక్కువ ప్రేమ యేర్పడితే, లక్ష్మణునికి రామునిపై మరింత యెక్కువ మమకారం యేర్పడి అన్నివేళా కంటికి రెప్పలా చూచుకుంటూ రాముని వెంటనే వుండేవాడు. దశరధునికి మాత్రం అందరికన్నా రాముడంటేనే యెక్కువ ప్రేమ. రామునిలో దశరధుడు ప్రత్యేక తేజస్సును చూచుకొనేవాడు. అందుచేతనే తన ఆశలన్నీ రామునిపై వుంచుకొని, అత్యధికమైన మమకారంతో ప్రత్యేకాభిమానం పెంచుకున్నాడు.

## విశ్వామిత్రుని ఆగమనం

ఒకనాడు దశరథ మహారాజు కొలువు తీరి రాచకార్యములను గురించి చర్చిస్తున్నాడు. ఆ సమయమున విశ్వామిత్రుడు ఆ సభకు వస్తున్నాడని ద్వారపాలకులు వచ్చి చెప్పగా దశరధుడు మంత్రి పురోహితులతో యెదురు వెళ్ళి నమస్కరించి సభలోకి తీసుకొని వచ్చి అర్ఘ్యపాద్యములను యిచ్చి ఉచితాసనమును చూపించి గౌరవించినాడు. తరువాత దశరధుడు వినయముగా తమరాకకు కారణముండి ఉంటుంది. సెలవీయండి మహాత్మా''అని అడిగాడు.

అప్పుడు విశ్వామిత్రుడు "మహారాజా! నేను నీసహాయం కోరి వచ్చాను. అది నీవలన మాత్రమే అవుతుంది''అని అడిగాడు.

దశరధుడు చేతులు జోడించి "అపర సృష్టికర్తలైన తమకు నా సహాయమా? ఏమిటో'' చెప్పండి. తమవంటి మహాత్ములకు సహాయము చేసేభాగ్యము నాకు కలిగినందుకు నా జన్మధన్యత గాంచినది'' అనగా -

"రాజా! మేము లోకరక్షణార్థం యజ్ఞ మొకటి చేస్తున్నాము. కాని, రాక్షసబాధ మిక్కుటముగా నుండుచేత యజ్ఞము పూర్తియగుటలేదు. అందువల్ల యాగరక్షణకు రాముని నాతో పంపవలెను. రాక్షసులను సంహరింప గలిగినవాడు రాముడు ఒక్కడే యజ్ఞం పూర్తికాగానే నీ కుమారుని మరల క్షేమంగా తీసుకొనివచ్చి నీకు అప్ప గించగలను అని చెప్పాడు.

ఆ మాటలు విన్న దశధుడు భయముతో వణికిపోవుచు "మహానుభావా! నా కుమారుడు ముక్కుపచ్చ లారని పసివాడు, నిండా పదిహారు సంవత్సరములయినాలేవు. అటువంటి నారాముడు రాక్షసుల నెలా చంపగలడు? నేనెలా పంపగలను? పంపి నేనెలా జీవించగలను? రాముని బదులు నా సేనతో నేనే వస్తా'' ననెను.



రాముని తనవెంట పంపమని కోరుచున్న విశ్వామిత్రుడు

వెంటనే విశ్వామిత్రులు ఆసనమునుండి లేచి "ఏ సహాయమైనా మాట తప్పకుండా చేస్తానన్నావు? మాట తప్పుతావా? ఇప్పటివరకు సూర్యవంశములో ఆడినమాట తప్పినవారులేరు. కనుక యింత కాలానికైనా సూర్యవంశ ప్రతిష్ఠ నీవలన భంగము కానిమ్ము, ఇక నేను వస్తాను" అంటూ గబగబా వెళ్ళిపోతున్న విశ్వా మిత్రుని వశిష్ఠుడు ఆపుచేసి, దశరధునితో "మహారాజా! రాముని విశ్వామిత్రునితో పంపుము. విశ్వామిత్రుడు వెంటవుండగా రామునికేమీ భయము లేదు. నీకుమారుని పరాక్రమము నీకు తెలియదు కాని నాకూ విశ్వామిత్రునకూ తెలియును. అందుకే వచ్చి నీ సహాయము కోరినాడు." అని చెప్పగా, దశరధుడు వశిష్ఠుని మాటలతో తృప్తిజెంది ధైర్యము తెచ్చుకొని, రాముని పిలిచి విశ్వామిత్రునికి అప్పగించినాడు. ఒక్కనిముష మైనా రాముని విడిచివుండలేని లక్ష్మణుడు కూడా రాముని వెంట బయల్దేరాడు. వశిష్ఠునికి దశరధునికి నమస్కరించి వారి ఆశీర్వాదములు పొంది రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట ప్రయాణమైనారు.

# రామలక్ష్మణులు విశ్వామిత్రునితో వెడలుట

రామలక్ష్మణులను తీసుకొని విశ్వామిత్రుడు ఆశ్రమానికి వెడుతూ మార్గమధ్యలో చీకటి పడగానే ఒకచోట మజిలీచేసి, సూర్యోదయం కాగానే స్నానాలు ముగించుకుని, మరల ప్రయాణం సాగిస్తున్నారు. యెండ యేమిటో యెరుగకుండా అంతఃపురములో అతి గారాబముగా పెరిగే ఆ రాజకుమారులు యిరువురూ విశ్వామిత్రుని వెంట ఆ అడవులలో ముళ్ళపొదలను తప్పుకుంటూ, కాలి వ్రేళ్ళకు రాళ్ళుతగిలి రక్తం చిందుతున్నా



రామలక్ష్మణులు విశ్వామిత్రునితో అడవి మార్గమున వెడలుట

లెక్కచేయక, కాలినడకనే విశ్వామిత్రుని వెంట వెళ్ళుచున్నారు. ఆకలిదప్పులు సైతం లక్ష్య పెట్టక ఆ మహామునిని అనుసరించుచున్నారు.

ఈవిధంగా నదులు, కొండలు దాటి ప్రయాణము సాగిస్తూ దారిలో ఆయన యేది పెడితే అది తిని, నీరు త్రాగుతూవున్నారు. దారిలో అంగదేశం మొదలగు

ముఖ్యమైన ప్రదేశాలచరిత్రలను రామ లక్ష్మ ణులకు తెలుపుచూ మధ్యమధ్య మజిలీలను చేసుకుంటూ ఒకనాటి చీకటిపడే వేళకు ఒక ఆశ్రమము చేరి, అక్కడ ఆకులు పరచుకుని పడుకున్నారు. అలసిపోయివున్న రామలక్ష్మణులు సూర్యోదయం అయినా కూడా నిద్ర నుండి లేవలేకపోయారు. అదిచూసి విశ్వామిత్రుడు వారిని నిద్రలేపాడు విశ్వామిత్రుని మేలుకొలుపుతో రామలక్ష్మణులు నిద్రలేచి ముని పాదములకు నమస్కరించి, ప్రక్కనే ఉన్న గంగానదిలో స్నానాదికాలు ముగించుకున్నారు.

అప్పుడు విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు “బల-అతిబల” అనే విద్యలను ఉపదేశించాడు. “ఈ విద్యా ప్రభావం- ఆకలి, అలసట, నిద్రలేకుండా కాపాడుతుంది. అంతేగాక రాక్షసులు యెటువంటి మాయలు ప్రయోగించినా అవి మిమ్ములను యేమీచేయలేవు”అని చెప్పి, తరువాత మరల ప్రయాణము సాగించి, కొన్ని ప్రదేశములు దాటిన పిదప దూరంగా కనిపించే తోటను చూపించి “రామా! ఆ తోట మధ్యలోవున్నదే మన ఆశ్రమం, మీరు ఇక్కడనుండే విల్లంబులు యెక్కుపెట్టి రాక్షసులను యెదుర్కొనడానికి సిద్ధముగా ఉండండి. ఇక్కడ ‘తాటక’ అనే ఒక రాక్షసివున్నది. అది వెయ్యి యేనుగుల బలము కలిగిన మహాదుష్టురాలు”అని తాటక-మారీచసుబాహుల గురించి తెలిపాడు.

## తాటక వధ

రాముడు ధనుస్సును సరిచేసుకుని ఠంకారము చేశాడు. దానివలన కలిగిన శబ్దానికి సమీపంలో నున్న తాటక దద్దరిల్లిపోయి “ఎవడ్రా వాడు! చూద్దా”మని బయలుదేరి రాళ్ళవాన కురిపించసాగింది. రాముడు తన బాణములతో రాళ్ళ వానను చెదరగొట్టి ఆపాడు. “అదుగో రామా! తాటక వస్తున్నది. బాణమును వింటికి సంధించు. అని విశ్వామిత్రుడు ఆజ్ఞాపించగా రాముడు బాధగా “మహాత్మా! ఆడుదాని పైన బాణప్రయోగమా?”యని అడిగాడు.

తప్పదు రామా! ఇది యాగ సంరక్షణార్థము చెబుతున్నాను. బాణము విడువు' అని చెప్పగానే మారు మాటాడక తండ్రి ఆజ్ఞగా యాగ సంరక్షణ కొరకు రాముడు బాణమును వదిలాడు ఆ ఒక్క దెబ్బతోనే తాటక హాహాకారములను చేసుకుంటు పెద్దకొండ చరియ విరిగిపడినట్లు నెత్తురు క్రక్కుకుంటూపడి చచ్చి పోయింది. దేవతలంతా విశ్వామిత్రుని పొగడుతూ రామునిపై పూలవాన కురిపించారు. అప్పుడు విశ్వా మిత్రుడు




శ్రీరాముడు తాటకను చంపుట

రామునికి ధర్మచక్రాదులనూ, బ్రహ్మాస్త్రాన్నీ ఇచ్చి వాటి ప్రయోగ ఉపసంహారములనునేర్పి, దివ్యసుందర రూపులైన రామలక్ష్మణులతో తన ఆశ్రమం చేరాడు.

## యాగ సంరక్షణ - మిథిలా నగర ప్రయాణము

రామలక్ష్మణులు రక్షకులుగా వుండగా విశ్వామిత్రుడు యజ్ఞదీక్ష వహించి యాగం ప్రారంభించినాడు రామలక్ష్మణులు ధనుర్బాణములను ధరించి నిద్రాహారాలుమాని, యజ్ఞానికి యే అంతరాయమూ కలుగ కుండా కాపాడుతున్నారు.

ఆరవరోజు హోమగుండం బాగా మండుచున్నది. ఆ సమయంలో ఆకాశము నుండి భీకరమైన అరుపులు వినబడినవి. విచిత్రముగా రక్తవర్షం కురియసాగింది. రాముడు వెంటనే ధనుస్సు నెక్కుపెట్టి బాణం ప్రయోగించాడు. ఆ బాణ ధాటికి మారీచుడు వెళ్లి సముద్రములో పడ్డాడు. మరొకబాణం సుబాహుని ప్రాణం తీసింది. లక్ష్మణుడు రాక్షస బాధలేకుండా ఆశ్రమంపై బాణాలతో పందిరి వేశాడు. ఈ విధముగా రామలక్ష్మణుల



యాగ సంరక్షణ చేయుచున్న రామలక్ష్మణులు

రక్షణలో యజ్ఞం పూర్తి అయింది. విశ్వామిత్రాది మునులంతా వారిద్దరి పరాక్రమమునకు సంతోషించి యజ్ఞం విజయవంతంగా ముగిసినందుకు ఆనందముతో వారిని దీవించారు. విశ్వామిత్రుడు వారిద్దరినీ చేరదీసి ప్రేమతో అక్కడ చేర్చుకున్నాడు.

ఒకనాడు విశ్వామిత్రుడు రామలక్ష్మణులను దగ్గరగా కూర్చోబెట్టుకొని రాజధర్మాలు, శాస్త్ర విషయాలు చెబుతున్నాడు. అప్పుడు ఆశ్రమవాసులైన ఋషులు విశ్వామిత్రుని వద్దకు వచ్చి "మహానుభావా! మిధిలా నగరమునకు బయలుదేరుదామా మరల ఆలస్యము చేస్తే వేళ మించిపోతుందేమో!" అని అడుగగా.

విశ్వామిత్రుడు నవ్వుతూ, రామలక్ష్మణులను చూచి "రాజకుమారులారా! లెండి మిథిలా నగరాధిపతి జనక మహారాజు యజ్ఞం చేస్తున్నాడు. అది కూడా చూసివద్దాం అని లేచి నిలబడ్డాడు.



రాముని బాణములచే మరణించిన సుబాహుడు, యెగురగొట్టబడుచున్న మారీచుడు

రామలక్ష్మణులను వెంట తీసుకొని, మరికొంతమంది ఋషులు వెంట రాగా విశ్వామిత్రుడు మిథిలా నగరమునకు బయలు దేరాడు" దారిలో ఆయా ప్రదేశాల చరిత్రలను కథలుగా చెప్పుకుంటూ మధ్యమధ్యలో మజలీలుచేస్తూ సాగిపోతున్నారు.

## అహల్యా శాప విమోచనము

గౌతమముని ఆశ్రమ సమీపమునకు వచ్చుచుండగా దారిలోనున్న ఒకరాతిపై రాముని పాదధూళిపడి ఆరాయి అందాల రాశిగా మారిపోయింది. ఆ త్రిలోకసుందరి విశ్వామిత్రునికి ప్రణామము చేసి, రాముని స్తుతించినది. రాముడు అనుకోని యీ సంఘటనకు ఆశ్చర్యపడి "ఆచార్యా"! అన్నాడు.

అపుడు విశ్వామిత్రుడు "ఈమె గౌతముని భార్య అహల్య, ఇంద్రుడీమెను-మోహించి, ఈమె భర్తయింట లేని వేళ యీామెకు తనకోరిక తెల్పాడు. ఆశ్రమములో యింద్రునీ, తన ధర్మపత్నినీ చూచిన ఆగ్రహంతో "రాయివై"పొమని భార్యనూ, "వళ్ళంతా



శ్రీరామ పాద స్పర్శతో రాయి అహల్యగా మారుట

వెయ్యితూట్లుపడా''లని యింద్రునీ శపించాడు గౌతముడు ఆ యిల్లాలి శాపాన్ని యీ రోజు నీ పాదధూళి తొలగించి ఆమె గొప్పతనాన్ని వెల్లడి చేసినది!'' అని చెప్పి మరల ప్రయాణము సాగించినాడు. కొందరు ఋషులు ముందుగా వెళ్లి జనక మహారాజుతో విశ్వామిత్రుడు వచ్చుచున్నట్లు తెలిపారు.


## మిథిలలో స్వాగత సత్కారములు

పురోహితుడు శతానందుడూ, మంత్రి సామంతులూ వెంటరాగా జనకమహారాజు విశ్వామిత్రునికి యెదురేగి గౌరవంగా స్వాగతం చెప్పి ప్రక్కనేవున్న జగన్మోహనాకారులైన రామలక్ష్మణులను చూచి "మహాత్మా! వీరు..."అని అడుగగా "వీరిద్దరూ దశరథ మహారాజు కుమారులు రామలక్ష్మణులు" అని తెలుపగా, జనకుడు మరింత ఆనందము పొందినవాడై ఆ ముగ్గురినీ గౌరవ మర్యాదలతో తీసుకువెళ్ళి అతిథి సత్కారములు గావించినాడు.

# సీతా స్వయంవరం

మరుసటి రోజు సీతా స్వయంవరము యేర్పాటు కాబడినది. విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు, వివిధ దేశాల రాజులు, రాకుమారులు సభలో ఆసనముల నలంకరించి యుండగా, జనకుని సింహాసనమునకు ప్రక్కనే సీత పూలదండను చేత బట్టుకుని నిలబడి వున్నది. వీరుల బలపరాక్రమములను పరీక్షించు నిమిత్తము సభా మధ్యమున శివ ధనుస్సు గల పెట్టెను పెట్టించినారు. జనకుడు లేచి సభలోని వారినుద్దేశించి "వీరులారా! ఈ పెట్టెలో నున్న శివధనుస్సును యెక్కుపెట్టిన వానిని నా కుమార్తె సీత వివాహమాడును'' ప్రయత్నిం చండి అని చెప్పాడు.

చాలమంది రాజులు దాని దగ్గరకు కూడా వెళ్ళలేకపోయారు. వెళ్ళిన వారావిల్లును ఎత్తలేక మొగాలను దించుకొని పరాభవముతోవచ్చి కూర్చున్నారు. ఆఖరికి విశ్వామిత్రుని



శ్రీరాముడు శివధనుస్సును విరచుట

ఆజ్ఞపై రాముడా పెట్టెను సమీపించాడు. ఆ కుఱ్ఱవానిని చూచి సభలో విల్లును వీడెత్తగలడా!" అని గుసగుసలు ప్రారంభమయినవి. కాని, సభలోని వారంతా ఆశ్చర్యముతో చూచుచుండగా రాముడు ఒక్కచేతితో ధనుస్సును అవలీలగా లేవనెత్తి యెక్కుపెట్టినాడు ఫెళ ఫెళ శబ్దం చేసుకుంటూ ధనుస్సు విరిగినది. సీతాదేవిముఖంలో సంతోషము పురి విప్పిన నెమలివలె నాట్యము చేసినది. తండ్రి వెంటరాగా, రాముని సమీపించి, చేతిలో నున్న పూలమాలతో రాముని మెడను అలంకరించినది.

## సీతారాముల కళ్యాణము

జనకుడు విశ్వామిత్రునితో మాట్లాడి, దశరథ మహారాజునకు లేఖ వ్రాసి తన మనుష్యులను పంపాడు. దశరథుడు ఈ వార్తవిని ఆనందభరితుడై భార్యలతోను బంధు, మిత్ర, సామంత, పురోహితాదులతోను మిథిలకు తరలివచ్చాడు. శుభ



శ్రీరాముని మెడలో పూలమాలను వేయుచున్న సీతాదేవి

ముహూర్తము నిశ్చయించారు. ఒకే లగ్నాన నలుగురన్నదమ్ములకూ కళ్యాణ వేదికలు నిర్మించారు. శ్రీరామునికి సీతను, లక్ష్మణునికి తన సోదరుని కూతురు ఊర్మిళనూ తన తమ్ముని కుమార్తెలు మాండవీ, శ్రుతకీర్తులను భరత శత్రుఘ్నులకును ఇచ్చుటకు నిర్ణయించాడు - జనకుడు.

రంగ రంగ వైభోగంగా రమణీయమైన కళ్యాణ వేదికలపై మంగళ తూర్యారావములు మార్మోగు చుండగా కళ్యాణ మహోత్సవములు జరిపారు. ఆ జంటలను చూసిన మిథిలానగర, అయోధ్యానగర ప్రజలు ఆనంద భరితులయినారు. దేవతలు పుష్ప వర్షము, ముత్యాల వర్షము కురిపించారు. తదుపరి జనకుడు తన కుమార్తెలను అత్తమామలకు అప్పగించాడు. దశరథుడు వధూవరులను తీసుకొని విశ్వామిత్రుని వద్ద సెలవుతీసుకొని సపరివారంగా అయోధ్యకు ప్రయాణమయినాడు. రామలక్ష్మణులు విశ్వామిత్రునికి పాదాభివందనములు చేసి ఆయన వద్ద సెలవు తీసుకున్నారు.

## పరశురామ గర్వభంగము

దారిలో ఆపశకునములు కలిగినవి. మిథిలానగరం పొలిమేర దాటుచుండగా ప్రళయకాల మేఘము గర్జించినట్లుగా పెడబొబ్బలతో విపరీతముగా క్రమ్మిన చీకట్లను చీల్చుకుంటూ దట్టమైన జడలతో భుజము మీద గుండ్రగొడ్డలి కలిగి, చేతితో పెద్దవిల్లు పట్టుకొని పరశురాముడు వస్తూనే 'ఆగండి' నన్ను కాదని యెక్కడకు వెడతారు. అని గట్టిగా అరిచాడు. ఆ అరుపులకు అందరూ గజగజావణికిపోవుతుండగా, పరశురాముడు ఎవడురా శివధనుస్సును విరిచిన ఆ రాముడూ? యని గర్జించాడు అది విని శ్రీరాముడు చిరునవ్వుతో..... రథం దిగి వచ్చాడు.

దశరథుడు భయపడి ముందుకు వచ్చి 'భార్గవరామా! క్షత్రియులపై నీకింకా కోపం పోలేదా? నాకుమారుడు చిన్నవాడు. అతనిపై నీ కెందుకయ్యా అంతకోపము. రాముడిని యేమీ చేయకు అని చాలా దీనంగా ప్రార్థించాడు. పరశురాముడు దశరథుని మాటలు వినక, రాముని వంక చూసి "రామా! నా గురువగు శివుని విల్లును విరిచావు. అది విరిచి పేరునిగా విఱ్ఱవీగుచున్నావు. నీవు నిజముగా రాజువే అయితే, అజేయ బలసంపన్నుడవే అయితే, నా ధనుస్సు నెక్కుపెట్టు అన్నాడు.



పరశురాముడు శ్రీరాముని శరణు కోరుట

వెంటనే రాముడు పరశురాముని చేతిలోనున్న విల్లును తీసుకుని త్రాడుకూర్చి అవలీలగా యెక్కుపెట్టి, "పరశురామా! ఎక్కుపెట్టిన నా బాణానికి వుపహారముగా నీ పాదములు...." అని అంటూండగానే పరశు రాముడు భయపడి వద్దు వద్దు, నా పాదములు నరకవద్దు నేను సంపాదించిన పుణ్యశక్తిని నీకు సమర్పిం చుకుంటాను. నన్ను వదులు"అని ప్రార్థించి, "నీకు అన్ని వేళలా శుభము కలుగును" అని దీవించి వెళ్ళి పోయాడు. దశరథుడు రాముని ప్రతాపమును గ్రహించి ఆశ్చర్య - ఆనందములతో కౌగిలించుకున్నాడు. అందరూ సంతోషంతో అయోధ్య చేరారు దశరథుడు కొడుకులనూ కోడళ్ళనూ చూచుకొని మురిసి పోతుండేవాడు. ఇక అత్తలు సరేసరి. కోడళ్ళమీద యీగలు కూడా వాలనీయని విధంగా చూచుకుని ఆనందపడుతున్నారు.



# అయోధ్యాకాండము

## శ్రీరాముని పట్టాభిషేకపు ఏర్పాట్లు

ఒకనాడు దశరథుడు మంత్రి పురోహితాది ముఖ్యులను పిలిపించి పెద్ద సభ యేర్పాటు చేసినాడు. అంతా సమావేశమైవుండగా వశిష్ఠునితో "గురుదేవా! నాకు వయస్సు పెరిగినది. ఇక రాజ్యభారము వహించ లేను. రామునికి పట్టాభిషేకము చెయ్యాలని అనుకుంటున్నాను. మీ అభిప్రాయమేమిటో తెలియజేయండి" అన్నాడు. "మంచిది, అందరికన్నా పెద్దవాడూ, సమర్థుడూ కనుక, శ్రీరామునికి పట్టాభిషేకము జరిపించుటయే మంచి"దన్నాడు వశిష్ఠుడు. ముహూర్తము నిర్ణయించి, సీతారాములకు పట్టాభిషేకానికి ముందు అవలంబిం చవలసిన దీక్షనిచ్చి, వుపవాస వ్రతము చేయించినాడు. ఈ వార్త తెలిసిన అయోధ్యా నగరవాసులు సంతోష తరంగాలలో మునిగిపోయి నగరమంతా అలంకరించారు. ఎటుచూసినా - తోరణాలు, పువ్వులు, మంగళ వాద్యాలు, నాట్యాలతో నగరమంతా నిమిషాలమీద చాలా కోలాహలంగా - చూడముచ్చటగా మారిపోయింది. ఆ రాత్రి నగరమంతా దీపాలతో కలకలలాడుతూ వింత వెన్నెలను విరజిమ్ముతూవుంది.

## మంథర దుర్బోధ

ఈ విధముగా నగరమంతా ఆనందంగా వుంటే కైకేయి చెలికత్తె మంథరకు మాత్రము కడుపుబ్బుగా వున్నది. రామునికి పట్టాభిషేకము చేయడము దాని కిష్టములేదు. ఎలాగయినా యీ పట్టాభిషేకము చెడ గొట్టాలనే తలంపుతో కన్నీరు కార్చుకుంటూ కైకేయి దగ్గరకు వెళ్ళింది. కైకేయి మంథరను చూచి "ఏమే అలాగున్నావు? ఆ కన్నీరెందుకు? ఏమయింది చెప్పవే?" అన్నది. "నాకేమి అవలేదమ్మా! నీకే జరగరాని అన్యాయం జరుగుతున్నది. అందుకే నాకు బాధగానున్నది కైకమ్మా! ఒకవైపు రామునికి పట్టాభిషేకము చేయుటకు యేర్పాట్లు జరుగుతున్నాయమ్మా"అంది మంథర-

ఈ వార్త వింటూనే కైకేయి యెంతగానో సంబరపడింది. ఒసేమంధరా! ఎంత మంచివార్త చెప్పావే! నా చిన్నారి రామునికి పట్టాభిషేకమా! ఆ రాముడు నాకన్నులకు వెలుగే! అటువంటి రామునికి పట్టాభి షేకమా! నాకు ఇంతకన్నా సంతోషము యేమున్నది!" అంటూ కానుక లీయబోయింది, మంధర తీసు కోలేదు. ముఖం మాడ్చుకుని "అంత సంతోషం యెందుకమ్మా? నీ సవతి కౌసల్య దగ్గర వూడిగం చేయడానికా? రామునికి పట్టాభిషేకం అయితే నీకు జరిగేది కీడేగాని మేలు కాదు. అలాగే జరిగితే దశరథుని తరువాత నీవు కౌసల్యకూ, నీ కొడుకు రాముడికి సేవచేస్తూ బ్రతకాలి" అంటూ మంధర లేనిపోనివన్నీ నూరిపోసింది. ఆమె మాటలకు లోబడిపోయి అయితే యిప్పుడు నన్నేమి చెయ్యమంటావే'అని అడిగింది. కైకేయి "గతంలో నీకు నీభర్త రెండువరాలు ఇస్తాననీ వాగ్దానం చేశాడు కదా! అవి ఇప్పుడు అడుగు, ఒకటి భరతునికి పట్టాభిషేకము. రెండు శ్రీరాముని పదునాలుగేండ్లు వనవాసానికి పంపుట, ఇలా అడగకపోతే యిక నీ యిష్టం నేను వెళ్ళిపోతాను, రాణిగా నిన్ను చూచిన యీ కనులు దాసీగా చూడలేవు. అయినా ఒకటి ఆలోచించు, యేది అయినా నీకు చెప్పకుండా చేయని మహారాజు పట్టాభిషేకం గురించి నీతో మాట మాత్రమయినా చెప్పాడా? వాడు నీరాముడన్నావే? మరి ఆరాముడైనా వచ్చి చెప్పాడా? ఎందుకొచ్చిన మమకారమమ్మా యిది? వస్తా"నంటూ వెళ్ళిపోయింది మంధర, అవును, మహారాజు తనకెందుకు చెప్పలేదు? మంధర చెప్పినది నిజమే కాబోలు"అని ఆలోచించిన కొలదీ అనుమానంగా తోచి, కోపం పెరిగి. జుట్టు విరియ బోసుకుని, యేడుస్తూ కోప గృహమును ప్రవేశించి, అలకపాన్పు నెక్కింది కైక.

## కైకేయి వరాలు - శ్రీరామ వన గమనం

కైకేయి అంటే దశరథునికి ప్రేమ. రాముని పట్టాభిషేక విషయము చెబితే సంతోషించేవారిలో కైకేయినే మొదటి వ్యక్తిగా భావించి, కౌసల్యా మందిరానికి కూడా వెళ్ళకుండా, దశరథుడు కైకేయి మందిరానికి వచ్చాడు. కాని, కైకేయిని ఆపరిస్థితిలో చూచి నీరుగారిపోయాడు. "దేవీ ! ఏమిటిది? ఇలాగున్నావేమిటి? నీకేమి కావాలి? యెవరేమన్నారు? కారణం చెప్పు"మన్నాడు.

కైకయి యేడుస్తూ "ఎవరేమన్నా బాధపడవలసిన అవసరం లేదు. అయినా యేమయినా కావాలంటే మాత్రం నాకు యెవరిస్తారు?"అన్నది. "ఏమిటి? ఈరోజు చాలా విచిత్రంగా మాటలాడుతున్నావు? నీకు యింత వరకు కావాలన్నది యెవరిస్తున్నారో

వారే యిస్తారు. అడుగు దేవీ?'' "అయితే నాకు యిదివరలో మీరు వాగ్దానం చేసిన రెండు వరాలు యిప్పుడే కావాలి, ఒకవేళ-''

"సందేహం దేనికి దేవీ! తప్పకుండా ఇస్తాను, ఈ శుభసమయంలో అందరి ఆనందమే నా రామునికి రక్ష, ఏమి కావాలో చెప్పు దేవీ!'' అని అన్నాడు దశరథుడు. 'ఒకటి-భరతునికి పట్టాభిషేకము చేయాలి. రెండు-రాముని పదునాలుగేండ్లు వవవాసానికి పంపాలి'' అని కైకేయి అడిగినది.



దశరథుని వరాలు కోరుతున్న కైక

ఆ మాటలు విన్నంతనే దశరథుడు పిడుగు పడినట్లుగా ఆదిరిపడి గజగజా వణికిపోతూ, మొదలు నరికిన అరటిచెట్టులా కూలిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి 'కైకా! ఇవేమి మాటలు? ఇవి నీవు కావాలనే ఆడుగుతున్నావా? లేక, పరిహాసానికి అడుగుతున్నావా? వద్దు కైకా'' వద్దు, నా చిన్నారి రాముని అడవుల పాలు చేయకు. నీ చేతులతో అల్లారుముద్దుగా పెంచుకున్న నీ రాముడికి అంత కఠినశిక్ష విధించకు రాముడు

నీకేమి అన్యాయం చేశాడని యిలాంటి శిక్ష విధించావు? చెప్పు కైకేయి! పరిహాసానికి అడిగానని చెప్పు. అలాచెప్పి నా ప్రాణాలుదక్కించి నీరాముడిని కాపాడుకో!"

"వీల్లేదు, మీ హితోక్తులతో నాకు పనిలేదు ఇచ్చినమాట నిల్పుకుంటారో అడి తప్పుతారో నిర్ణయించు కోండి! నా నిర్ణయానికి తిరుగులేదు." అంది కైకేయి, దశరధుడు ఆమె నిర్ణయానికి భయపడి మూర్ఛ పోయాడు. అది తెలిసిన రాముడు పరుగు పరుగున వచ్చి కైకేయికు నమస్కరించి "ఏమిటమ్మా? తండ్రికి బాగుండలేదని కబురు పంపారు. కారణమేమిటో చెప్పు"మని అడిగాడు.

దయాదాక్షిణ్యాలు కోల్పోయిన కైక "రామా? నీ తండ్రి నాకు రెండు వరాలు వాగ్దానం చేసి యున్నారు. అవి ఇప్పుడు ఇస్తానన్నారు...." అని వివరంగా చెప్పబోతూవుండగా "ఏమిటమ్మా ఆ వరాలు" అని శాంతంగా అడిగాడు రాముడు. ఏమంత కష్టమైనవి కావు ఒకటి నీవు పదునాలుగేండ్లు వనవాసమున కేగుట, రెండు భరతునికి పట్టాభిషేకము జరిపించుట."



నారబట్టలతో వనవాసముల కేగుచున్న సీతారామలక్ష్మణులు


"అమ్మా ఎంత మంచి వరాలు కోరావమ్మా! రాజ్యభారం తమ్మునికి అప్పగించి నాకు యెంత స్వేచ్ఛ కలుగజేశావమ్మా! నీ వరాలు నెరవేర్చి నాతండ్రి సత్యవ్రతానికి మరింత వన్నె తెస్తానమ్మా!'' అంటూ రాముడు కైకకు పాదాభివందనము చేసి, తండ్రితో జెప్పుమనీ కైకేకు చెప్పి, బయలుదేరాడు, వెంటనే కైకేయి ఇచ్చిన నారబట్టలు ధరించి, కౌసల్యా సుమిత్రలకు ధైర్యము చెప్పి, వారిని వోదార్చి శలవు తీసుకున్నాడు. ఎన్ని మాటలు జెప్పినా వినక, సీత రాముడినే అనుసరించినది. ఈవిషయము తెలిసి లక్ష్మణుడు కూడా సుమిత్రనుండి ఆశీస్సులు పొంది, కౌసల్యకు మ్రొక్కి వారబట్టలు ధరించి రామునితో బయలుదేరాడు.

దశరధుని ఆజ్ఞపై రథము తేబడినది, వారు ముగ్గురును రధముపై ఆసీనులై వెళ్ళుచున్నారు. అయోధ్యా పురప్రజలంతా రధాన్ని చుట్టిముట్టి గోడుగోడున విలపించారు. వెళ్ళవద్దని ప్రాధేయపడినారు. రాముడు అందరినీ ఓదార్చినాడు రథము ముందుకు సాగింది. వేలాది ప్రజలు ఇంకా రథాన్ని వెంబడించి వెళుతూనేవున్నారు, కొంతదూరము వెళ్ళిన తరువాత అందరినీ మరొకమారు ఓదార్చి పంపివేశాడు రాముడు. శృంగిబేరపురం చేరిన తరువాత, తండ్రిని జాగ్రత్తగా చూచుకోమనిచెప్పి, సుమంత్రుడిని కూడా వెనుకకు పంపి, సీతాలక్ష్మణులతో గంగాతీరము చేరుకొన్నాడు శ్రీరాముడు.

## గుహుని స్వాగతము

ఆ గంగానదీ తీరమున సీతారామలక్ష్మణులు ఒక చెట్టుక్రింద కూర్చున్నారు. ఈవిషయం తెలిసిన శృంగిబేరపురానికి రాజైన గుహుడు బంధుమిత్ర సపరివారముగా రామచంద్రుని దర్శనానికి వచ్చాడు. శ్రీరాముని వేషమును చూచి గుహుడు ఆశ్చర్యముతో కంగారుపడి విషయమంతా తెలుసుకొన్నాడు. శ్రీరాముని కౌగిలించుకొని రాత్రి అక్కడనే గడిపినాడు.

తెల్లవారినది, రామాజ్ఞతో గుహుడు పడవను అలంకరించి సిద్ధముచేసి సీతారామ లక్ష్మణులను గంగానది ఆవలి గట్టుకు చేర్చి, శ్రీరాముని దీవెనలు పొంది దుఃఖిస్తూ వెనుకకు మరలినాడు, ఈ విధంగా గంగానదిని దాటి సీతారామలక్ష్మణులు దక్షిణతీరం చేరుకున్నారు. సీతా! ఇకముందు అంతా మనం కాలినడకనే ప్రయాణం చేయాలి' అని



సీతారామ లక్ష్మణులను గుహుడు నావపై గంగానదిని దాటించుట

శ్రీరాముడు అనగానే స్వామీ నాకేమి శ్రమలేదు మీరు వెంట వుండగా నేనెంత దూరమయినా నడవగలను''అంటూ రాముని అనుసరించినది సీత.

## భరద్వాజుని ఆశ్రమము

సీతారామ లక్ష్మణులు కొంతదూరమేగి ఒక ఆశ్రమాన్ని చేరారు. ఆ ఆశ్రమాధిపతి అయిన భరద్వాజ మహాముని సీతారాములక్ష్మణుల వనవాస వృత్తాంతమును దివ్యదృష్టి వలన తెలుసుకొని. ఆ ముగ్గురినీ తగురీతిని సత్కరించి ఆరాత్రికి తన ఆశ్రమంలోనే వుండుడని చెప్పాడు. ఆహారముగా ఫలములు, కందమూలాలు ఇచ్చి ఆకలి తీర్చినాడు. "నాయనా! రామా! మీరు పడుకోవడానికి నేనేమి యివ్వగలను? కనీసం చాపయినా లేదుగదా! అన్నాడు బాధగా.

రాముడు నవ్వుతూ మహానుభావా! మీ అతిథ్యము చాలాబాగున్నది. ఆశ్రమాలలో హంస తూలికా తల్పాలు యెలా వస్తాయి? ఫరవాలేదు. మేము పడుకొంటాం. మీరు 'క్షమించండి' అని చెప్పి భరద్వాజుని పంపి, ఒక ప్రక్కగా కటికనేలపై పరుండినారు.

తెల్లవారగానే సీతారామలక్ష్మణులు భరద్వాజుని వద్ద శలవు తీసుకొని, మరల నడక సాగించి, చిత్రకూట పర్వతాన్ని చేరుకున్నారు. చుట్టూవున్న ప్రదేశమంతయు పూలచెట్లతో చూడముచ్చటగా తయారుచేసి మధ్యగా పర్ణశాల నిర్మించాడు లక్ష్మణుడు. యెదురుగా మాల్యవతీ నది ప్రవహిస్తున్నది. అయోధ్య విడిచి అడవుల పాలయినామనే బాధ లేకుండా అందమైన ఆ పర్ణశాలలో వుంటూ ఆ చుట్టుప్రక్కల మహామునులను సేవిస్తూ కాలం గడుపుతున్నారు.

## దశరథుని మరణము

సుమంత్రుడు అయోధ్యచేరి దశరథునితో "సీతారామలక్ష్మణులు సురక్షితముగా అడవులలో ప్రవేశించినా''రని చెప్పి, శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. శ్రీరాముని వియోగం సహించలేని దశరథుడు రాముడు అడవులలో ప్రవేశించినాడనే బాధ భరించలేక "రామా-రామా'' అంటూ ప్రాణాలు వదిలాడు. రాణులు ముగ్గురూ శోకదేవతలవలె దశరథునిపైబడి యేడ్చారు. పురజనులూ, వశిష్ఠాదిమంత్రి పురోహితులు వచ్చారు. దశరథుని మరణవార్త అయోధ్యనే స్మశానవాటికగా మార్చివేసినది. తాతగారింట వున్న భరత శత్రుఘ్నులకు అసలు విషయం చెప్పకుండా తీసుకొని రమ్మని చెప్పి వశిష్ఠుడు దూతలను పంపాడు. తరువాత రాణులకు ముగ్గురకూ శాంతి వచనాలు చెప్పి అంతః పురానికి పంపాడు.


భరత శత్రుఘ్నులు - విషయమేమిటో తెలియక గాబరాపడి వెంటనే వచ్చారు. అంతఃపుర ప్రవేశముతో- రాముని వనవాసము మొదలు తండ్రి మరణము వరకు జగిదినదంతా తెలసుకొని దుఃఖముతో కృంగి పోయారు. భరతుడు బాధపడుతూ యింత అనర్థానికి కారణం తన తల్లేనని తెలిసి, మరింత క్రుంగిపోయాడు. కోపంతో తల్లి దగ్గరకు వెళ్ళి ఆమెను నిందించి, కౌసల్య వద్దకేగి ఆమె పాదాలపైబడి రోదించాడు. కౌసల్య భరతుని దగ్గరకు తీసుకొని కన్నీరు తుడిచి "విచారించి మనం చేయగలిగినది యేముంది నాయనా! నేను చాలా దురదృష్టవంతురాలను. కంటికి వెలుగైన రాముడు అడవి కేగాడు. ఇంటికి వెలుగైనా పతిదేవుడు స్వర్గానికేగాడు. అయినా మొండిదానినవటం చేతనో, లేక యింకా యెన్ని అనర్థాలను చూడాలనో నేను మాత్రం బ్రతికేవున్నాను. ఏడవకు, వెళ్ళి నీ తల్లిని చూడునాయనా'' అని ఓదార్చి పంపినది. వశిష్ఠాది ప్రముఖులు దగ్గర నుండి భరత శత్రుఘ్నులచే యధావిధిగా దశరథుని అంత్యక్రియలు జరిపించారు, తరువాత దశరథుని పేరుతో విరివిగా దానధర్మాలు చేయించారు.

## భరతుడు అడవికి బయలుదేరుట

అశుచి తీరగానే ఒకనాడు శ్రీరాముని తీసుకొని వచ్చుటకు నిర్ణయించుకొన్న భరతుడు అడవికి బయలుదేరారు. వశిష్ఠాది మునులూ, ముగ్గురు తల్లులూ, శత్రుఘ్నుడు మంత్రులు, పురజనులు వెంటరాగా భరతుడు బయలుదేరాడు. మార్గమధ్యమున శ్రీరామచంద్రుడి నివాసమెక్కడ? అని అడిగి తెలుసుకుంటూ ముందుకుసాగారు. చిత్రకూట పర్వతం వద్దవున్నారని తెలిసి, అంతా అక్కడికి చేరారు.

## భరతుడు శ్రీరాముని కలుసుకొనుట

పర్ణశాలవద్ద పచార్లుచేస్తున్న లక్ష్మణుడు కొంతదూరంలో వుండగానే భరతుని సేననూ చూసి, అనుమానంతో రాముని సమీపించి "అన్నా! భరతుడు సైన్యముతో వస్తున్నాడు" అంటూ ధనుస్సును సిద్ధము చేసుకున్నాడు. రాముడు నవ్వుతూ "లక్ష్మణా! కంగారు పడకు, అతను మనయోగక్షేమములు తెలుసుకొనుటకే వస్తున్నాడు. భరతుని ప్రేమ



శ్రీరామునికి ప్రణమిల్లుచున్న భరతుడు

యెటువంటిదో నాకు తెలుసు శాంతించు''అన్నాడు. సేనను పర్ణశాల సమీపమునవుంచి, ముఖ్యులను మాత్రము వెంటబెట్టుకుని శ్రీరాముని దరిజేరిన భరత శత్రుఘ్నులు రాముని పాదములపైబడి యేడ్చినారు. శ్రీరాముడు వారిద్దరను లేవనెత్తి, ప్రక్కన జేర్చుకొని, కుశల ప్రశ్నలు వేసినాడు. తండ్రి మరణవార్త విని, చాలా దుఃఖించాడు. కౌసల్య, కైకేయి, సుమిత్రలకు, వశిష్ఠునకు పాదాభివందనములు చేసి అందరి యోగక్షేమములు విచారించాడు.

## పాదుకా పట్టాభిషేకము శ్రీరాముని దండకారణ్య ప్రవేశము

తరువాత భరతుడు, రాముని అయోధ్యకు రమ్మని ప్రార్థించాడు. "అన్నా! రాజ్య భారము నేను మోయలేను. నీవే భారము మోయగల సమర్థుడవు. కాబట్టి, అయోధ్యకు రా, పట్టాభిషేకం చేసుకో"యని ఎంతగానో చెప్పాడు. అయినా కూడా రాముడు "భరతా! తండ్రిగారి సత్య వ్రతమునకు మనము భంగము కలుగనీయరాదు. ఇప్పుడు నేను



శ్రీరాముని పాదుకలు శిరస్సున ధరించి వెళుతున్న భరతుడు

నీతో వచ్చి సూర్యవంశానికే కళంకము తీసుకురాలేను. మనం వంశగౌరవాన్ని పెంచాలేగాని, దాన్ని అపకీర్తిపాలు చేయకూడదు. అమ్మగారికి నేనిచ్చినమాట నిలబెట్టుకోవాలి. కనుక, తల్లిగారి కోరిక ప్రకారము నీవు రాజ్యభారం వహించక తప్పదు''అని చెప్పాడు.

"సరే అన్నా! నీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను. కాని నీ పాదుకలను యిమ్ము, వాటికి పట్టాభిషేకం చేసి, సింహాసనంపై వుంచి, మీరు ముగ్గురూ వచ్చేవరకూ నీ పేరుతోనే రాజ్యభారం వహిస్తాను.'' గడువు పూర్తికా గానే మీరు రాకపోతే నా దేహాన్ని అగ్నికి ఆహుతి చేస్తాను''అని చెప్పాడు. వశిష్ఠుని ఆదేశముతో రాముడు తన పాదుకల నీయగా, భరతుడా పాదుకలను తన తలపై పెట్టుకొని అయోధ్య చేరాడు. పాదుకలకు పట్టాభిషేకం జరిపించి, భరతుడు శత్రుఘ్నునితో కలసి జటలు, నారబట్టలు ధరించి అయోధ్య సమీపమున గల నంది గ్రామంలో వుంటూ కందమూలములే ఆహారముగా తీసుకుంటూ రాజ్యభారం వహించాడు.

భరతుడు వచ్చి వెళ్ళిన కొద్ది రోజులలోనే ఒకనాడు రాముడు లక్ష్మణుని పిలిచి "తమ్ముడూ! మనం అయోధ్యకు చాలా దూరంగా వెళ్లిపోవాలి. ఇక్కడే వుంటే మనలను చూడటం కోసం అయోధ్యలోని ప్రజలు తరచు రావచ్చును''అని చెప్పి, సీతను తీసుకుని అక్కడి మునిదంపతుల ఆశీర్వాదము పొంది, ఆ ముని ఆదేశముతో దండకారణ్యాము ప్రవేశించారు.

**విన్నపమాలకించు రఘువీర! నహి ప్రతిలోకమందునా**
**కన్న దురాత్ముఁడున్, బరమ కారుణికోత్తమ! వేల్పులందు నీ**
**కన్న మహాత్ముఁడున్, బతిత కల్మష దూరుఁడు లేఁడునాగ, వి**
**ద్వన్నుత నీవె నాకు గతి, దాశరథీ! కరుణాపయోనిధీ ॥**

తాత్పర్యము :- స్వామీ! రఘువీరా! శ్రీరామా! నామనవియొకటున్నది వినుము. ఈ లోకమున నాకన్న దుర్మార్గుడు పాపిలేడు. తండ్రీ! దేవతలలో నీకంటె జాలి కలవాడు, పతితుల బాధలను పాపములను పోగొట్టువాడు వేరొకడు లేడు. అని పెద్దలందురు. ఇట్టి స్థితిలో స్వామీ! నాకు రక్షణ నిచ్చుటకు నీవే గతి. స్వామీ దయను జూపుము.



# అరణ్యకాండము

## అగస్త్యుని కానుక

దండకారణ్యమున మునులు, ఆశ్రమాలు యెంత యెక్కువగా నున్నవో రాక్షసబాధ కూడా అంత మిక్కుటముగానూ నున్నది. సీతారామలక్ష్మణులు మునులను దర్శించి వారి ఆతిథ్యమును తీసుకున్నారు. రాక్షస బాధ లేకుండా చేస్తానని వారికి అభయమిచ్చి వారివద్ద సెలవు తీసుకొని-రాముడు, సీతా లక్ష్మణులతో అక్కడనుండి ప్రయాణము సాగించి దారిలో అగస్త్య మహాముని ఆశ్రమము చేరాడు. అగస్త్యుడు వారికి ఆపూట ఆశ్రమములోనే ఆతిథ్యమిచ్చి, ఆ తరువాత దివ్యశక్తులు కలిగిన ధనుస్సును శ్రీరామునకు కానుకగా యిచ్చి ఆశీర్వదించాడు. అప్పుడు శ్రీరాముడా మునికి పాదాభివందనము చేసి "మహాత్మా! మాకు శెలవియ్యండి"యని అడుగగా, "రామా! క్షేమంగా వెళ్లిరండి మరికొంత దూరమేగిన తరువాత గోదావరి కనిపిస్తుంది. దాని సమీపమున గల అందమైన చెట్లతో కూడిన ప్రదేశమే "పంచవటి". అదిమీకు నివాస యోగ్యమైనస్థల"మని చెప్పి పంపాడు.

## పంచవటిలో నివాసము

సీతారామలక్ష్మణులు పంచవటిని చేరుకుని, అనువయిన ప్రదేశమున చక్కని పర్ణశాలను నిర్మించుకున్నారు. దానికెదురుగా లక్ష్మణుడు తనకై ప్రత్యేకముగా మరొక పర్ణశాలను నిర్మించుకున్నాడు. చుట్టూవున్న అందమయిన ప్రదేశములను చూస్తూ కందమూలాలు ఆరగిస్తూ కాలము గడుపుతున్నారు. ఇలా నుండగా ఒకనాడు రావణుని చెల్లెలు శూర్పణఖ ఆ ప్రాంతమునకు వచ్చి రామలక్ష్మణులను చూసి, వారి అందానికి ముగ్ధురాలై వారి వృత్తాంతము తెలుసుకున్నది.

# శూర్పణఖ పరాభవము

నీలమేఘశ్యాముడు, జగన్మోహనాకారుడైన రాముని మరువలేక కామరూపి అయిన శూర్పణఖ ఒక అందాల సుందరిగా తయారై, రాముని దరిజేరి, ప్రేమగా 'రామా!' నేనెలా వున్నాను? అని అడిగింది. రాముడు నువ్వుతూ "బాగానే వున్నావు" అన్నాడు.

"అయితే, నన్ను యేలుకో! సీత నీకు తగినది కాదు. నన్ను యేలుకుంటే నిన్ను యెన్నో విధాల సుఖపెడతాను"అంది. రాముడు దానిచేష్టలకు నవ్వుకుంటూ "పెండ్లి అయిన నేను మరొకరిని చేపట్టను"యని అన్నాడు.

"అయితే సీతను నేను మాయం చేస్తాను. అప్పుడు చేపట్టగలవా?" అంది "అదంతా యెందుకుగాని అక్కడ నా తమ్ముడున్నాడు. అతడైతేనే నీకు తగిన జోడా, వాడి దగ్గరకు వెళ్ళు" అని పంపాడు రాముడు. లక్ష్మణుడైనా తన మాయలోపడతాడనే ఆశతో లక్ష్మణుని వద్దకు చేరి అనేక విధాల ప్రయత్నిం చింది. అది చూసి లక్ష్మణుడు కోపముతో, ఆడది



లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోయుట

కనుక చంపకూడదని తలంచి, శూర్పణఖ ముక్కు, చెవులుకోసి జుట్టుపట్టుకొని బయటకు ఈడ్చినాడు.

## ఖరదూషణాదుల వధ

ఒడలంతా రక్తమై, ముక్కు చెవుల వెంట బొటబొట కారుతున్న నెత్తురుతో వికారంగా తయారైన శూర్పణఖ యేడుస్తూ తన సోదరులైన ఖరదూషణుల దగ్గరకు వెళ్లి తనకు జరిగిన అవమానమును గురించి చెప్పినది. "మానవ మాత్రుల కింతపొగరా? అంటూ కోపముతో లేచి, తమ సైన్యాలు పదునాలుగు వేలమంది రాక్షసులనూ వెంటబెట్టుకొని రామలక్ష్మణులపై యుద్ధానికి వెళ్ళారు వాళ్ళు అల్లంత దూరంలో వుండగా రాక్షస మూకను చూచిన రాముడు లక్ష్మణా! నీవు మీ వదినను జాగ్రత్తగా చూడు. నేనా రాక్షసులను సంహరిస్తాను" అని చెప్పి వెళ్ళి రాక్షస మూకను నెదుర్కొన్నాడు. పోరు ఘోరంగా జరిగినది. రామబాణాలకు రాక్షసుల తలలు పుచ్చకాయలవలె యెగిరి కుప్పలు కుప్పలుగా పడుతున్నాయి. చివరకు ఖరదూషణుల తలలుకూడా ఎగిరి నేలకూలాయి అతి బలసంపన్నులయిన తన సోదరులు కూడా చనిపోవడము చూచి, శూర్పణఖ పెడబొబ్బలు పెడుతూ, లంకాధిపతి అయిన తన పెద్దన్న రావణుని ధగ్గరకు పోయి తనకూ ఖరదూషణాదులకూ జరిగిన పరాభవాన్ని వివరించి సీత సౌందర్యమును వర్ణించి చెప్పినది.

"విచారించకు శూర్పణఖా! ఆ సీతను తెచ్చి యీ లంకలోనే నీ కళ్ళముందే ఆశోక వనమున బంధించి, ఆ రాముడికి, దానికి కూడా తగిన పరాభవము చేస్తాను. ఇక వెళ్ళు" అని చెప్పి, రావణుడు వెంటనే బయలుదేరాడు. కాని "సీతను యెత్తుకువచ్చుట అంత తేలికయిన పనికాదేమో! అన్ని వేలమంది రాక్షసులను సంహరించిన ఆ మానవుని యెదురించుట అవివేకమే ఆవుతుం"దని తలచి, మాయోపాయం చేతనే సీతను తెచ్చుటకు నిర్ణయించుకున్నాడు.

## బంగారు లేడి

'రావణుడు మారీచుని వద్ద కేగి 'మారీచా' నాకొకసహాయం కావాలి' అన్నాడు. 'జగజ్జెట్టి రావణునికి నా సహాయమా? ఏమిటో చెప్పవయ్యా నాకు సాధ్యమయినదయితే తప్పకుండా చేస్తాను' అన్నాడు మారీచుడు. "గోదావరి తీరమున పంచవటి దగ్గర రాముడనే మానవుడు భార్యా, తమ్ములతో వుంటున్నాడు. ఆ రాముని భార్య నెత్తుకురావాలి. నీ

మాయల నుపయోగించి ఆ శ్రీరాముని ఆ కుటీరానికి దూరంగా తీసుకుపోవాలి" అని చెప్పాడు.

మారీచుడు భయపడుతూ "ఆపని నావల్లకాదు" అన్నాడు. ఈపని నీ వలన కాకపోతే నిన్ను చంపడం నావల్ల అవుతుంది" అంటూ రావణుడు కత్తి దూశాడు. దానితో మారీచుడు, ఈ రావణుని చేతిలో చచ్చుటకంటే ఆ రాముని చేతిలో చనిపోవుటమే పుణ్య"మని తలచి బంగారులేడి రూపమును ధరించి సీతారాముల పర్ణశాల యెదుట గల పచ్చ గరికను మేయసాగెను.

పర్ణశాలవద్ద రామునితో కూర్చునివున్న సీత దూరముగా గరిక మేస్తున్న లేడిని చూసి "నాథా! అలా చూడండి. ఆలేడి యెంత అందముగా నున్నదో! ఆలేడిని తెచ్చి యివ్వరూ"అని కోరగా, రాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! మీ వదినకు ఆలేడి కావాలని కోరుతున్నది. నేను వెళ్ళి దానిని తెస్తాను. అంతవరకూ నీవు యీమెకు రక్షణగా వుండు"అని విల్లంబులు తీసుకున్నాడు.



సీత బంగారు లేడిని చూసి పట్టుకొని రమ్మని రాముని కోరుట

"అన్నా! బంగారులేడి సృష్టిలోనేలేదు. ఇదేదో రాక్షస మాయలావుం"దన్నాడు లక్ష్మణుడు. రాముడు నవ్వాడు "లేడి అయితే తీసుకువస్తాను, రాక్షసమాయ అయితే వధించి వస్తా"నంటూ లేడివైపు పరుగెత్తాడు.

లేడి రామునికి అందకుండా చాలాదూరం పారిపోయింది. విసిగిపోయిన రాముడు బాణం వదిలాడు. ఆ దెబ్బతో లేడి రూపంలో వున్న మారీచుడు రాముని గొంతుతో "హా లక్ష్మణా" అంటూ అరచి ప్రాణాలు వదిలాడు.



రాముడు మాయలేడిని సంహరించుట

## సీతమ్మ నిందావాక్యములు

ఆ ఆర్తనాదం విన్న సీత భయకంపితురాలై లక్ష్మణా! నీ అన్నగారికి ఏదో ఆపద వాటిల్లింది. నీ సహాయం కొరకు చూస్తున్నారేమో! వెళ్ళి నీ అన్నను రక్షించి తీసుకొనిరమ్మని కోరినది. "అమ్మా రామునివంటి పరాక్రమశాలికి యీ రాక్షసులవలన యే ఆపదా రాదు.

ఇదంతా రాక్షసుల పన్నాగమే మా అన్నకు అపాయం కలగాలంటే లోకమే కల్లోలమవ్వాలి. అపుడూ యే ఆపదారాదు'' అంటూ నచ్చచెప్ప బోయాడు.

అతని మాటలు సీత వినలేదు. పైగా 'ఎందుకీ వ్యర్థప్రలాపములు? వారి ఆర్తనాదం విని కూడా కదలుట లేదంటే నీవు చాలా దురాలోచనతో నున్నావు ... అంటూ అనరాని మాటలన్నది. లక్ష్మణుడు బాధగా చెవులు మూసుకుంటూ తల్లీ! నీవేనా ఈమాట లంటున్నది? వెళ్తానమ్మా!'' అంటూ బాణముతో పర్ణశాల ముంగిట మూడు గీతలు గీచి "వదినా ఎటువంటి విపత్కర పరిస్థితి యెదురైనా సరే యీ గీతలు దాటి మాత్రం బయటకు రావద్దు'' అనిచెప్పి, తానుకూడా రాముడు వెళ్ళినదారినే గబగబా వెళ్ళినాడు

## మాయా జంగము

ఇదే సమయమని భావించి రావణుడు జంగమ దేవర వేషములో పర్ణశాల వద్దకు వచ్చి "భవతి భిక్షాందేహి'' అనియన్నాడు.



రావణుడు జంగమ దేవరగా వచ్చి సీతను భిక్ష అడుగుట

సీత భిక్ష తెచ్చి ముంగిటనే నిలచి "భిక్ష స్వీకరించండి మహాత్మా" అంది. ఆ కపట సన్యాసి అడుగుముందుకు వేయగా అగ్నిజ్వాల లేచినది. అపుడు అచ్చటి గీతలను చూసి, పరిస్థితిని గ్రహించి, రావణుడు "భిక్ష తెచ్చిన నీవే చెంతకువచ్చి వేయాలి" అంటూ వెనుకకు జరిగినాడు.

తెచ్చిన భిక్షను వెనుకకు తీసుకొని వెళ్ళకూడదని తలచి, సీత, గీతలు దాటివచ్చి భిక్ష వేయ బోయింది. ఆ వెంటనే రావణుడు అలాగే ఆమె వున్నంత మేరా భూమితో సహా పెళ్ళగించి సీత నెత్తుకొని పోయి దూరంగా నిలిపిన రథంపై దింపి, ఆకాశమార్గమున యెగిరిపోయాడు. మోసం గ్రహించిన సీత "రామా! రామా!" అంటూ కేకలు పెడుతున్నది.

## జటాయువు సాహసము

సీత కేకలు విన్న "జటాయువు" అను పక్షిరాజు సీతను రక్షించదలచి రావణుని యెదుర్కొన్నాడు. పెద్దయుద్ధం జరిగింది జటాయువు సర్వశక్తులాపోరాడి, గోళ్ళతో రక్కి, ముక్కుతోపొడిచి, ఆఖరికి ఱెక్కలు తెగిపోవడంతో నేలకూలిపోయాడు. ఇకయేమి




జటాయువు ఱెక్కలను నరికివేయుచున్న రావణుడు

చెయ్యటానికి తోచని సీత తన చీరచెంగు చించి, దానిలో తన నగలూ అవీ మూటగట్టి మార్గమధ్యమున జారవిడిచినది. ఆ మూట ఋష్యమూకమనే కొండమీద పడింది, ఆ కొండమీద తిరుగుతూన్న వానరులా మూటను చూచి ఆశ్చర్యముతో పైకి చూశారు. రథం అప్పటికే వారి దృష్టిని దాటిపోయినది. కొద్ది క్షణాలలోనే రావణుడు లంకకుచేరి సీతను అశోకవనమున వుంచి రాక్షస స్త్రీలను కాపలా పెట్టి వెళ్ళిపోయాడు.

## కళాహీనమైన పర్ణశాల

లేడిని చంపిన రాముడు వెనుదిరిగి బయలుదేరి యెదురుగా పరుగు పరుగున వస్తూన్న లక్ష్మణుని చూచి "మీవదిననువదిలి నీవెందుకు వచ్చావు లక్ష్మణా?' అన్నాడు. "తప్పులేదన్నా! వదినగారి ఆజ్ఞ''అని చెప్పాడు. ఇద్దరూ కలిసి, గాలికన్నా వేగంగా పర్ణశాలవద్దకు వచ్చారు. కాని, సీత కనిపించలేదు. సీతా! సీతా'' అని కేకలు పెట్టాడు రాముడు. ఎక్కడా సమాధానము లేదు. "ఎంత తప్పుపనిచేశావు లక్ష్మణా! ఏదో మోసం జరిగింది. నా సీతకు యెవరో అపకారం చేశారు''అంటూ దుఃఖించసాగాడు. రాముని




శ్రీరాముని అనుగ్రహము పొందిన జటాయువు

శోకము చూసి భరించలేని లక్ష్మణుడు "అన్నా శాంతించండి! వదినెగారికి ప్రాణాపాయము జరగదు లేవండి. యెక్కడున్నా వెదికి తీసుకొని వద్దాము'' అనగా రాముడు కొంత ఊరట చెందినాడు. ఇద్దరూ సీతను వెతుకుతూ బయలుదేరారు.

అలా వెదుకుతూండగా ఒకచోట రెక్కలు తెగిన జటాయువు బాధగా మూలుగుతూ కన్పించాడు. అదికూడా రాక్షసమాయ యేనేమోనని రామలక్ష్మణులు అనుమానిస్తుండగా జటాయువు కొండంత ఆశతో "రామా! నేను నీ తండ్రికి మిత్రుడను, నా పేరు జటాయువు. నీ సీతను లంకాధిపతి రావణుడు యెత్తు కొని పోవుచుండగా వాడిని యెదిరించుటచే నాకీ గతి పట్టినది''యని జరిగినదంతా వివరించి శ్రీరాముని చేతిలో ప్రాణాలువదిలాడు. రామలక్ష్మణులు జటాయువునకు అగ్ని సంస్కారముచేసి గోదావరీ జలాలలో జటాయువునకు తర్పణం యిచ్చి మరలా బయలుదేరారు.

## కబంధుని శాప విమోచనము

మరికొంత దూరమేగిన తరువాత రామలక్ష్మణుల మార్గమునకు కబంధుడు అడ్డుపడి



కబంధుని చేతులు నరుకుచున్న రామలక్ష్మణులు

ఆమాంతముగా యిద్దరినీ రెండు. చేతులతో పట్టుకున్నాడు. అనుకోని యీ అవాంతరమునకు అన్నదమ్ములిద్దరూ ముఖా ముఖాలు చూచుకున్నారు. అప్పుడు శ్రీరాముడు నవ్వుతూ కబంధుని చేతులు నరికాడు. ఆ దెబ్బతో కబంధునికి శాపవిమోచనమై ఒక దివ్యపురుషుడుగా మారి రామునికి ప్రణామము చేసి తానొక గంధర్వు డననీ, శాపముచేత, కబంధునిగా బ్రతుకుతున్నానని చెప్పాడు. "నేటికి మీదయవలన నాకు శాప విమోచనము కలిగినదని" చెప్పి, లక్ష్మణునివలన విషయం తెలుసుకొని "రామచంద్రా? సుగ్రీవుడనే వానరరాజు ఋష్యమూక పర్వతం మీద వుంటున్నాడు. సీతమ్మను తీసుకొనివచ్చుటకు అతని సహాయం నీకు యెంతైనా అవసరం అవుతుంది కనుక సుగ్రీవుని కలుసుకొమ్మని చెప్పి వెళ్ళిపోయాడు.

## శబరి ఆతిథ్యము

రామలక్ష్మణులు చాలాదూరంగా నడచి పంపా సరస్సువైపు వెళ్ళినారు. ఆ నదితీరమున వారికి ఒక చిన్న గుడిసె కనిపించింది. అక్కడకు వెళ్ళగా దాని ముంగిట తలనెరసి ముగ్గుబుట్టలా వుండి, నడుమువంగిన ఒక పండు ముసలమ్మ కనిపించినది. రామలక్ష్మణు లామెదగ్గరకు వెళ్ళారు. ఆ అన్నదమ్ములను చూసి శబరి పరమానందం పొంది "నాయనా! రామా! ఎంతకాలానికి కరుణించావయ్యా! నీకోసమే ఎదురు చూస్తున్నాను యెప్పుడు తిన్నారో, యేమో బాగా అలసిపోయినట్లున్నారు. ఇలా కూర్చోండి నాయనలారా!" అంటూ చాపవేసి కూర్చుండబెట్టి, తాను లోపనికి వెళ్ళి ఒక పండ్లబుట్టను తెచ్చి వారి ముందుంచినది. అందులోని - ఒక్కొక్క పండును తాను ముందు రుచి బాగా రుచిగా వున్న పండ్లను మాత్రమే శ్రీరాముని కివ్వగా, శ్రీరాముడు ఆమె భక్తికి అనురక్తికి సంతోషిస్తూ ఆ యెంగిలి పండ్లనే అమృతంగా భావించి, తృప్తిగా భుజించి, ఆమెకు మోక్షం కలుగజేసి, మరలా సీతాన్వేషణకు పయనమయ్యాడు.

**డాసిన చుట్టమా శబరి? దాని దయామతి నేలినావు, నీ**
**దాసునిదాసుడా గుహుఁడు? తావకదాస్య మొసంగినావు, నే**
**చేసిన పాపమా వినుతి చేసిన గావవు, గావుమయ్య్య నీ**
**దాసులలోన నే నొకఁడ దాశరథీ! కరుణాపయోనిధీ ॥**



# కిష్కింధాకాండము

## అంజనీ పుత్రుని కలియుట

రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతం చేరుకొని దూరాన కనిపిస్తున్న వానర సమూహమును చూసి వీరితో యేవిధంగా స్నేహం చేసుకోవడమా? అని ఆలోచిస్తు న్నంతలోనే సుగ్రీవుడు రామలక్ష్మణులను చూసి, తనఅన్న వాలి పంపినాడేమోనని భయపడి తనమంత్రులలో ప్రధముడైన హనుమంతునికి వారిరువురినీ చూపించి యెవరో తెలుసుకొని రమ్మని పంపించినాడు. హనుమంతుడు బ్రాహ్మణవేషమున వారి దగ్గరకు వస్తూ "వీరు చూస్తే కాషాయ వస్త్రాలు ధరించారు. ఆ విల్లూ అమ్ములూ చూస్తే రాజపుత్రుల వలెనున్నారు. ఆ ముఖాలపై దివ్యతేజస్సు, తెల్ల తామరపువ్వులవంటి విశాలనేత్రాలు. నీలమేఘశ్యాములవలె నిగనిగలాడే శరీరకాంతి కలిగి అవతారపురుషుల వలెనున్నారు. అయినా రాజ కుమారులే అయినచో యిక్కడకు రావలసిన అవసరం యేమున్నది?" అని తనలో తాను తర్కించుకొంటూ వారివద్దకు చేరి వినయముగా "మీరు యెవరు నాయనా?" అని అడిగాడు. లక్ష్మణుడు తామెవరో తెలుపగా, రాముడు చిరునవ్వుతో 'యిప్పటికయినా మేమెవరిమో తెలిసినదా హనుమా' అన్నాడు.

"స్వామీ నీవే నా దైవానిని. సందేహము లేదు" అంటూ ఆంజనేయుడు విప్రుని వేషమును వదలి మామూలు రూపముతో రాముని పాదాలకు నమస్కరించి వారిద్దరినీ భుజాలపై యెక్కించుకుని సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్లాడు.

## సుగ్రీవునితో మైత్రి

హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవునకు పరిచయము చేయగా వారిద్దరినీ కలుసుకొన గలిగినందులకు సుగ్రీవుడు ఆనందము వెలిబుచ్చి కౌగిలించుకొన్నాడు.



హనుమంతుడు, రామ సుగ్రీవులకు అగ్నిసాక్షిగా మైత్రి కుదుర్చుట

తదుపరి హనుమంతుడు అగ్నిసాక్షిగా వారికి స్నేహం కలుగజేసి ప్రమాణాలు చేయించినాడు. తరువాత లక్ష్మణుడు సీతాపహరణ విషయముతెల్పి, వానరుల సహకారాన్ని కోరుతాడు అంతట హనుమంతుడు. "స్వామీ! మీవలెనే సుగ్రీవుడు కూడా భార్యను కోల్పోయి, అన్నయైన వాలియొక్క అకృత్యములకు గురి అయినాడు. అందుకే యీ గిరివాసము, కనుక మీ రిరువురూ ఒకరి కొకరు సహకారము చేసుకొని కృతార్థులయ్యే అవకాశం ఉన్నది." అని చెప్పగా, రాముడు "వాలిని వధించి సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపిస్తా"నని ప్రతిజ్ఞ చేశాడు.

# సప్తతాళములు

కాని, రాముడు వాలిని జయించగలడని సుగ్రీవునకు నమ్మకము కుదరలేదు అది గ్రహించిన రాముడు సుగ్రీవా? ఇంకా యెందుకీ విచారము? నీ అన్నను గెలుచుట

# వాలివధ

సుగ్రీవుడు భయపడుతూనే వెళ్ళి వాలిని మరలా యుద్ధానికి పిలిచాడు. దానితో 'పారిపోయిన పిరికిపంద మరలా వచ్చాడా?' అంటూ భార్యవద్దటున్నా వినకుండా వాలి కోపంతో వచ్చి సుగ్రీవుని యెదర్కొన్నాడు. వాలి కొట్టే దెబ్బలు భరించలేక సుగ్రీవుడు తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. ఇదే సమయమని భావించి రాముడు ఒక చెట్టు చాటునుండి వాలిపై బాణము వదిలాడు. ఆ బాణము గుండెపై తగిలి అతడు కొండలా నేలపై కూలిపోయాడు. రాముడు వాలి దగ్గరకు వచ్చాడు.

బాధతో చుట్టుకుపోతూ వాలి 'రామా! నీవుకూడా ధర్మవిరుద్ధమైన పనిచేయగలవా' అన్నాడు. దానికి రాముడు "తమ్ముని ధర్మపత్నిని బలాత్కరించి, అతనిని చంప బూనటానికి ప్రయత్నించావు. ఆది ద్రోహం కాదా? ద్రోహులను వారి తప్పులకు



చెట్టు చాటు నుండి రాముడు వాలిని వధించుట

తగినట్లుగా శిక్షించటం రాజధర్మం"అని చెప్పగా, వాలి అప్పుడే అక్కడకు చేరిన అంగదుని శ్రీరామునకు అప్పగించి రామచంద్రుని చేతిలో చావు లభించినందువలన జన్మధన్యత జెంది, ముక్తి లభించినదని భావించి తృప్తి చెందినాడు. రాముడు వాలి గుండెలో దిగిన బాణము తీయగానే శ్రీరామునకు నమస్కరించి ప్రాణాలు వదలి కీర్తి శేషుడయ్యాడు. శ్రీరాముడు సుగ్రీవాంగదుల నోదార్చి, వాలికి యధావిధిగా నమస్కారములు చేయించినాడు.



మరణించిన వాలిపై బడి విలపిస్తున్న తారా అంగదులు

## సుగ్రీవుని పట్టాభిషేకము

ఒక మంచిరోజున రాముడు సుగ్రీవుని కిష్కింధా నగరానికి రాజుగా పట్టాభిషేకము చేశాడు. తారను సుగ్రీవునకు సలహాదారురాలిగానూ, అంగదుని యువరాజుగానూ నియమించినాడు. రాముడు చేసిన యీ పనికి హనుమంతుడు మొదలైన వానర

వీరులంతా యెంతో ఆనందించారు. యిక తరువాత కార్యక్రమం సీతాన్వేషణ.

అందరి ఆలోచనా ఆ వైపుకు మరలింది కాని అది వర్షాకాలము ఆగుటచేత యేమీ చేయలేక సుగ్రీవుడు కొంత గడువు కోరాడు. మాటల మధ్యలో సుగ్రీవుడు "రామచంద్రా! మేము పర్వతము మీద ఉండగా మాకొక నగలమూట దొరికింది. అది ఆకాశమార్గమున వెళుతున్న ఒక రథము నుండి విసిరి వేయబడి వచ్చి హనుమంతుని ఒడిలో పడినది" అని చెప్పి జాగ్రత్తగా ఆ మూటను తెచ్చి, రామునికిచ్చి చూడమన్నాడు, మూట విప్పి అందులోని నగలను చూసిన రాముడు ఈ నగలు సీతవే సందేహము లేదు"అంటూ మూర్ఛపోయాడు. కొంత తడవు ఉపచర్యలు చేసిన అనంతరము లేచి కూర్చున్న రామునితో సుగ్రీవుడు "మహాత్మా? బాధపడకండి సీతాదేవి యెక్కడున్నా తెలుసుకొందాం, వానరులను అన్నివైపులకూ పంపిస్తాను" అని చెప్పాడు. శ్రీరాముడు వర్షాకాలము అంతా చాలాదుఃఖముతో గడిపాడు. నీడలా తన వెంటనే తిరిగే సీత లేకపోవుట చేత శ్రీరాముని హృదయము ఆవేదనతో నిండిపోయింది.

## సీతాన్వేషణము

శ్రీరామునకు అతికష్టముతో వర్షాకాలము గడిసింది. ఆకాశము నిర్మలంగా ఉండి తెల్లని వెన్నెలతో శరత్కాలము ప్రవేశించినది. రాముని ఆజ్ఞతో సుగ్రీవుడు వానరులను పిలిచి జట్లు జట్లుగా విడదీసి అన్ని వైపులకూ పంపాడు. కొంతమందిని ప్రత్యేకముగా తూర్పుదిశగా మైందుడను వానిని నాయకునిగా యిచ్చి పంపాడు'అలాగే పశ్చిమానికి సుషేణుని నాయకునిగా నియమించిపంపాడు. ఉత్తరదిశకు శతబలి నాయకత్వాన కొందరిని పంపాడు. దక్షిణదిశకు మాత్రము ప్రత్యేకించి అంగదుని నాయకునిగా నియమించి- జాంబవంతుడు, హనుమంతుడు మొదలగు మరి కొంతమంది సమర్ధులను అతని వెంట వెడలుటకు నిర్ణయించాడు. "సీత వృత్తాంతము తెలసినదీ లేనిదీ నెలలోగా తెలియపర్చా"లని అందరినీ కఠినముగా ఆజ్ఞాపించాడు. "జాడ తెలుసుకోకుండా వచ్చినవారికి శిరశ్ఛేదమే' అనిశాసించి పంపాడు. అంగదాదులు దక్షిణ దిశగా పయనమవుతూండగా రాముడు హనుమంతునిపిలిచి చేరదీసి "హనుమా! నీపై నాకెందుకో ప్రత్యేక విశ్వాసమున్నది. సీత జాడ తెలియజేయ గలవాడవు నువ్వేనని నా మనస్సు చెప్పుచున్నది.



హనుమంతునకు శ్రీరాముడు అంగుళీయకము నిచ్చుట

కనుక, యీ అంగుళీయకమును నీ దగ్గరుంచుకొని సీతకు నా అనవాలుగా దీనినిచ్చి, ఆమెయిచ్చిన వస్తువులు తీసుకునిరా'అని చెప్పి, తన ఉంగరాన్ని ఇచ్చాడు హనుమంతుడు. ఆ ఉంగరాన్ని తీసుకొని రామునికి తనపై గల వాత్సల్యానికి ముగ్ధుడై, శ్రీరామునికి ప్రదక్షిణం చేసి, ఆయన ఆశీర్వాదమును పొంది, సుగ్రీవుని వద్ద సెలవు గైకొని, తనవారితో కలిసి దక్షిణదిశగా ప్రయాణమయినాడు. కాని వారికి సీత జాడ తెలియలేదు. సుగ్రీవుడిచ్చిన గడువు చాలావరకు పూర్తి అయినది, ఏమి చేయడమా?' అని తమలో తాము తర్కించుకొంటూ చివరకు మహేంద్రపర్వతము చేరుకున్నారు. అక్కడ ఆగి ఆలోచించ సాగారు సీతజాడ తెలుసు కోలేక పోయినందుకు హనుమంతుడు దుఃఖించుసాగాడు. ఆ ప్రక్కనే ఉన్న జటాయువు సోదరుడు 'సంపాతి' అనే గ్రద్ద వీరిని చూచి పిలిచి, విషయం తెలుసుకున్నది. విచారించకండి సీతమ్మను రావణుడు ఈ

మార్గమునే లంకానగరము తీసుకొని పోయాడు, నేను చూశాను. కాని రెక్కలు లేకపోవుటచేత యేమీ చేయలేక పోయాను. సముద్రమునకు అవతలగా కొన్ని అమడల దూరంలో లంకా పట్టణము ఉన్నది. అదే ఆ రావణుని రాజధాని. అక్కడే ఉంటుంది సీత" అని చెప్పగా వానరు లందరూ సంతోషముతో సముద్రము దగ్గరకు చేరారు.

## సముద్రము దాటిన వాయుపుత్రుడు

ఎంత సంతోషముతో వచ్చారో, ఆ సముద్రాన్ని చూసి వానరులంత నీరుగారి పోయారు. ఒడ్డున కూర్చుని "యిది దాటడం ఎలాగ" అనుకున్నారు. అంగదుడు లేచి "నేను వెళ్ళగలను కాని, తిరిగి రాలేనేమో" నన్నాడు. జాంబవంతుడు లేచి 'నువ్వు చిన్నవాడవు, లంకలో నీకే అపాయము జరిగినా సుగ్రీవుడు మా ప్రాణాలు ఉంచడు"అని



అమితోత్సాహంతో సముద్రాన్ని దాటుచున్న హనుమంతుడు

చెప్పి, దూరముగా ఒక్కడే కూర్చుని సముద్రాన్ని చూస్తూ మార్గము కొరకు మధనపడుతున్న హనుమంతుని వద్దకు వెళ్ళాడు.

"ఆంజనేయా? ఏమిటి మౌనంగా కూర్చున్నావు? నీవు తలుచుకుంటే ఎంత కష్టమయిన పని అయినా తృటిలో చెయ్యగల సమర్థుడవు, అటువంటి నీకు యీ సముద్రము ఒక లెక్కలోనిది కాదు. శ్రీరామచంద్రుడు కూడా ఈ కార్యము నీవలన అవుతుందని నమ్మియున్నాడు. మహాబలసంపన్నుడవు, నీకు సాధ్యము కానిదేమీ లేదు బయలుదేరు నాయనా" అని చెప్పి మరెన్నో విధముల పొగిడాడు.

పైవారు చెబితేనే గాని శక్తి తెలుసుకొలేని వాడగుటచే, జాంబవంతుని పొగడ్తలతో యెనలేని బలసంపన్నుడైన ఆంజనేయుడులేచి, అంగద జాంబవంతులలో "నేను వెళ్ళివస్తాను. లంకలో ప్రవేశించి సీతమ్మను వెతుకుతాను, ఆమె కనిపించకపోతే లంకనే తీసుకొచ్చేస్తాను" అని చెప్పి. ఒక్కసారి సముద్రమును చూశాడు. ఉవ్వెత్తుగా యెగిరిపడుతున్న కెరటాలవలె తానూ అంత యెత్తుగా పెరిగిపోయి గాలిలోబాణములా దూసుకుంటూ సముద్రముపై ఆకాశమార్గాన బయలుదేరాడు. హనుమపాదాల బరువుకు ఆ పర్వతము క్రిందకుదిగి, అతడు పైకి లంఘించగానే మరలా ఆవేగానికి యధాప్రకారము పైకివచ్చి నిలచినది, హనుమంతుడు ఆకాశమార్గాన వెళ్తుండగా ముందుకుచాచిన చేతులు ఆడింపువల్ల వీస్తున్నగాలిని కలిగే శబ్దానికి కొండగుహలు దద్దరిల్లి సింహాలు సహితంగా నల్లుల్లా రాలిపోయాయి. ఆవిధముగా యేకదాటిగా ఆకాశమార్గమున ప్రయాణిస్తున్న హనుమంతుడు మధ్యలో యెదురయిన అవాంతరాలను దాటి క్షణాల మీద సముద్రాన్ని లంఘించి త్రికూట పర్వతము మీద క్షేమముగా వాలాడు.





# సుందరాకాండము

## హనుమంతుని లంకాప్రవేశము

ఇంతలో అటువైపుగా రాక్షసులు వస్తుంటే అక్కడే ఉన్న చెట్టుపై నక్కి కూర్చున్నాడు హనుమంతుడు. ఆ రాక్షసులు ఆ చెట్టు క్రిందకే వచ్చి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వారి మాటల మధ్యలో 'సీత' అనే పదము వినిపించే సరికి హనుమంతుడు కుతూహలంగా




లంకిణి చేతిలో చిక్కిన హనుమంతుడు

విన్నాడు. అనుకోకుండా సీతమ్మ సమాచారము కొంత తెలియుటచేత సందేహము వదలి, యిక్కడ సీతాదేవిని తప్పక చూడగలనని ఒక నిర్ణయానికి వచ్చాడు. అదే సమయానికి లంకఅంతా దీపాలతో కోటిసూర్యులు ఒక్కసారిగా విరజిమ్మిన కాంతివలె తళతళలాడుచూ స్వర్గాన్ని మరపింపజేయుచున్నది. అందరూ నిద్రపోవువరకూ అక్కడేవుండి, తరువాత తన రూపం మార్చుకొని చిన్నకోతిగా తయారై, యెవరి కంటా పడకుండా అతి జాగరూకతతో సువేలాద్రి దాటి లంకాద్వారం చేరుకున్నాడు. ఆ ద్వారాన్ని కాపలా కాస్తున్న లంకిణి అనే రాక్షసి హనుమంతుని పట్టుకుని "ఈ కోతి ముఖానికి లంకాప్రవేశము కావాలా" అంటూ గట్టిగా మొట్టింది. హనుమంతుడు ఆ మొట్టుకు కోపించి దాని ముఖంమీద ఒక్క చరుపు చరిచాడు. ఆ చరుపుతో దానికి పండ్లూడిపోయి, రక్తాలు చిమ్మగా భయపడి రెండుచేతులూ జోడించి "శరణు వానరవీరా! శరణు నేను యీ లంకను కాపాడుతున్న శక్తిని నన్ను 'లంకిణి' అంటారు, నీకు జయం కలుగుతుంది. వెళ్ళిరా వాయుపుత్రా అని లంకాదేవత అదృశ్యమైపోయింది. అక్కడ నుండి మారుతి నిర్భయంగా లోపలకు వెళ్లాడు. ఇంటింటా వేదఘోషలు వినవస్తున్నాయి. దేవాలయాల జయ ఘంటానాదాలు యెటు చూచినా అందమైన పూలచెట్లు వాటినుండి అప్పుడే వికసించిన పువ్వుల పరిమళంలో కూడి చల్లగా వీస్తున్న గాలి, "ఆహా! ఏమి వైభవము స్వర్గముకూడా ఈ లంకముందుదిగదుడుపుకదా' అనుకుంటూ ముందుకుసాగాడు.

## హనుమ అంతఃపుర ప్రవేశము

సామాన్య వానరరూపంతో లంకలోని మేడలు, మందిరాలు గోపురాలు మొదలగు అన్ని ప్రదేశాలు వెతికాడు సగమురాత్రి అయిందికాని, సీత జాడ మాత్రం తెలియలేదు. "ఇక చూడవలసినది అంతఃపురము ఒక్కటే" అనుకుని మెల్లగా ప్రాకుతూ అంతఃపురములో ప్రవేశించినాడు రావణుడు గాఢనిద్రలో నున్నాడనుటకు నిదర్శనము అతని గుఱకయే. "అతని ప్రక్కనే నిదురపోతున్నది. సీత కాదుగదా! ఛీ యెంతటి దురాలోచన వచ్చినది? ఆ మహాసాధ్వి సీత రావణాంతఃపురములో ఉంటుందా? అలా జరగదు" అనుకుంటూ బయటకువచ్చి గుఱ్ఱపుశాలలో కూడా చూచి, సీత కానరాక, విసుగుజెంది. ఒకచోట కూర్చుని ఆలోచిస్తూ చుట్టూ కలియజూపాడు.



రావణుని శయనమందిరంలో ప్రవేశించిన హనుంతుడు

ఒకతోట కన్పించగా "ఓహో! అక్కడ చూడలేదుకదా!" అనుకొని చెట్లపై నుంచి గెంతుకుంటూ ఆ తోటలోనికి చేరాడు హనుమంతుడు.

## హనుమంతుడు సీతను చూచుట మాట్లాడుట

ఒక చెట్టునుండి మరొక చెట్టుపైకి గెంతుకుంటూ తోటమధ్యకు చేరుతుండగా "జయీభవ! దిగ్విజైభవ లంకేశ్వరా" అంటూ భటులు కాగడాలు పుచ్చుకుని తానున్న వేపుగా రావడము చూచి ప్రక్కనే దట్టముగా నున్న చెట్లుపై కూర్చుని యేమి జరుగుతుందోనని చూడసాగాడు హనుమ. అదే సమయమున "రామా! రామా!"అనే మాటలు వినిపించగా క్రిందకు చూశాడు. రాక్షస స్త్రీల మధ్య కూర్చుని ఉన్న స్త్రీని చూసాడు. ఆమె నోటివెంట "రామా" అనేపదము వెలువడుతున్నది" సందేహం లేదు. ఆమె సీతమ్మతల్లే"యని నిర్ధారణ చేసుకున్నాడు. అయితే అంతఃపురంలో నిద్రిస్తున్న రావణుడు యింతట్లో యిక్కడి కెందు కొస్తున్నట్లు" అనుకున్నాడు. కొంతమంది భటులు

వెంటరాగా రావణుడు ఆచెట్టు క్రిందకే వచ్చాడు. సీత నుద్దేశించి "సీతా! ఏమాలోచించావు? అరణ్యాలలో కందమూలాలు తింటూ, ఇల్లూ వాకిలీ కోల్పోయి, రాజ్యభ్రష్టుడయిన రాముడు కావాలా? ఇంద్రసౌఖ్యాలు కలిగించే రావణుడు కావాలా?" అని అడిగాడు.

ఛీ దుర్మార్గుడా! భర్తయింట లేనప్పుడు దొంగతనంగా తీసుకొని వచ్చావు కనుక. బ్రతికి బయటపడ్డావు. నీవు బుద్ధి మార్చుకొని నన్ను రామునికి అప్పగించు, రాముడు కరుణిస్తాడు. నీ మందోదరి మాంగల్యం నిలుపుకో! ఇంతకన్నా చెప్పవలసినది ఆలోచించవలసినది యేమీలేదు. అలా చేయకపోతే రావణా! నా భర్త వచ్చి నిన్ను హత మార్చి నన్ను తీసుకొని వెళ్ళడము మాత్రము జరుగక మానదు" అని చెప్పింది సీత.

రావణుడు కోపముతో "చాలించు పదునాలుగు లోకాలనూ గెలిచిన నన్ను, ఆ మానవాధముడు సంహరించడమా? అది జరగని పని, పది నెలల నుండి రాలేనివాడు యింకా యేమి రాగలడు. అయినా మరో రెండు నెలలు గడువు యిస్తున్నాను. ఈ లోపలనైనా నీ మనసు మార్చుకో"అంటూ వెళ్ళిపోయాడు.



రావణుని దూషిస్తున్న సీతాదేవి

కాపలా ఉన్న రాక్షస స్త్రీలు కొంతసేపు సీతను భయపెట్టి అలాగే నిద్రలోనికి జారుకొన్నారు. వెంటనే హనుమంతుడు మెల్లగా చెట్టు దిగివచ్చి "తల్లీ! సీతమ్మతల్లీ! వందనములు' అంటూ చేతులు జోడించి యెదుట నిలిచాడు. విరబోసిన వెంట్రుకలతో వాడిపోయిన ముఖంతో శోకదేవతలా ఉన్న సీత హనుమంతుని మాటలకు త్రుళ్లిపడి చూసింది. అదికూడా రాక్షస మాయేనని భావించి, సమాధానమేమీ యివ్వలేదు.

ఆంజనేయుడు అది గ్రహించి 'అమ్మా! నేను శ్రీరాముని దూతను వాయుపుత్రుడను' అను పరిచయము చేసుకొని. శ్రీరాముని పరిచయమునుండి జరిగిన దంతయూ వివరించి "తల్లీ! ఇదిగో శ్రీరామచంద్రుడు నీకు ఆనవాలుగా పంపిన అంగుళీయకము" అని ఆ ఉంగరాన్ని యిచ్చాడు. సీతాదేవి ఆ అంగుళీయకమును చూచి, రాముని చూసినంతగా సంబరపడి, అంతలోనే విచారవదన అయినది.

అదిచూసి ఆంజనేయుడు "విచారించకమ్మా! త్వరలోనే రావణుని హతమార్చి, శ్రీరాముడు నిన్ను తీసుకొని వెళ్ళగలడు. అది ఆలస్యమవుతుందనిపిస్తే నీ అనుజ్ఞ అయితే,



సీతాదేవికి శ్రీరామముద్రిక నిచ్చుచున్న హనుమంతుడు


నేనే నిన్ను తీసుకొనివెళ్ళి తెల్లవారేలోగా రాముని వద్దకు చేర్చగలను!'' అని వినయముగా చెప్పాడు. అందుకు సీత ఆశ్చర్యపడుతూ "ఇంత చిన్నవాడివి నువ్వేమి చేయగలవు?'' అనగా "సందేహము వలదు తల్లీ'' అంటూ ఆంజనేయుడు తనవిశ్వరూపమును చూపించినాడు. ఆదిచూసి సీతాదేవి మరింత ఆశ్చర్యపోతూ "నాయనా! ఆంజనేయా! నీవు సమర్థుడవే, కాని ఇలాచేస్తే లోకము శ్రీరాముడు చేతగాని వాడంటుంది. చాటుగా వెడితే రావణునికి మనకు తేడా ఏముంటుంది. అందుకే శ్రీరామచంద్రుడు ఈ రాక్షసుని యుద్ధంలో చంపి నన్ను తీసుకు వెళ్ళడమే సరియైనపని, నా అవస్థను శ్రీరామునికి తెల్పి, తొందరలో రావణుని చంపి ఈచెఱనుండి విడిపించమని ప్రార్థించానని చెప్పు''మని తన శిరోమణిని తీసి రాముని కిమ్మని ఆంజనేయునికిచ్చింది. దానిని తీసుకొని కండ్లకద్దుకుని లంకలో తన పరాక్రమము చూపుటకు ఆమె అనుజ్ఞ గైకొని రామనామ స్మరణ చేస్తూ, అశోక వనప్రాసాదం విరిగిపడేలా ఒక్కతన్ను తన్నాడు.



ఆంజనేయుడు సీతాదేవికి తన విశ్వరూపమును జూపుట

# స్మశానంగా మారిన అశోకవనము

అశోకవనమంతా చెల్లాచెదురు చేసి, చెట్లను పీకి - ఎక్కడికక్కడ విరగగొట్టి వనమంతా స్మశాన వాటికగా తయారుచేశాడు. అప్పటికే తెల్లవారిపోవుటచేత తోటకాపలా వాళ్ళు ఆంజనేయుని పసిగట్టి యెదిరించి, యమునివద్దకు ప్రయాణము కట్టారు. చావు దెబ్బలుతిని ప్రాణాలు దక్కించుకున్న కొంతమంది రాక్షసులు పరుగెత్తుకొనిపోయి, యీ విషయమును రావణునికి చెప్పారు. "అంతమంది వీరులను ఒక్కవానరుడు చంపడమా!' అని ఆశ్చర్యపోతూ, ఆ కోతిని తీసుకొనిరమ్మని అక్షకుమారుని పంపాడు రావణాసురుడు. అక్షుడు వెళ్ళి బాణాలతో ఆంజనేయునే యెదుర్కొన్నాడు. ఆంజనేయుడు ఆ బాణాలన్నింటినీ పూచికపుల్లలవలె విరిచేసి, తన గదతో అతని తలపై ఒక్క దెబ్బ వేశాడు. ఆ దెబ్బతో అక్షుడు కూడా చనిపోయాడు. అది తెలిసిన రావణుడు మండిపడుతూ ఇంద్రజిత్తును పంపాడు. స్మశానంగా మారిన వనములో అడుగుపెట్టిన ఇంద్రజిత్తు కోపంతో ఆంజనేయుని చూశాడు. "ఈ కోతి సామాన్యమైనది కాదు"



బ్రహ్మాస్త్రంచే బంధింపబడిన ఆంజనేయుని రథముపై తీసుకువెళుతున్న ఇంద్రజిత్తు

అనుకొని, అతి జాగరూకతతో మాయోపాయమున బాణవర్షము కురిపించ సాగాడు. ఒక్క బాణమూ ఆంజనేయుని బాధించలేకపోయింది. "ఇకలాభం లేదనుకొని బ్రహ్మాస్త్రం ఉపయోగించాడు. అన్ని విద్యలూ కూలంకషముగా తెలిసిన ఆంజనేయుడు. కావాలనే బ్రహ్మాస్త్రాన్నికి కట్టుబడిపోయాడు. బ్రహ్మాస్త్రముచే బంధింప బడిన ఆంజనేయుని తనరథంపై వేసుకొని రావణుని కొలువులోనికి తీసుకొని వెళ్లాడు ఇంద్రజిత్తు.

## లంకాదహనము

కొలువు బయట రథం ఆపి, ఆంజనేయుడిని కొలువులోనికి తీసుకొని వెళ్లాడు. ఆంజనేయుని ఒక్క విదలింపుతో బ్రహ్మాస్త్రం పట్టు విడిపోయింది. సభామధ్యమున నిలిచిన ఆంజనేయుడు రావణుని చూచి, అతని తేజస్సుకు చాలా ఆశ్చర్యపడినాడు. అంతలోనే రావణుడు కోపంతో "లంకలో యెలా ప్రవేశించావురా కోతీ! ఇంతకి నీవెవడవు? అసలు యెందుకు వచ్చావు? అశోక వనమును పాడుచేయుటకు కారణము యేమిటి?' అని గద్దించాడు అందుకు మారుగా హనుమ.



రావణునికి నీతిబోధ చేయుచున్న హనుమంతుడు

"సభా మర్యాద తెలియని ఓ రాక్షసరాజా! కొంచెం ఆగు, నీ ప్రశ్నలకు సమాధానము చెబుతాను" అంటూ, రావణుని యెదురుగా అతనికన్నా యెత్తుగా తోకనుచుట్టుకొని దానిపై కూర్చున్నాడు. "ఊ! ఇక ఇప్పుడు విను రావణా! నేను శ్రీరామచంద్రుని బంటును, సుగ్రీవుని మంత్రిని, వాయుపుత్రుడను, శ్రీరాముడు పంపగా వచ్చాను. సీతమ్మను చూశాను. కాని నీకు బుద్ధిచెప్పి వెళ్ళాలనిపించి అశోకవనమును ధ్వంసము చేశాను. నీవు పరకాంతలను మోహించే పాపాత్ముడవు. జగన్మాత అయిన సీతాసాధ్విని తీసుకు వచ్చి, నీగుండెలపై అగ్నిని రగిలించుకున్నావు. ఇప్పటికయినా మించిపోయిందిలేదు. శ్రీరాముడు సుగుణ ధాముడు సీతమ్మను అప్పగించి శరణు వేడితే బ్రతికిఉంటావు లేదా, నీకు సర్వనాశనము తప్పదు అని నిన్ను హెచ్చరించటానికే ఇంద్రజిత్తుకు బందీగా పట్టుబడ్డాను" అని అన్నాడు.

హనుమంతుని మాటలు భరించలేని రావణుడు "ఈ వ్యర్థ ప్రలాపములు కట్టి పెట్టరా కోతీ!' అని రాక్షసుల నుద్దేశించి "రాక్షస వీరుల్లారా! వీడిని చంపిపారేయండి



అగ్నిజ్వాలలకు ఆహుతి అవుతున్న లంకానగరము

అపుడు రాముడేమి చేయగలడో చూద్దా'' మన్నాడు. అప్పుడు విభీషణుడు లేచి "అన్నా! దూతను చంపడం రాజధర్మము కాదు'' అని చెప్పగా "సరే అయితే కోతికి తోక ముఖ్యము కనుక, దానికి నిప్పంటించు''డని ఆజ్ఞాపించి కొలువు నుండి వెళ్ళిపోయాడు రావణుడు.

రాక్షసులు హనుమంతుని తోకకు గుడ్డలు చుట్టి నూనెలో ముంచి, నిప్పంటించి వదలివేశారు. అయితే హనుమంతుడు తన మిత్రుడగు వాయుదేవుని కొడుకు ఆగుటచేత అగ్నియేమీ బాధించలేదు. హనుమంతుడు వీధీ వీధీ పేట పేటా తగులబెడుతూ లంకంతా తిరిగి అగ్నిమయం చేశాడు. మంటలు ఆకాశాన్నంటుతున్నాయి. అగ్నికి వాయువు కూడా తోడైనాడు. దానితో లంకానగరమంతా స్మశానవాటికగా మారిపోయింది. హనుమంతుడు సముద్రమువద్దకు వెళ్ళి తోకకు వున్న నిప్పును చల్లార్చుకొని, మరలా సీతాదేవి దగ్గరకు వచ్చి ఆమెవద్ద సెలవు తీసుకొని అమితోత్సాహముతో క్షణాలమీద సముద్రమును దాటి మహేంద్రగిరి మీద దిగాడు. జాంబవంతుడూ, అంగదుడూ మొదలైనవారంతా ఒక్కసారిగా హనుమంతుని కౌగించుకొని క్షేమముగా తిరిగి వచ్చినందులకు ఆనంద బాష్పాలు రాల్చారు. సీత సమాచారము తెలుసుకో గలిగినందువలన వారు సంతోషముతో పొంగిపోతూ నిమిషాలమీద కిష్కింధకు చేరారు.

## హనుమంతుడు తెచ్చిన సమాచారము

అన్ని దిక్కులకూ వెళ్ళిన వానరులు నిరుత్సాహముతో తిరిగి రావటముచేత సుగ్రీవాదులు సీత జాడ తెలియదేమోనని బాధపడుతున్నారు. ఒక్క శ్రీరామచంద్రుడు మాత్రము "హనుమ సాధించుకొనివస్తా''డని యెదురు చూడసాగాడు. హనుమంతుడు వచ్చి రావడముతోనే శ్రీరామునికి ప్రదక్షిణపూర్వక నమస్కారముచేసి "ప్రభూ! చూశాను సీతమ్మను . నాతల్లి తమకు ఆనవాలుగా యిచ్చిన శిరోమణి ఇదిగో'' అంటూ ఇచ్చాడు శిరోమణిని అందుకున్న శ్రీరాముడు హనుమంతుని కౌగిలించుకున్నాడు. తరువాత లంకలో జరిగిన సంగతులనూ, సీతమ్మ దీనావస్థనూ వివరించాడు. శిరోమణిని చూచి సీతను చూసినంతగా సంతోషించాడు. శ్రీరాముడు సుగ్రీవుడు నలువైపులానున్న వానర శ్రేష్ఠుల నందరినీ రప్పించాడు. ఒక శుభముహూర్తమున రావణునిపై యుద్ధానికి బయలుదేరారు.



# యుద్ధకాండము

## రావణుడి మంత్రాంగం - విభీషణుడి దేశ బహిష్కరణ

సుగ్రీవుడు, అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడు మొదలగు ప్రముఖులను సేనా నాయకులుగా కోట్లకొలది వానరులను జట్లుగా నియమించారు. రామలక్ష్మణులు ముందు నడవగా, వారి ననుసరించి వీరంతా సముద్రమును చేరారు.

అక్కడ లంకలో రావణుడు "ఏమి చేయుటమా?" అని ఆలోచించసాగాడు. మంత్రులనందరినీ పిలిపించి వారితో "ఒక కోతి వచ్చి లంకను స్మశానవాటికగా తయారుచేసి అవలీలగా సముద్రము దాటి వెళ్ళిపోయింది. ఇప్పుడా కోతి రామలక్ష్మణుల తీసుకొని వానర సైన్యముతో సహా రాకమానదు. వాళ్ళను యే విధంగా జయించగలము?" అని అడిగాడు.

అప్పుడు మంత్రులు "రావణేశ్వరా? పదునాలుగు లోకాలనూ జయించిన నీవేనా యిలా మాటాలాడు చున్నది? అజేయ పరాక్రమశాలివయిన నిన్ను యీ పనికిమాలిన కోతులూ నరులూ జయించగలరా. "అంటూండగానే, రావణుని తమ్ముడు విభీషణుడు లేచి, 'అన్నా! ఒక్క వానరుడే ఇంత అనర్థము కలుగ జేసినపుడు మనము ఏమి చేయగలిగాము? తప్పు మనలో ఉన్నది కనుక, మనము శిక్ష భరించక తప్పదు. సర్వనాశనము అవకముందే సీతను శ్రీరామునకు అప్పగించు. అయినా నాకు తోచినది చెప్పాను సర్వధర్మాలూ తెలిసినవాడవు. నీకొకరు చెప్పాలా! తరువాత నీయిష్టం" అని కూర్చున్నాడు.


ఆ మాటలకు రావణుడు మండిపడుతూ, "గ్రుడ్డు వచ్చి పిల్లలను వెక్కిరించినట్లు నీవా నాకు నీతులు చెప్పేది? నా ముందు ఆ విరోధిని యెక్కువగా స్తుతిస్తావా? ఎంత ధైర్యంరా? వెళ్ళు ఇక్కడ ఉండటానికి నీకు అర్హత లేదు" అంటూ ఒక్కతన్ను తన్నాడు. వెంటనే విభీషణుడు లేచి అన్నా! ఈనాడు మంచి చెప్పినా సరే తలకెక్కదు. రామబాణాలు శూలాలవలె గుండెల్లో దిగినవాడుగాని నీకు తెలియదు" చేతులు కాలిన తరువాత

ఆకులు పట్టుకున్నా ప్రయోజనము ఉండదు. వస్తానన్నా" అంటూ ఆకాశమార్గాన వెళ్ళి శ్రీరాముని శరణు కోరాడు.

శ్రీరాముడు విభీషణునకు అభయమిచ్చాడు. సుగ్రీవునకు అది నచ్చలేదు. అపుడు హనుమంతుడు ముందుకు వచ్చి, విభీషణుని గురించి సుగ్రీవునకు చెప్పగా అతను "సరే" నన్నాడు రాముడు విభీషణుని చేరదీసి "భయపడకు నిన్ను ఇప్పుడే లంకా నగరానికి రాజుగా అభిషేకిస్తున్నా" నన్నాడు. ఆ మాటలకు నవ్వుతూ సుగ్రీవుడు "రామచంద్రా! ఒకవేళ రావణుడుకూడా వచ్చి శరణు కోరితే యేం చేస్తావు" అని అడిగాడు. అందుకు బదులుగా రాముడు "నా మాటకు తిరుగులేదు సుగ్రీవా! రావణుడే వచ్చి శరణు కోరితే అతన్ని అయోధ్యానగరానికి రాజుగా చేస్తాను"అనడంలో అతని ఔదార్యానికి వానరులంతా విస్తుపోయారు.

## సేతువు నిర్మించుట

సేతువు కట్టడానికి రాముడు వానరులకు ఆదేశాలు యిచ్చాడు. శ్రీరాముడు తనను



వానరులు సముద్రముపై వారధి నిర్మించుట

దాటుచున్నాడనే ఆనందముతో సముద్రము ఒక్కసారిగా పొంగినాడు. అదిచూసి రాముడు కోపముతో నీటిపై బాణాలు ప్రయోగించాడు.

సముద్రుడు భయపడుతూ పైకి వచ్చి 'మహాత్మా రామచంద్రా! శాంతించు నీవు వచ్చావన్న సంతోషముతో పొంగేనేగాని, నీదారి కడ్డురావాలని కాదు నలుడు మంచి శిల్పి, అతడు వారధి కట్టగలడు. కనుక, నలునిచేత వారధిని నిర్మింపచేస్తే అది మునగకుండా నేను కాపాడుతాను'' అని చెప్పాడు, శ్రీరాముడు సంతోషించి సముద్రుని ఆశీర్వదించి పంపాడు.

వెంటనే హనుమంతుడు వెళ్ళి హేమ, నాగ, సింహాచలాది పర్వతాలను తెచ్చి నలుని కందించాడు. అలాగే వానరులంతా నలుదిక్కులకూ వెళ్ళి, యెవరికివీలైన కొండలనూ, బండలనూ వారు తెచ్చి యివ్వగా, నలుడు వాటితో బహునేర్పుగా వారధి కట్టాడు. రామలక్ష్మణులు, సుగ్రీవ హనుమందాది నాయకులు తమ సేనలతో సముద్రాన్ని దాటి అవతలి తీరమునకు చేరి విడిది చేశారు.

## మాల్యవంతుని హితవు

కోట్లకొలదీ వానరసేనలు లంకకు చేరడం వేగులవాళ్ళ ద్వారా తెలుసుకున్న రావణుడు యుద్ధానికి సిద్ధము కావలసినదని సేనా నాయకులకు ఆదేశాలు యిచ్చాడు. అపుడు అతని తాతగారైన మాల్యవంతుడు మాత్రము రావణుని వారించాడు. 'నాయనా రావణా! శ్రీరాముడు సామాన్యుడు కాదు. శ్రీ మహావిష్ణువు రాక్షస సంహారము కొరకు అవతరించినాడు. కనుక, అతనితో యుద్ధము చేస్తే సర్వనాశనము తప్పదు. అందుచేత సీతను అప్పగించు శ్రీరాముడు శాంతించి మరలి వెళతాడు' అని చెప్పాడు. కాని రావణునికి ఆ విధమైన హితబోధ తలకెక్కలేదు.

## అంగద రాయబారము

యుద్ధానికి ముందు రాజధర్మము ప్రకారము చివరిసారిగా రావణుని వద్దకు రాయబారము పంపాలనుకొన్నాడు శ్రీరాముడు. అంగదుని పిలిచి "అంగదా! మన తప్పులేకుండా నీవు రావణుని దగ్గరకు రాయబారిగా వెళ్ళి -యిప్పటికయినా మించి పోయినది లేదని, సీతను తెచ్చి అప్పగించి క్షమాపణ కోరుకొని. రాక్షస జాతిని రక్షించుకొనుము కాదంటే యుద్ధము తప్పదనీ తెలియజెయ్యి'' అని చెప్పి పంపాడు.

అంగదుడు శ్రీరాముని ఆజ్ఞను శిరసావహించి, మరు ఘడియలోనే రావణుని కొలువులో ప్రవేశించాడు. "ఎవరు నువ్వు? అని గర్జించాడు రావణుడు. 'నిన్ను చంకలో యిరికించుకుని నాలుగు సముద్రాలలో నీరు త్రాగించి, ఒక్క తన్నుతో లంకలో పడవేశాడు వాలి. ఆ వాలి కుమారుడను. నా పేరు అంగదుడు. శ్రీరామచంద్రుని రాయబారిగా వచ్చాను'' అంటూ శ్రీరాముడు చెప్పమన్న వాక్యములను చెప్పి సీతమ్మను అప్పజెప్పి, క్షమాపణ వేడుకోకపోతే శ్రీరామబాణ జ్వాలలలో మీ రాక్షసమూక నిర్దాక్షిణ్యముగా భస్మమై పోతుంది సుమా'' అని హెచ్చరించాడు.

"ఓ కోతి! మానవాధములకూ, కుప్పిగంతులు వేసే కోతులకూ భయపడే పిరికిపంద కాదురా నేను'' అన్నాడు రావణుడు. "ఓహో అలాగా! అయితే నీ భటులను వచ్చి నా కాలు కదపమను చూస్తాను' అని అంగదుడు తన కాలును నేలకు అదిమిపట్టాడు. రావణ పరివారం యెంత ప్రయత్నించినా అంగదుని కాలు కదపలేకపోయారు దానితో వెర్రెత్తిన రావణుడు తనే స్వయంగా వచ్చి కాలు కదపబోయాడు. వెంటనే అంగదుడు పైకి యెగిరి రావణుని కిరీటాన్ని కాలుతో పడద్రోసి, 'నా కాలు పట్టుకునే కన్న రాముని కాళ్ళు పట్టుకుంటే మంచిదిరా'' అని చెప్పి బాణములా దూసుకొని వెళ్ళి జరిగినదంతా శ్రీరామునకు చెప్పాడు. అంగదుడు జేసిన సాహసానికి మెచ్చుకుంటూ "సుగ్రీవా! యుద్ధము ఆరంభము'' అన్నాడు రాముడు. సుగ్రీవుడు తన సైన్యాలకు అనుజ్ఞ నిచ్చి నడిపాడు.

## రాక్షసులు - వానరుల యుద్ధము

వానర సైన్యపు కలకలమునకు దిక్కులు పిక్కటిల్లుతూ వున్నవి. వానరులకూ రాక్షసులకూ మధ్య యుద్ధము మహాజోరుగా సాగుచున్నది. హనుమంతుడు. మహా వీరులనుకొన్న రాక్షసుల నందరినీ హతమార్చేయ సాగాడు.

ఇక లాభము లేదనుకొని రావణుడు తన ముద్దుల తనయుడు యింద్రజిత్తును పంపాడు. ఇంద్రజిత్తు మహా మాయలమారి మేఘాలలో దాక్కుని నాగపాశములను ప్రయోగించాడు. లేక్కలేనన్ని సర్పములు వచ్చి వానర సైన్యాన్ని, రామలక్ష్మణులనూ కూడా బంధించాయి. వెంటనే వెళ్ళి యీ విషయం రావణునికి చెప్పాడు. రామలక్ష్మణులు



యుద్ధము చేయుచున్న రాక్షసులు - వానరులు

తన కొడుకుచేతిలో బందీలైనారని సంతోషించి మీసం దువ్వాడు - రావణుడు. అదే సమయమున రాముని విల్లుప్రళయకాల మేఘములా గర్జించినది. వానరుల కోలాహలమూవినిపించినది ఆది విన్న రావణుడు" ఎలా బ్రతికారు వీళ్లు?" అనుకుంటూ మేడపైనుంచి చూడగా, గరుత్మంతుడు ఆకాశమార్గాన వెళుతూ కనిపించాడు. "అదా సంగతి?" అనుకొని కుంభకర్ణుని నిద్రలేపి పంపాడు.

## కుంభకర్ణుడు

యుద్ధరంగంలోకి వచ్చిన కుంభకర్ణుడు యెదురు వచ్చిన వానరులను పట్టుకుని తినివేస్తున్నాడు. మహా భయంకరాకారుడయిన కుంభకర్ణుని చూచి వానరులు భయ భ్రాంతులై చెల్లాచెదురయిపోతున్నారు. అది చూసిన శ్రీరాముడు వెంటనే బ్రహ్మాస్త్రమును



శ్రీరామచంద్రుడు బ్రహ్మాస్త్రముచే కుంభకర్ణుని చంపుట

ప్రయోగించాడు. దానితో అంతటి కుంభకర్ణుడూ పెడబొబ్బలు పెడుతూ ఒకసారిగా నేలకూలి శాశ్వతముగా కన్నుమూసాడు.

## ఇంద్రజిత్తు మరణము

కుంభకర్ణుడు చనిపోయాడని తెలిసిన రావణుడు అగ్రహమూ, బాధతో వూగి పోయాడు. అదిచూసి ఇంద్రజిత్తు "విచారించకండి నాన్నగారూ! ఆ రామలక్ష్మణులను వధించిగాని తిరిగిరాను" అని చెప్పి, మళ్లా యుద్ధరంగానికి వచ్చాడు. విభీషణుడు రామునివద్దకు వచ్చి "పదునాలుగు సంవత్సరములు నిద్రాహారములు లేనివాడే ఇంద్రజిత్తును చంపగలడు. మనలో అటువంటివాడు ఎవరయినా ఉంటే పంపమన్నారు. అది విని లక్ష్మణుడు అన్నకు నమస్కరించి ఇంద్రజిత్తును యెదుర్కొన్నాడు. లక్ష్మణుని బాణధాటికి ఆగలేక చిరాకుపడి మేఘాల్లో దాక్కుని యుద్ధము చేయసాగాడు. దానితో



లక్ష్మణుడు ఇంద్రజిత్తు శిరస్సు యెగురగొట్టుట

లక్ష్మణుడు కోపముతో భుజంగాస్త్రము సంధించి రాముని తలచుకొని నా వదిన తల్లి సీతమ్మ పతివ్రతే అయితే యీ బాణం యీద్రోహి శిరస్సును ఖండించుగాక'' అనుకుని బాణము విడిచాడు. తక్షణమే ఇంద్రజిత్తుని మాయ పటాపంచలై పోయి, ఆ తీక్షణ బాణంతో ఇంద్రజిత్తు తల తెగి పడిపోయింది.

## లక్ష్మణుడు మూర్ఛపోవుట

అజేయ బలపరాక్రమ వంతుడయిన తన కుమారుడు ఇంద్రజిత్తును ఒక మానవుడు చంపుటయా?'' అని కన్నీరు కార్చి, దిగులు - క్రోధంగా మారగా రావణుడే స్వయంగా యుద్ధరంగంలో ప్రవేశించాడు. అతని ధాటికి ఆగలేక వానర సైన్యము చెల్లాచెదురయినది. అదిచూసి లక్ష్మణుడు రావణుని యెదుర్కొని బాణవర్షము కురిపించసాగాడు. అతని శక్తికి రావణుడు ఆశ్చర్యపోయి, ఒకశక్తి బాణము ప్రయోగించాడు. అది వచ్చి లక్ష్మణుడి గుండెలకు తగిలి మూర్ఛపోయాడు, రావణుడు సంతోషిస్తూ తిరిగి వెళ్ళపోయాడు.



సంజీవి పర్వతాన్ని తీసుకువస్తున్న హనుమంతుడు

లక్ష్మణుడు మూర్ఛపోవుటచూసి మరణించాడనుకొని అంతాదుఃఖించసాగారు శ్రీరాముని దుఃఖాన్ని చూచి సుగ్రీవాదులు భరించలేకపోయారు. వానర వైద్యుడు సుషేణుడు వచ్చి పరీక్షించి 'లక్ష్మణుని కేమి ఫరవాలేదు. తెల్లవారేలోగా సంజీవి తెస్తే బ్రతుకుతాడని చెప్పాడు. శ్రీరాముడు హనుమంతుని చూడగా హనుమంతుడు రామునికి నమస్కరించి గరుత్మంతుని కన్నా వేగంగా వెళ్ళి ఆ కొండమీద వ్రాలాడుకాని, మిణుగురు పురుగులవలే మెరుస్తున్న ఆ ఔషధాలలో సంజీవికరణి ఏదో తెలుసుకొనలేక ఆ పర్వతం మొత్తాన్నే పెళ్ళగించి అరచేత బెట్టుకువచ్చి లక్ష్మణునిముందు దింపాడు. హనుమ ఆలస్యము చేయకుండా సుషేణుడు సంజీవికరణిని తీసి వైద్యము చేయగా లక్ష్మణుడు నిద్రనుండి మేల్కాంచినట్లుగా లేచి కూర్చున్నాడు. వానరులు బ్రహ్మానందముతో జయజయ ధ్వానాలు చేశారు రాముడు అనందముతో హనుమంతుని చూశాడు.

# మందోదరి ప్రార్థన

అంతఃపురములో నున్న రావణుడు ఆ కలకలంవిని "లక్ష్మణుడు బ్రతికాడా" అంటూ కోపోద్రేకముతో విల్లూ బాణాలు తీసుకొని, "రథము సిద్ధము చెయ్యి" మన్నాడు. అదిచూసి మందోదరి చాలా భయపడి, యేడుస్తూ దరిచేరి "ప్రభూ! నా మాటవిని యుద్ధానికి వెళ్ళకండి. సీత, రామలక్ష్మణులు అవతారమూర్తులను కుంటున్నాను. లేకపోతే మహా శూరులైన మన వారందరూ ఆ రామలక్ష్మణుల చేతుల్లో మరణిస్తారా? నా మాట విని సీతను శ్రీరాముని వద్దకు పంపండి, అప్పుడు నా మాంగల్యమైనా నిలుస్తుంది' అని యెన్నో విధముల ప్రార్థించింది.

రావణుడు అది విని 'మందోదరి! నా జీవితము చాలాగొప్పగా గడిచింది. నేను బ్రతికినంత కాలమూ యెవరివద్దా తలవంచకుండా అజేయ పరాక్రమశాలిగా బ్రతికాను. ఆ మానవులు అవతారపురుషులనీ, సీతమ్మ లక్ష్మి అంశఅనీ నాకు తెలుసు. శ్రీరాముని



సీతను శ్రీరాముని వద్దకు పంపమని రావణుని ప్రార్థిస్తున్న మందోదరి

చేతిలో మరణించడం వలన రాక్షసజాతికే ముక్తి లభించింది. ఇకనేనంటావా! సీతమ్మను తీసికొనిచ్చి నిత్యమూ యేదో వంకని ఆమెను దర్శించి శ్రీరాముని చేతిలో మరణించే అవకాశము కలిగినందులకు నా జీవితమూ ధన్యతగాంచి ముక్తి లభిస్తుంది. కాని నీవు మాత్రం నీతండ్రి ఇచ్చిన వరమువలన యేదీ లభించక యేడుస్తూ జీవించు" అంటూ వెళ్ళిపోయాడు.

## రావణ సంహారము

రావణుడు యుద్ధరంగంలోనికి వచ్చి, రథముపై నిలబడి శ్రీరాముని పరీక్షగా చూశాడు. అంతలో యింద్రుడు పంపిన రథము వచ్చినది. శ్రీరాముడు దానిపై నెక్కాడు రామునకు రావణునికి యుద్ధము చాలా భయంకరముగా సాగినది. రామబాణాలకు రావణుని తలలు తెగిపడి మరలా వస్తున్నాయి.




శ్రీరామ, రావణుల యుద్ధము

ఇక లాభము లేదనుకొని రాముడు ఆగస్త్య మహాముని ఉపదేశించిన ఆదిత్య హృదయము అనే మంత్రాన్ని చదువుకొన్నాడు. దానితో రాముడు రెండవ సూర్యునిలా వెలిగిపోయాడు. ఆమంత్రశక్తితో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ప్రళయకాళ రౌద్రిణిలా అగ్నిజ్వాలలు కురిపిస్తూ వెళ్ళి రావణుని కడుపులో నున్న అమృతభాండాన్ని ఛేదించి గుండెల్లో దిగబడింది. ఆ దెబ్బతో రావణుడు 'హా! రామా!' అంటూ రథం నుండి నేలకూలి వీర స్వర్గమలంకరించాడు. దేవతలు జయ జయ నినాదములు చేశారు. అప్సరసల నాట్యాలతో, గంధర్వుల మధుర గానములతో, దేవతలు కురిపించిన దేవకల్పవృక్షాల పువ్వుల వానతో ఆ ప్రదేశమంతా నిండిపోయింది. వానరుల సంతోష కలకలంలో సముద్రఘోష అణగారిపోయింది. మందోదరి, రాక్షస స్త్రీలూ రావణుని కళేబరంపైబడి యేడుస్తున్నారు. విభీషణుడు స్థాణువై నిలిచాడు. శ్రీరాముడు తన వింటిని లక్ష్మణునకిచ్చి, విభీషణుని ఓదార్చి, రావణునికి ఘనంగా ఉత్తరక్రియలను జరిపించాలను కొన్నాడు. తరువాత రాముని ఆజ్ఞతో లక్ష్మణుడు విభీషణుని లంకా రాజ్యానికి రాజుగా అభిషేకించాడు.

## అగ్ని పరీక్ష

అనంతరం విభీషణుని భార్య సరమ, కుమార్తె, మరికొంతమంది రాక్షసకాంతలు సీతకు రావణ సంహారము గురించి తెల్పి, మంగళస్నానాలు చేయించి పల్లకిలో తీసుకొనివచ్చి శ్రీరామునకు అప్పగించారు. సీతాదేవి శ్రీరామునికి పాదాభివందనములు చేసి "స్వామీ! ఎంతకాలానికి మీ దర్శనభాగ్యము కలిగింది" అంటూ ఆనందబాష్పాలు రాల్చింది. అప్పుడు "సీతా! నా ధర్మము నేను నెరవేర్చాను. రావణుని చంపి నీ చెర విడిపించాను. ఇంతకాలం లంకలో పరాయిచోట వున్నావు కనుక, నీపవిత్ర తను ఋజువు చేసికొను" మన్నాడు.

అది విని సీతాదేవి 'మంచిది మీకు అపవాదురాకుండా నా పవిత్రతను అగ్నిసాక్షిగా **ఋజువు** చేసుకుంటాను. చితి పేర్పించ**ండి" అ**న్నది. రామాజ్ఞతో వానరులు దుఃఖిస్తూనే **సీతమ్మ** తల్లికి చితి పేర్చారు. రాముని **పద్ధతికి** కోపము వచ్చెనా?"అనిపించే విధంగా అగ్నిజ్వాలలు ఉవ్వెత్తున లేచి భగ భగు మండసాగాయి సీతాదేవి - శ్రీరామునకు, అగ్నికి ప్రదక్షిణలు చేసి మంటలలో ప్రవేశించినది. బ్రహ్మాదిదేవతలు హాహాకారాలు చేస్తూ చూస్తున్నారు.



అగ్నిదేవుడు సీతాదేవిని శ్రీరామున కప్పగించుట

అంతలోనే మంటల మధ్యనుంచి దివ్యస్వరూపుడైన అగ్ని దేవుడు సీతాదేవిని తీసికొని వచ్చి 'రామచంద్రా ఆమెను మొదటనుండి జాగ్రత్తగ కనిపెట్టుకొని కాపాడుతూనే ఉన్నాను. ఆమె అగ్నిప్రవేశము చేయుటచేత నేను పవిత్రుడనయ్యాను! సీతమ్మతల్లిని స్వీకరించు' అని శ్రీరామునికిప్పగించాడు. బ్రహ్మాది దేవతలు "సీత నిర్దోషి"అని ముక్తకంఠాలతో వినాదాలుచేసి, పుష్పవర్షం కురిపించారు. ఇంద్రునితో అమరలోకం నుండి అక్కడికి వచ్చిన దశరథునికి సీతారామలక్ష్మణులు నమస్కరించినారు. భూదేవి సీత తల నిమిరి వెళ్ళిపోయింది. శ్రీరాముడు సీతను అక్కున చేర్చుకున్నాడు. హనుమదాది వానరుల ఆనందానికి అంతేలేదు. శ్రీరాముడు "విభీషణా! మనం వెంటనే అయోధ్యచేరాలి. ఈనాటితో అరణ్యావాసం గడువు పూర్తయింది" అన్నాడు.

# పుష్పక విమానము

విభీషణుడు పుష్పక విమానాన్ని అలంకరించి తీసుకొని వచ్చాడు. సీతారామ లక్ష్మణులు యెక్కిన తరువాత, సుగ్రీవుడు, హనుమంతుడు మొదలగువారు కూడా యెక్కారు. విమానం గాలికన్నా, వేగముగా వెళ్ళసాగినది. దారిలో శ్రీరాముడు సీతాదేవికి సేతువు మొదలగు ప్రదేశాలు చూపించాడు. ఒకచోట విమానము ఆపి క్రిందకు దిగు' మన్నాడు రాముడు. వెంటనే విమానము భూమిమీద నిలిచింది. అందరూ భరద్వాజముని ఆశ్రమానికి వెళ్లి ఆయన ఆశీస్సులు పొంది ఆయన ఆతిధ్యం స్వీకరించారు. తదుపరి భరద్వాజునివద్ద సెలవు తీసుకొని విమానము నెక్కారు. హనుమంతుడు ముందుగా నందిగ్రామముచేరి భరత శత్రుఘ్నులతో శ్రీరాముడు వస్తున్నట్లుగా తెల్పాడు. భరత శత్రుఘ్నులు యెదురు వచ్చారు. విమానము వచ్చి ఆగింది. అందరూ దిగి రాగానే భరత శత్రుఘ్నులు సీతారామలక్ష్మణులకు నమస్కరించారు. శ్రీరాముడు వచ్చాడని



సీతారామ లక్ష్మణాదులు పుష్పక విమానము మీద బయలుదేరుట


తెలిసి కౌసల్య, కైకేయి,సుమిత్ర, వశిష్ఠాది గురువులు మంత్రులు క్షణాలలో రధాలమీద నంది గ్రామం చేరారు. గుహుని తీసుకొని రమ్మని ఒక సేవకుని పంపాడు రాముడు. తరువాత అందరూ ఆనందోత్సాహములతో మహావైభవముగా అయోధ్యకు చేరారు.



భరత శత్రుఘ్నులు నందిగ్రామంలో సీతారామలక్ష్మణులకు స్వాగతమిచ్చుట

## శ్రీ సీతారామ పట్టాభిషేకము

పట్టాభిషేకానికి ముహూర్తము నిర్ణయించారు. మరల అయోధ్యానగరంలో జీవకళ ఉట్టిపడుతూ మంగళ తూర్యారావములు మార్మోగసాగాయి. పురజనులు అందరూ గొప్పగా వేడుకలు జరుపుకొంటు న్నారు. హనుమంతుడు మున్నగువారు పుణ్యనదుల నుండి బంగారుకడవలతో నీరు తెచ్చి యివ్వగా, సీతారాములకు స్నానాలు చేయించారు. పట్టుపీతాంబరములు కట్టి నగలు అలంకరించారు. మంగళవాద్యాలు మ్రోగు తుండుగా పురోహితుల మంత్రోచ్చారణ మధ్య వశిష్ఠుడు సీతారాములను సింహాసనంపై కూర్చుండ



శ్రీ సీతారాముల పట్టాభిషేకము

బెట్టాడు. భరతుడు పాదుకలను తెచ్చి శ్రీరాముని పాదాలకు తొడిగి 'అన్నా నా బాధ్యత తీరిపోయింది'అని, ఆయన పాదాలకు సమస్కరించాడు. హనుమంతుడు శ్రీరాముని పాదాల వద్దనే కూర్చున్నాడు.

తరువాత శ్రీరాముడు అందరినీ పేరుపేరునా పిలిచి యెవరికి తగిన కానుకలు వారికిచ్చి సత్కరించాడు. సీతాదేవికి ఒక గొప్ప ముత్యాలహారము అలంకరించాడు. అప్పుడు సీతాదేవి-శ్రీరాముని ముఖార విందము వైపుచూసి, ఆ తరువాత, "నాయనా! హనుమా! ఇలారా'యని పిలిచింది. హనుమంతుడు ముకుళిత హస్తుడై సీతాదేవి యెదురుగా నిల్చాడు. 'ఏమిటి తల్లీ! ఆజ్ఞ అన్నాడు. సీత నవ్వుతూ రాముడు తన కలంకరించిన హారాన్ని తీసి హనుమ కంఠమున అలంకరించినది. అదిచూసి అందరూ ఎంతో సంతోషించారు. తరువాత అందరూ రామునివద్ద సెలవు తీసుకొని ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కౌసల్యాది తల్లులు ముగ్గురూ అమితానందము పొందారు.



# ఉత్తరకాండము

## రామరాజ్య వైభవము

శ్రీరాముని పాలనలో ప్రజలు అన్ని విధాలా సంతృప్తులై సుఖసంతోషాలతో 'కరువు' అనే పదానికి తావు లేకుండా గడుపుతున్నారు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలకంటే మిన్నగా చూస్తున్నాడు. రోగాలూ, కలహాలూ లేకుండా దొంగల భయమనేది యెరుగకుండా ప్రజలు సుభిక్షముగా నిత్యవసంతమువలె కాలం గడుపుతున్నారు. భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల సేవలందుకుంటూ శ్రీరాముడు మానవలోకానికే ఆదర్శ ప్రభువై రాజ్యపాలన చేస్తున్నాడు. కొన్నాళ్ళకు సీత నెలతప్పింది. రాజ్యమంతా వేడుకలు చేసుకున్నారు. కౌసల్య, సుమిత్ర, కైకేయిల ఆనందానికి హద్దులే లేకపోయాయి.

## భద్రుడు తెలిపిన దుర్వార్త

ఇలావుండగా, ఊరిలోని విశేషాలు తెలిసికొనివచ్చి చెప్పే వారిలో ప్రముఖుడయిన భద్రుడు ఒకరాత్రి రెండు జాములవేళ అంతఃపురానికి వచ్చి గంట మ్రోగించాడు. సీతాదేవి నిద్రించుచుండగా రాముడు చారుల కొరకు మేలుకొని ఉన్నాడు. గంటవిని, యువతలకు వచ్చి కూర్చున్నాడు. భద్రుడు వచ్చి శ్రీరామునకు నమస్కరించాడు. 'ఏమిటి భద్రా! ఈ రోజు విశేషాలు?'' యని అడిగాడు శ్రీరాముడు. 'చెప్పుకోదగ్గ వేమీ లేవు మహాత్మా! ఎక్కడ విన్నా మీ గురించి పొగడ్తలేకాని మరేమి వినిపించుటలేదు కాని...'' అంటూ ఆగిపోయాడు భద్రుడు.

“సందేహించకు, విన్నది విన్నట్లుగా చెప్పు, నీవేదో దాస్తున్నట్లుగానున్నావు. రామరాజ్యములో అసత్యము పనికిరాదు, చెప్పు భద్రా!' అన్నాడు కోపంగా భద్రుడు భయపడుతూ 'మహారాజా చాకలిపేటలో ఒక చాకలివాడు తప్పత్రాగి భార్యను కొట్టుచూ పుట్టింట వున్నందున ఆమెను అవమానించి, పరాయియింట ఉన్న దానిని తెచ్చి

యేలుకొనుటకు నేను రాముని వంటి వెఱ్ఱివాడను కానేకాను' అంటూండగానే నేను తగవు తీర్చుదామని వెళితే మా మధ్య నువ్వెవడిని తగవుతీర్చడానికి? పొమ్మన మన్నాడు' అని చెప్పాడు. సరే, ఇక వెళ్ళిరా యని చెప్పి భద్రుని పంపేశాడు శ్రీరాముడు. తరువాత నిద్రిస్తున్న సీతాదేవిని చూసి కంట నీరు పెట్టుకుని ద్వారపాలకుని పిలిచి లక్ష్మణుని తీసుకొనిరమ్మని పంపాడు.


లక్ష్మణుడు అన్నగారి కబురు విన్న వెంటనే వచ్చి నిలిచాడు. శ్రీరాముడు జరిగిన దంతా చెప్పి "లక్ష్మణా! మీ వదిన మునికాంతలను చూడాలని కోరింది. ఆ నెపముతో తీసుకుని వెళ్ళి తెల్లారేలోపుగా వాల్మీకి ఆశ్రమమువద్ద వదలిరా"యని చెప్పాడు. లక్ష్మణుడు దుఃఖిస్తూ అన్నా? నిండు చూలాలికా ఈదేశ బహిష్కరణ? ఈ పని నేను చేయలేను!" అని ఏడుస్తున్నాడు. "లక్ష్మణా! ఇది రాజాజ్ఞ. ప్రజల కోసము నేను ఏమయినా చేస్తాను తప్పదు. ఇది నీ వల్లనే పూర్తి కావాలి" అంటూ దుఃఖముతో చెప్పి, అక్కడినుండి వెళ్ళిపోయాడు.

## రాముడు సీతను విడనాడుట

రథముపై సీతాదేవి తీసుకొని లక్ష్మణుడు గంగాతీరము చేరుకున్నాడు. అక్కడ పడవమీద గంగను దాటి ఇవతలి వైపుకు వచ్చిన తరువాత లక్ష్మణుడు దుఃఖించాడు. అదిచూసి సీత భయముతో "నాయనా లక్ష్మణా! ఎందుకు ఆ కన్నీరు? ఏమిటో చెప్పవయ్యా! మనము వస్తూన్నప్పుడు కూడా అన్నీ అపశకునాలే కనిపించాయి, ఇక ముందుకు వద్దు. పద, అయోధ్యకే వెళదాము. మునికాంతలను మరోసారి దర్శించుకో వచ్చును" అనగా...

లక్ష్మణుడు "ఇంకా యెక్కడి అయోధ్య తల్లీ? కొందరు కష్టాలకే జన్మిస్తారను కొంటాను. నీ విషయములో అదే జరిగిందమ్మా?" అంటూ రామాజ్ఞను తెల్పి, ఆమెను అక్కడే వదలిపెట్టి - తాను యేడుస్తూ రథముపై అయోధ్య చేరాడు. యీ విషయము తెలిసిన తల్లులు ముగ్గురూ రాముని యేమీ అన వీలులేక, లోలోపలే క్రుంగిపోయారు.

అక్కడ సీత కన్నీరు మున్నీరుగా యేడ్చి సొమ్మసిల్లి పడిపోయింది. అటువైపుగా వెళుతున్న వాల్మీకి సీతను చూచి దగ్గరకు వచ్చి విషయమును గ్రహించి ఆమెను ఓదార్చి



సీతాదేవిని అడవులకు తీసుకొని వెళుతున్న లక్ష్మణుడు

రా అమ్మా! నా దగ్గరే వుందువుగాని, సమయము వచ్చినపుడు నిన్ను నేనే రామునివద్దకు చేరుస్తా"నని చెప్పి, తీసుకొని వచ్చి ఆశ్రమములోని మునికాంతలకు అప్పగించి, కంటికి రెప్పలా కాపాడండని చెప్పినాడు.

## కుశలవుల జననము

ఒక మంచి శుభసమయమున సీతాదేవికి మగపిల్లవాడు జన్మించాడు. ఆ పిల్లవాడు సూర్యుని మించిన తేజస్సు గలవాడై చూడముచ్చటగా వున్నాడు. ఆ ఆశ్రమ ప్రాంతమంతా దివ్యకాంతులు విరజిమ్మాయి, ఒకనాడు సీతాదేవి తమసా నదికి వెళుతూ వాల్మీకితో "మహాత్మా! బిడ్డను చూస్తుండండి త్వరగా వచ్చేస్తా" నని చెప్పి వెళ్ళినది. సంధ్యావందనానికి వాల్మీకి బయటకు వచ్చాడు, మనస్సు ఉండబట్టలేక వెనుకకు మరలి వచ్చిన సీతమ్మ పిల్లవాడిని యెత్తుకొని వెళ్లింది. తిరిగి వచ్చిన వాల్మీకికి యిది తెలియక, ఉయ్యాలలో పిల్లవాడు లేకపోవుటచేత కంగారుపడి, 'యీ విషయము తెలిస్తే సీత యేమైపోతోందో

అనుకొని లవలు (దర్భలు) తెచ్చి ఆబాలకుని వంటి వాడినే సృష్టిస్తాడు తిరిగివచ్చిన సీత మరొకబాలకుని చూసి ఆశ్చర్యపోతుంది. అప్పుడు వాల్మీకి జరిగినది చెప్పి "అమ్మా! సీతా! నీకు కవల పిల్లలు నీ కుమారుడు కుశుడు, లవముచే సృష్టించబడినవాడు కనుక యీ బిడ్డను 'లవుడు' అని నామకరణము చేద్దాము" అని చెప్పాడు. అది మొదలు సీత ఆ కవలపిల్లలను అతి ప్రేమగా పెంచుతున్నది. శుక్లపక్ష చంద్రరేఖలవలె వారిద్దరూ దినదిన ప్రవర్థమానులై యేడేళ్ళ వయస్సువారయ్యారు.

అన్నీ తెలిసిన వాల్మీకి రఘుసాంప్రదాయము ప్రకారము శుభకరమయిన ఒక మంచి ముహూర్తమున కుశలవులకు అక్షరాభ్యాసముచేసి అన్ని విద్యలలోనూ అఖండులుగా తయారు చేసినాడు. మహర్షి బోధించిన విధముగా అతిచిన్న వయసులోనే అన్ని విద్యలను కూలంకషముగా గ్రహించగలిగి సాటిలేని వీరులుగా తయారైన కుశలవులను సాటిలేని



రామాయణమును గానము చేయుచున్న కుశలవులు

వీరులుగా తయారైన కుశలవులను చూచుకొని సీత మహానంద మొందినది. ధనుర్విద్యలో తండ్రిని మించిన తనయులయినారు.

ఇంతేగాక, సంగీత సాహిత్యాలలో కూడా ప్రవీణులయినారు. కుశలవులు మాట లాడినా, పాట పాడినా వంసత కోకిలగాన మాధుర్యాన్ని మించిన తన్మయత్వము కల్గించేది, వారిరువురి మృదు మధురమైన కంఠస్వరములకు తన్మయుడయిన వాల్మీకి మహాముని. తాను అప్పటికి రచించినంతవరకు రామాయణమును పాటగాబాణీ కుదిర్చి, ఆ బాలుర కిద్దరికి నేర్చి తన జన్మధన్యత జెందినంతగా ఆనందించినాడు. ఒకరోజున ఆశ్రమవాసుందరూ కుశలవులను "రామాయణము గానము చేసి మా కోర్కెతీర్చుడ"మని అడిగారు.

అది విని కుశలవులు - తల్లికి మహర్షికి నమస్కరించి, రామాయణమును వీణపై గానము చేయసాగి నారు. అది వింటున్న సీత, శ్రీరాముని దివ్యమంగళరూపాన్ని కనులారా గాంచినంతగా సంతోషించి, తన దీనస్థితి బాధపడుతూ కుమారులలోనే శ్రీరాముని చూచుకొనుచూ కొంత వూరట జెందసాగింది.

## అశ్వమేధ యాగము

ఇక్కడ అయోధ్యలో లోకాపవాదునకు తలవంచి సీతను అడవులపాలు చేశాడన్న మాటేగాని, శ్రీరాముడు సీతను మరచిపోలేకపడుచున్న బాధ ఒకవైపు బ్రాహ్మణుడయిన రావణుని చంపితిననే ఆవేదన మరొకవైపు వేధించుచుండగా, ఒకనాడు తన పూర్వీకులను తలచుకుంటూ వారివలెనే అశ్వమేధ యాగము చేస్తే కొంత మనశ్శాంతి లభిస్తుందేమోనని భావించి, తమ్ములను రావించి, తన అభిప్రాయమును తెలిపాడు.

అదివిన్న లక్ష్మణ, భరత,శత్రుఘ్నులు సంతోషించి యీవిధముగా నయినా శ్రీరామచంద్రుడు బాధను మరచి రాజకార్యములందు కాలము గడుపగలడు అని భావించారు, ముగ్గురు తమ్ములూ ముక్త కంఠముతో"అన్నా! నీ అభిప్రాయము చాలా బాగున్నది. నీ నిర్ణయానికి మేము ఎన్నడూ కాదనము" అని చెప్పగా... శ్రీరాముడు సంతోషించినవాడై, వెంటనే వశిష్ఠాది ముని పుంగవులను పిలిపించి తన అభి ప్రాయమును తెల్పినాడు. శ్రీరాముని నిర్ణయమునకు సంతోషించిన మహర్షులు యాగమునకు మంగళ కరమైన ముహూర్తము నిర్ణయించినారు. సీత లేకుండా శ్రీరాముడు అశ్వమేధయాగము

చేయ వీలు లేదు. కనుక వశిష్ఠుని సలహాతో బంగారు సీతను చేయించి అశ్వమేధ యాగపు టాహ్వానములను అన్ని దేశములకు పంపెను. ఈయాగమును చూచుటకు అనేక దేశములరాజులు, సామంతులు విభీషణ, సుగ్రీ వాదులు మొదలగువారెంతోమంది విచ్చేసినారు. ఎంతమంది వచ్చినా సీతలేని రాజ్యము కళాహీనము గానే కన్పించుచున్నది.

యాగ ముహూర్తము సమీపించినది. శ్రీరాముడు తన సీతను మనసారా తలచుకుంటూ బంగారు సీతను ప్రక్కననుంచికొని అశ్వమేధ యాగ దీక్షబూని యాగాశ్వమును అందముగా దివ్యాలంకార భూషణములతో నలంకరించి దానినుదుట "అయోధ్యా నగరాధీశుడు, వీరమాత కౌసల్య కుమారుడు అయిన శ్రీరామచంద్రుడు యీ యాగాశ్వమును వదులుచున్నాడు. వీరులయినవారు యీ అశ్వాన్ని పట్టి మమ్ము జయింప వచ్చును' అని ఒక వీరపట్టమును కట్టించి వదిలాడు. ఆ అశ్వరక్షణకుగాను కొంత సేననిచ్చి శత్రుఘ్నుని తోడుగా పంపించాడు.

## కుశలవులు అయోధ్య చేరుట

శ్రీరాముడు అశ్వమేధ యాగము చేయుచున్నట్లుగా విన్న కుశలవులు వాల్మీకి వద్దకు వచ్చి 'గురువర్యా' శ్రీరామచంద్రుడు అశ్వమేధ యాగము చేయుచున్నాడట మేము అయోధ్య వెళ్ళి శ్రీరామచంద్రుడినీ, ఆయన చేసే యాగాన్నీ చూసివచ్చెదము మాకు ఆనతీయవలసింది' అని కోరినారు.

ఆ బాలుర కుతూహలము తీర్చనెంచిన వాల్మీకి "నాయనలారా! క్షేమముగా వెళ్ళిరండి. మీ తల్లి దీవెన మిమ్ము కాపాడుచూ, మీకు అన్నివిధములా జయము చేకూర్చగలదు"అని చెప్పినాడు. ఆ సమయమునవున్న సీతాదేవి మహర్షి పలుకులువిని బాధతో పసిబాలురను అక్కడకు పంపుట వుచితము కాదేమో మహాత్మా!"అన్నది.

'అమ్మా! జానకిదేవి! నీ కుమారుల శక్తిసామర్ధ్యములు తెలిసి కూడా చింతించుచున్నా వెందులకమ్మా' అని, కుశలవులతో 'నాయనలారా! మీ వీణలను కూడా తీసుకొని మృదు మధురమైన గళములతో అయోధ్యలో రామాయణమును గానము చేసిరండి"అని చెప్పి పంపించినాడు.

అయోధ్య చేరిన కుశలవులు రామాణయమును గానము చేయుచు యజ్ఞశాలవద్దకు చేరుకొన్నారు. ఆ బాలకుల గానము విన్న సుమంత్రుడు, వారిని యాగశాలలోనికి

గొనిపోయి విషయము తెల్పినాడు. అచ్చటనే వున్న కౌసల్య, లక్ష్మణులు ఆ బాలకుల దివ్య తేజస్సును చూసి ఆశ్చర్య చకితులై" వీరు ముని బాలకులా?" అని సందేహించి ఆశ్చర్యపడినారు.

భరతుని ఆదేశానుసారము కుశలవులు రామాయణము గానము చేయడం మొదలు పెట్టినారు. ఆ గానము విన్న ప్రతి ఒక్కరు ఆ కథ తమ కనుల ముందు' జరుగుచున్నట్లుగా తన్మయత్వము చెందు తున్నారు. యాగదీక్షలోనున్న శ్రీరామునకు కుశలవుల గానము వినిపించి "యీ మధురగానము చేయువారు యెవరా!" అనుకొనుచు వచ్చి, వారి యెదుట నిలిచాడు.

క్రమముగా బాలకాండము మొదలు యుద్ధకాండము వరకు గానము చేసిన కుశలవులు మోమున విచార రేఖలు తాండవించుచుండగా సీతాదేవి అగ్నిప్రవేశఘట్టమును వివరించిన పద్ధతి అందరను దిగ్భ్రాంతులను చేసి కంటివెంట నీరు తెప్పించినది. తరువాత మరల శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వమును విని సంతోష వదనులై గానము చేయుచున్న ఆ బాలుర నైపుణ్యానికి, గాన మాధుర్యానికి అందరూ ఆనందిం చినారు. ఆ ఆనందమును యెంతోసేపు అనుభవించకుండానే పట్టాభిషేకము అనంతరము చిత్రపటాలు తిలకించుట, సీతవనాలను చూడగోరుట సౌఖ్యముగా గానము చేసినవారు, అంతలోనే లోకులమాటలు విని శ్రీరాముడు "అగ్నిచే పవిత్రమయిన సీతకా యీ ఆపవాదు?"యని తలంచిపడిన ఆవేదనా తదుపరి లక్ష్మణుడు సీతను అడవులకు తీసుకొనివెళ్ళి శ్రీరాముని ఆజ్ఞను తెల్పుట, అప్పుడు సీతపడిన మనస్సంక్షోభము - ఎంతటి కఠినమైన మనస్సుకయినా విని భరించలేనంత దీనాతి దీనముగా ప్రార్థించిన సీత పలుకులను, ఆమె దైన్యస్థితినీ యెంతో హృదయ విదారకముగా సీతమ్మ బాధను తామే స్వయముగా చూసిన వారివలె దుఃఖమిళితమయిన కంఠములతో గానము చేయుచున్న ఆ బాలకులను చూసి అందరూ దుఃఖించసాగారు. కౌసల్య లక్ష్మణుల దుఃఖాన్ని యిక వేరుగ చెప్పనవసరము లేదు. అంతగా దుఃఖించినారు. శ్రీరాముడు యిక యిక్కడ నిలువలేక తన విశ్రాంతి మందిరమున కరిగి సీత యొక్క బంగారు విగ్రహము వద్ద నిలచి కంటికి మంటికి యేకధారగా విలపించినాడు.

గానము పూర్తి చేసిన కుశలవులను దగ్గరకు తీసుకొని అక్కున చేర్చుకున్న కౌసల్యా లక్ష్మణులు వారిలో సీతారాముల పోలికలు చూసి ఒకవేళ వారు సీతకుమారు లేమోనని

అనుమానించి "నాయనలారా!" ఈ రామాయణపు కథాసారాన్ని యెవరు నేర్పారు?" అని అడిగి తెలుసుకున్నారు. అంతలో రామాజ్ఞచే భరతుడు తెచ్చిన కానుకలను తీసికొని లక్ష్మణుడు వారికివ్వబోయాడు.

అదిచూసి కుశలవులు 'మహాత్మా! ఆశ్రమంలో నివసించే మాకు యీ కానుక లెందుకు? మా తల్లి అజ్ఞానుసారము, గురువర్యుల ఆనతిని శిరసావహించి గానము చేశామేగాని, మీ యందువున్న గౌరవము తోటి కాదు. రామాయణ కథా శిరోమణి జానకీదేవిని అడవిపాలు చేయగలిగిన ఆదర్శపురుషుడూ, ప్రజా పాలకుడూ అయిన శ్రీరామచంద్రుని ఒడ్డూ పొడుగూ చూసి వెళ్ళదామని నచ్చామేగాని, మీరు యిచ్చే కానుకలను స్వీకరించుటకు కాదు" అన్నారు.

"ఇక మేము వచ్చిన పని అయినది. మా తల్లి మా కొరకు చూచుచుండును' అని చెప్పి వెళ్ళి పోయినారు. సీతాదేవిని అడవులలో వదలినందులకు కుశలవులు పడిన ఆవేదన, ఆ సభలో గల అందరినీ నిరుత్తరులను చేసింది.

## లవుడు అశ్వాన్ని బంధించుట

శ్రీరామునిచే విడువబడిన యాగాశ్వము అన్ని దేశములూ తిరిగి తమసాతీరము చేరుకున్నది. అచ్చట ముని బాలకులతో ఆడుకొనుచున్న లవుడు పరుగు పరుగున వచ్చుచున్న గుఱ్ఱాన్ని చూసి ఉత్సాహముతో దానిని పట్టుకొన్నాడు. అంతలోనే దాని ఎదుట కట్టబడియున్న పట్టాన్ని చూసి చదివాడు. అది చదవగానే ఉగ్రుడై "ఓహో! శ్రీరామచంద్రుని కన్నతల్లి వీరమాత అయితే, మా తల్లి వీరమాత కాదా! వారికి మా పరాక్రమమును చూసి, మా తల్లి వీరాధి వీరమాత అని ఋజువుచేస్తా! చూస్తాను యెవరొస్తారో?" అంటూ గుఱ్ఱాన్ని అక్కడే ఒక చెట్టుకు కట్టివేసాడు.

అంతలో అక్కడికి సైన్య సమేతుడయిన శత్రుఘ్నుడు వచ్చి లవుని పద్ధతి చూసి బాలకా! ఇది యాగాశ్వము దీనిని విడువుము' అని చెప్పినాడు. లవుడు నవ్వుతూ ' ఆ విషయము దాని నుదుటనే వ్రాసియున్నది. ప్రత్యేకముగా చెప్పనవసరము లేదు వీరుడను కనుకనే బంధించినాను. మీ వీరత్వము చూపి నన్ను జయించి గుఱ్ఱాన్ని తీసికొని పోవచ్చును' అని చెప్పాడు.

శత్రుఘ్నుడు ఎన్ని విధాలచెప్పినా లవుడు వినకపోవుటచేత యుద్ధముచేయక



యాగాశ్వాన్ని పట్టుకున్న లవకుమారుడు

తప్పలేదు. శత్రుఘ్నునితో యుద్ధము చేసి లవుడు తెలివి తప్పిపడిపోయాడు. శత్రుఘ్నుడు ఆ బాలుని పరాక్రమమునకు, అందచందము లకు విస్తుపోయి, అన్నకు చూపించాలనే ఉద్దేశముతో లవుని తన రథముపై పరుండబెట్టుకొని గుఱ్ఱాన్ని తీసికొని వెళ్ళిపోయాడు.

అప్పటి వరకూ చెట్లచాటున నిలబడి భయముతో, యేమి జరుగుతుందో చూడాలనుకున్న ముని బాలకులు పరుగుపరుగునపోయి ఆయాసపడుతూ సీతతో జరిగినదంతా చెబుతారు. తల్లి చేసేపూజ గురించి పూలు తీసికొని రావడమునకు వెళ్ళివచ్చిన కుశుడు మునిబాలురు చెప్పనది విని "అమ్మా! నన్ను దీవించి పంపు. ఆ రాజు ఎంతటి పరాక్రమవంతుడయినా సరే ఓడించే, నా తమ్ముని తీసుకొని వస్తాను" అని చెప్పి తల్లికి పాదాభివందనము చేసి పరుగున వెళ్ళి బాణ ప్రయోగముచే శత్రుఘ్నుడిని సేనతో సహా వెనుకకు రప్పించి. యుద్ధములో శత్రుఘ్నుని మూర్ఛపడగొట్టి, లవుని వలన విషయము తెలిసికొని అశ్వాన్ని బంధించి తల్లి దగ్గరకు వెళ్ళి తమ్ముని చూపించి,

దాల్చి లవకుశుల వైపు సాగింది. అదిచూచి కుశలవులు తల్లిని ధ్యానించి చెరొక బాణమును వదిలారు, ఆ రెండు బాణములు వజ్రాయుధములై పర్వతాకారాన్ని నుగ్గు చేసి లక్ష్మణుని మూర్ఛితుని గావించినవి, మరోబాణానికి సైన్య మంతా నేలకొరిగిపోయినది.

ఇదంతా చూస్తున్న రాముని గూఢచారులు ఆఘమేఘాలపై రామునిచేరి జరిగిన దంతయు వివరించి నారు. అదివిని శ్రీరాముడు దుఃఖముచే నిశ్చేష్టుడయినాడు. మూలుగుతున్న నక్కపై తాడికాయ పడినట్లు లక్ష్మణుని పరాజయము అయోధ్యనే కదిలించినది.

"సీతా వియోగముతోనే కుమిలిపోతున్న శ్రీరాముని తమ్ముని భంగపాటు మరింతగా క్రుంగతీసినది. అశ్వమేధ యాగానికి భంగము కలుగకుండా నిర్విఘ్నముగా పూర్తి చేయుటకు ఇక తానే యుద్ధానికి వెడలి విజయము సాధించక తప్పదేమో"నని విచారవదనుడయి ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న కుమారుని వద్దకు వచ్చినది కౌసల్య.

"నాయనా! రామచంద్రా! ఏమిటి యీ విధి వైపరీత్యము! రావణ కుంభకర్ణాది రాక్షస నాయకులనే యెదిరించిన నీ లక్ష్మణుడు నేలకొరగడమా" అన్నాదామె. 'అదేనమ్మా నన్ను బాధిస్తున్నది. వజ్రాలు పువ్వులతో ఛేదింపబడునట్లు పరాజయమే యెరుగని రఘువంశ వీరులు ముక్కపచ్చలారని మునిబాలకుని చేతిలో నేల కొరగడమా?" రాముని తల తిరిగిపోతున్నది. సింహాసనము భూమిలోనికి క్రుంగిపోతున్నట్ల నిపించినది.

ప్రక్కనే నిలిచిన కౌసల్య రాముని పరిస్థితికి భయపడి, రామచంద్రా! ఇప్పుడు యేమి చేయదలచుకొన్నావు నాయనా?" అని అడిగింది. "మన వంశ కీర్తి ప్రతిష్ఠలు కలుషిత మయ్యే దుర్దినము వచ్చినదమ్మా! లేకుంటే నా తమ్ములు అపజయముపాలు అయ్యేవారు కాదు. ఏది ఏమైనా రఘువంశ పరాక్రమము, వంశ తేజస్సు నాతోనే పరిసమాప్తికాకుండా రక్షిస్తానమ్మా! నేనే యుద్ధభూమికి వెడలిమన కీర్తిప్రతిష్ఠలకు భంగము కలుగకుండా కాపాడతానమ్మా! అంటూ బాధగా చెప్పాడు.

అదివిని కౌసల్య "యజ్ఞదీక్ష వహించిన నీవు యుద్ధమునకు బయలుదేరుతావా? వద్దు నాయనా!" అంది "తప్పదమ్మా! మహా మాయలమారి ఇంద్రజిత్తునే వధించిన లక్ష్మణుడే నేలికొరిగినాడంటే, ఆ బాలురు సామాన్యులు కారమ్మా" అని చెప్పి, తల్లి దీవెన పొంది శ్రీరాముడే యుద్ధభూమికి బయలుదేరాడు.

# శ్రీరామ - కుశలవుల యుద్ధము

లవకుశులు దూరము నుండి రాముని చూసినారు "అహో! ఏమి దివ్య తేజస్సు ఆ మహానుభావుని వీర శృంగార దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తూవుంటే మరీ మరీ చూడాలని పిస్తుంది కదా" అని అనుకొంటూ, శ్రీరాముడే యుద్ధానికి వచ్చినందుకు సంతోషించినారు.

దరిజేరిన శ్రీరాముడు లవకుశులను చూచి ఆకర్షింపబడి, కళ్ళలో ఆత్మీయుత కదలాడుచుండగా ప్రేమానురాగాలు ఉప్పొంగి, హృదయము స్పందించి, సూర్యచంద్రుల వలె దివ్యతేజ స్సంపన్నులయిన ఆ బాలకులనే కన్నార్పకుండా చూస్తూ "బిడ్డలారా! అయోధ్యలో రామాయణము గానము చేసి నన్ను ముగ్ధుని చేసినారు. మిమ్ముగన్న పూజ్యులయిన మీ జననీ జనకుల నామధేయము లేమిటి?" అన్నాడు.

లవకుశులు నవ్వుతూ "సీతారామచంద్రా! మా తల్లిదండ్రుల నామధేయములు



శ్రీరామునితో యుద్ధము చేయుచున్న కుశలవులు

తరువాత తెలిసి కొందురుగాని ముందు మీరు వచ్చిన పని పూర్తిచేయండి'' అని విన్నవించుకొన్నారు. అది విని రాముడు బాలకులారా! మా యాగాశ్వము యెక్కడున్నదో చూచి నా తమ్ములను జయించిన బాలకులను రప్పించ గలరా!'' అని అడిగినాడు.

"ప్రభూ! అదిగో మీ యాగాశ్వము అయినా, ఆ బాలకులను జయించి మీ అశ్వాన్ని తీసుకొని వెళ్ళ గలరా!'' అన్నారు లవకుశులు. "ఒకవేళ అశ్వాన్ని బంధించిన ముని కుమారులు అజేయులయితే ఓటమిని ఒప్పుకొంటారా మహాత్మా!'' అని కూడా అడిగారు.

"ఓటమిని ఒప్పుకొనుట మా రఘువంశములోనే లేదు అయినా జయాపజయములు దైవ నిర్ణయాలు నాయనా! ఇంతకీ బాలకు లెక్కడ?''

"ఇక్కడే, అందుకోండి మహానుభావా ప్రణామములు'' అంటూ యిద్దరూ ఒకేసారి నమస్కార బాణాలను వదిలారు.

రాముడు వారి నమ్రతకు, వినయ విధేయతలకు ఆచ్చెరువొందుతూ "బాలకులారా! మీరు ఈ యాగాశ్వమును ఎందుకు కట్టారు? భక్తితో రామాయణము గానము చేసిన మీకు యిది శ్రీరామచంద్రుని యాగాశ్వమని తెలియదా?'' అని అడిగాడు.

మహాత్మా! ఇది శ్రీ సీతారాముని యాగాశ్వమని తెలిసే బంధించినాము. మాతల్లి కూడా వీరమాత యేనని ఋజువు చేసుకోదలచినాము. ఆదిగాక మీ వంటి పరాక్రమశాలురను జయించ గలిగినపుడే కదా, మా పరాక్రమమునకు సార్థకత సిద్ధిస్తుంది'' అన్నారు లవకుశులు.

ఆ బాలకుల వీరత్వమునకు వాక్చాతుర్యమునకు ముగ్ధుడవుతూ "ఇంతకీమిమ్ముగన్న ఆ వీరమాత పవిత్ర నామధేయమేమిటో తెలుపలేదు'' అన్నాడు రాముడు. "శ్రీరామచంద్రా! ఆమె నామధేయముతో మీకు పనిలేదు. మేము మిమ్ము జయించినట్లుయితే నిరంతరము నీ దివ్యమంగళ స్వరూపాన్నే తలచుకొని తన్మయత్వము జెందే మా తల్లికి నిన్ను కానుకగా సమర్పిస్తాము. అప్పుడు ఆమె నామధేయమేమిటో తెలిసికొనవచ్చును, మేమే పరాజయము పొందిననాడు. మా జీవితాలనే త్యజంచి మా తల్లి పవిత్ర నామ ధేయము తెలుపుతాము.

వయసులో చిన్నవారయినా పరాక్రమములో గొప్పవారేనని ఋజువు చేసుకొన్నారు. ఏ యనర్థమూ జరగకుండా ముందుగనే అశ్వాన్ని వదలవచ్చునుగదా!''అని శ్రీరాముడనగా అది జరుగదు మహాత్మా! మా తల్లి దీవెన మాకున్నంతకాలమూ మేము అపజయము పాలు కాము.'' "కుమారులారా! మీరు యెంతగా యెన్ని విధాలుగా చెప్పినా మీమీద

నాకు కలుగుచున్న ఆవ్యాజ మయిన మమత యుద్ధానికి సన్నద్ధుని కాకుండా చేస్తున్నది.''

"ఏమిటి? ఏ బంధమూ లేని మాపై మీకింత మమత యెందుకు? ఆశ్చర్యముగా నున్నదే! మమత అనేది మీలోవుంటే, పూర్ణ గర్భిణి అయిన జగన్మాత జానకిదేవిని అడవులపాలు చేస్తారా?'' ఈ మాటతో రామునికి మాట్లాడుటకు మరోమాట దొరకలేదు. జానకీదేవి పేరు వినగానే నిరుత్తరుడైనాడు.

అదిచూచి కుశలవులు "మహానుభావా! మాటలతో కాలయాపనచేయక మమ్మి జయించి మీ అశ్వాన్ని తీసుకొని పొండు లేదా! ఓటమిని ఒప్పుకోండి'' అన్నారు. ఇది వినగానే హనుమంతుడు ఆగ్రహముతో "బాలులారా! శ్రీరామచంద్రుడు ఓటమిని అంగీకరించాలా? శ్రీరామచంద్రునితో యుద్ధము చేసి మీరు విజయము సాధించలేరు. శరణు వేడుకోండి లేదా, మిమ్మిలను యేమి చేస్తానో తెలుసా?'' అన్నాడు.

లవకుశులు నవ్వుతూ "నీ కుప్పిగంతులకు మేము భయపడము ఆంజనేయా! యుద్ధము చేస్తే రామ చంద్రునిలాంటి లోకైక వీరునితో చేయాలి, కాని నీ వంటి కోతులతో కాదు'' అని చెప్పి బాణాలు తీసారు.

అదిచూసి శ్రీరాముడు ఆంజనేయుని శాంతింపజేసి, యుద్ధానికి సిద్ధమయి ఒక దివ్య బాణమును ప్రయోగించినాడు. శ్రీరాముని శక్తిసామర్థ్యములు తెలిసిన లవకుశులు తాముకూడా దివ్యాస్త్రములనే ఉపయో గించి శ్రీరామబాణములను యెదుర్కొన్నారు. శ్రీరామ కుశలవులయుద్ధము మహాఘోరముగా సాగుచున్నది. ఒకరిని మించిన వారింకొకరుగా నున్నారేగాని, యెవరికి జయాపజయాలు కలుగుటలేదు. వీరి యుద్ధధాటికి ఫెళఫెళమని ఉరుములు మెరుపులు పిడుగులుపడుతూ ఝుం ఝూ మారుతములు క్రమ్ముతూ పెగిలి నేల కొరుగుతున్నవి. ఇంకొకవైపు పర్వతాలు బ్రద్దలవు తున్నాయి. రణము మహాప్రళయముగా మారి గగనాన్నే కల్లోలపరుస్తున్నది. భూదేవి కూడా భయభ్రాంతయగుచున్నది. ఇది చూచి హనుమంతుడు భయపడి "వాల్మీకి మహామునియే ఈ యుద్ధమును ఆపగల'డని భావించి పరుగు పరుగున ఆశ్రమము చేరుతాడు.

"మహాత్మా! వాల్మీకి మునీంద్రా!' అంటూ ఆశ్రమములోపలకు అడుగిడిన హనుమంతుడు పూజా నిమగ్నురాలై వున్న సీతాదేవినిచూసి "అమ్మా! జానకిదేవి'' అంటూ సాష్టాంగ ప్రణామము చేస్తాడు.

జానకీదేవి కూడా ఆశ్చర్యచకితురాలై 'హనుమా! లే నాయనా'అంటుంది, వాత్సల్య

పూరితంగా, అంతలోనే ఏదో ప్రళయము ముంచుకువస్తున్నట్లుగా వినవస్తున్న ఉరుములు, మెరుపులు చూసి భయకం పితుడయిన హనుమంతుడు అమ్మా వేగిరమే వచ్చి, రాబోయే ప్రళయాన్ని ఆపి, లోకాన్ని రక్షించు జగజ్జననీ' అంటూ ప్రార్ధిస్తాడు.

"ఏమిటి రాబోయే ప్రళయాన్ని నేను ఆపడమా? అసలు ఈ ప్రళయానికి కారణము యేమిటి?'' అని అడిగింది సీతాదేవి. అదే సమయములో లోపలకు వస్తున్న వాల్మీకి "ఇంకేమున్నదమ్మా తండ్రి తనయుల యుద్ధమే దీనికి కారణము''అంటూ సీతను తీసికొని యుద్ధరంగానికి బయలుదేరాడు. వాల్మీకి మాటలువిన్న హనుమంతుడు 'ఆ బాలకులు జానకీదేవి కుమారులా!' అనుకొంటూ సంతోషముతో వారిని అనుసరించాడు.

ఇక్కడ తండ్రి పరాక్రమమునకు యే మాత్రమూ తీసిపోని లవకుశులు శ్రీరాముడు ప్రయోగించే ప్రతి దివ్యాస్త్రాన్నీ అతి చాకచక్యముతో ఇద్దరూ వంతులు వారిగా ఉపసంహరిస్తూనే, ఒకసారిగా మరో రెండు దివ్యాస్త్రములను వదిలారు. ఆ బాణాలు ఆకాశమంతా అగ్ని జ్వాలలుచూచి ప్రపంచాన్నేజ్వలింప చేస్తాయా. అన్నట్లుగా విస్తరించాయి. శ్రీరాముడు వాటిని ఉపసంహరించి బాలకులపై మమత వున్నప్పటికి వారి పరాక్రమమునకు ఆనందము గలుగుచున్నా మరోవైపు రఘువంశపు కీర్తి ప్రతిష్ఠలు మదిలో మెదిలి ఆఖరుసారిగా తిరుగులేని బాణము ప్రయోగించతలచి తూణీరము నుండి రామ బాణమును తీసినాడు.

పవిత్రురాలు అదిచూసి కుశలవులు కూడా మరో రెండు దివ్యాస్త్రములను తీసి గురువును తలచుకొని "మా తల్లి జానకిదేవి ఉత్తరమురాలు అగునేని, ఈ దివ్యాస్త్రములచే శ్రీరామచంద్రుడు మూర్ఛిల్లుగాక'' అంటూ బాణములను విడువబోగా బాలకుల నోటినుండి వెలువడిన వాక్యములను విన్న శ్రీరాముడు ధనుస్సును జారవిడిచి "సీతా! సీతా అంటూ మూర్ఛిల్లెను.

అదిచూసి కుశలవులు దిగ్భ్రాంతిజెంది. "ఇదేమిటి? మనతల్లిని తలుచుకొంటే శ్రీరాముడు "సీతా! సీతా!'' అంటూ మూర్ఛనొందినారు'' అని అనుకుంటూవుండగా..... దూరమునుండియే "నాయనలారా! యుద్ధము ఆపండి'' అంటూ సీత వేసిన కేకకు విని మరింత ఆశ్చర్యకితులయినారు. లవకుశుల దరిజేరిన సీత "నాయనలారా! తండ్రితోనే యుద్ధానికి తలపడినారా? "అంటూ శ్రీరాముని దగ్గరకు వెళ్ళబోతుండగా.

దీనిని గమనిస్తున్న సీతాదేవి శ్రీరామ నిర్ణయము గుర్తుకువచ్చి బాధతో వెనుకకు

నడిచి చెట్టుచాటునకు తప్పుకొన్నది. అప్పుడే మేల్కొన్న శ్రీరాముడు వాల్మీకికి నమస్కరిస్తాడు.

"రామభద్రా! ఈ కుశలవులు యెవరో కాదు నీ బిడ్డలే, వారి తల్లి అదుగో నీ దర్శన భాగ్యమునకై అహర్నిశలు యెదురుచూస్తున్న నీ ధర్మపత్ని - మహాపతివ్రత అయిన లోకపావని సీత" అని చెప్పగా, చెట్టుచాటున నిలిచిన సీత వచ్చి రాముని పాదాలకు నమస్కరించినది. శ్రీరాముడు కుశలవులను అక్కున చేర్చుకొని సీతను చూసి ఆనంద బాష్పాలు రాల్చుతాడు. తరువాత వాల్మీకి చల్లిన మంత్రోదకము వలన లక్ష్మణ భరత శత్రుఘ్నులూ, సైన్యమూ నిద్రనుండి మేల్కాంచినట్లుగా లేచి, విషయమువిని ఆనందించారు. దేవతలు, గంధర్వులు, ముత్యాలవర్షము కురిపించి "సీత మహాపతివ్రత" అని ముక్త కంఠముతో పలికారు.

అదివిని శ్రీరాముడు "సీత మహాపతివ్రత అని నాకు తెలుసు. అయినా లోకాపవాదము నకు గురి అయిన మీ వదిన తన పవిత్రను యే విధముగా ఋజువు



సీతనూ, కుశలవులనూ శ్రీరామునికి అప్పగిస్తున్న వాల్మీకి

చేసుకొంటుందో తెలుసుకో లక్ష్మణా''అంటాడు. ఏ శుభఘడియ కొరకు అహర్నిశలూ దుఃఖించి ఎదురు చూచిందో ఆ ఘడియ సమీపించినదన్న సంతోషముతో నున్న శ్రీరాముని మాటలు శూలమువలె గ్రుచ్చుకొనగా విషాదవదనయై "మహాత్మా! నా ధర్మము నెరవేర్చు కొనుటకై నేనింతవరకు జీవించియున్నాను నా స్వామి లోకాభిరాముడు నేను వారితో అయోధ్యకు తిరిగివెళ్లి రఘువంశ కీర్తిని మట్టిపాలు చేయలేను'' అని వాల్మీకికి చెప్పి శ్రీరామునకు కడసారి వందనము గావించి, ఆ దివ్యమంగళ స్వరూపాన్ని కనులార గాంచి ......

## సీతాదేవి భూప్రవేశము

"నేనే గనుక - నా రాముని తప్ప అన్యునిమది తలచక, శ్రీరాముని పాదారవిందము లనే నమ్ముకొని పునీతురాలి నయితినేని నాతల్లి భూదేవి వచ్చి నన్ను తీసుకొనిపోవుగాక'' అని ప్రార్థించినది. మొదట భూమి రెండు పాయలుగా చీలి అందుండి సర్వాలంకార భూషితమయిన భూదేవి రత్నఖచిత సింహాసన నాధిష్ఠితురాలై వెలికివచ్చి చేతులు




భూదేవి సీతను తీసుకొనిపోవుట

చాచినది. ఆదిచూచి లక్ష్మణుడు "అమ్మాజానకీదేవి? నీ పవిత్రత ఋజువు అయినది. ఇంకా నీవు నిర్వహించవలసిన కార్యము లెన్నియో కలవు" యని చెప్పగా "ఎవరి కోసం నేను జీవించాలి నాయనా" అంటూ సీత భూదేవి చేతులలో వాపోయింది.

అంత భూదేవి సీతను తనలో యిముడ్చుకొని అంతర్హితయైనది. బ్రహ్మాది దేవతలు సీతపై పుష్ప వృష్టి కురిపించినారు. భూదేవి సీతను తీసుకొని పోవుట సహించలేని రాముడు ఉగ్రరూపము దాల్చి బాణము తీసి భూదేవిమీద ప్రయోగించబోయాడు. అదిచూచి బ్రహ్మాది దేవతలు వచ్చి శ్రీరాముని శాంతింప జేసి "వైకుంఠము నీ రాకకు యెదురు చూస్తున్న"దని తెలిపి శ్రీరాముని వద్ద సెలవు తీసికొని వెళ్ళిపోయినారు. శ్రీరాముడు కూడా వాల్మీకి ఆశీస్సులు పొంది తన వారందరితోనూ అయోధ్య చేరినాడు.

## కుశలవుల పట్టాభిషేకము

అయోధ్య చేరిన శ్రీరాముడు జరిగినదంతయు తల్లులకు చెప్పి కుశలవులను వారికి



కుశలవుల పట్టాభిషేక మహోత్సవము

అప్పగించాడు. సీత కనిపించినట్లే కనిపించి దూరమైనందుకు విచారించినా కుమారులలోనే సీతను చూచుకొనుచు, అశ్వమేధ యాగమును పూర్తిచేసి కాలం గడపసాగెను. ఈ విధంగా కొంతకాలం గడిచిన పిమ్మట తమ్ములతో ఆలోచించి ఒక సుముహూర్తమున కుశలవులకు పట్టాభిషేకము జరిపించి, రాజ్యభారము వారికి అప్పగించినాడు. కాని సీతా వియోగము మాత్రము రాముని వదలలేదు.

## కౌసల్యాదుల నిర్యాణము

మరికొంత కాలము తరువాత కుమారుల, మనుమల సేవలందుకుంటూ కౌసల్య రాముని చేతిలో ప్రాణాలు వదలి పుణ్యలోకానికి జేరి దరశధుని కలిసినది. మరికొద్ది రోజులకు సుమిత్రా, కైకేయి, కూడా కాలం చేశారు. శ్రీరాముడు తల్లుల పేరున యెన్నో దానధర్మాలు చేశాడు.


## యముడు, రాముడు రహస్యాలోచన దూర్వాసాగమనము

ఒకనాడు గొప్ప తేజశ్శాలి అయిన మహర్షి రాజప్రాసాదమునకు వచ్చినాడు. లక్ష్మణుడు ఎదురేగి మహర్షిని గౌరవించి తీసుకొని వచ్చినాడు. ఆయన రాముని దర్శించుకొని "రామచంద్రా! నేనొక దేవకార్యార్థినై నీవద్దకు వచ్చినాను నేను చెప్పబోయే విషయమును అన్యులెవరూ వినరాదు. మనము మాటలాడు కొనునపుడు యెవరయినా లోపలకి వచ్చినచో వారికి శిరశ్చేదము గావింపవలె"నని షరతు పెట్టి చెప్పినాడు.

అదివిని రాముడు ద్వారపాలకుని పంపివేసి విషయము చెప్పి, ద్వారము వద్ద లక్ష్మణుని కాపుంచి - తాను మునివద్ద కూర్చొనినాడు. అంతనా ముని -

'రామచంద్రా ! నేను మునివేషమున వచ్చిన యమధర్మరాజును, నీవు నీకర్తవ్య నిర్వహణను సమాప్తము చేశావు. ఇక నీవు ఇక్కడ ఉండనవసరములేదు. బ్రహ్మాది దేవతలంతా నీ కొరకు యెదురుచూస్తున్నారు. రాక్షస సంహారము చేసి నీ భక్తులకు వెలుగు బాటను చూపావు. సీత యెప్పుడో స్వర్గము చేరి లక్ష్మీదేవిగా వైకుంఠమున ఉన్నది. నీ రామావతారము గడువు పూర్తయినది. కనుక యీ అవతారాన్ని చాలించి వైకుంఠము చేరి లక్ష్మితో సుఖించు' అనగా -

'యమధర్మరాజా! నీ రాకవలన అంతా గ్రహించాను. త్వరలోనే వైకుంఠమును చేరగలనని చెప్పు'ఈ విధముగా యముడు, రాముడు మాటలాడుకొనుచుండగా



మునివేషములో వున్న యమధర్మరాజును ఆహ్వానిస్తున్న లక్ష్మణుడు

దుర్వాసముని వచ్చి "వెంటనే రాముని చూడా" లన్నాడు. అది విని లక్ష్మణుడు "మునీంద్రా! రామచంద్రులు దేవకార్యార్థియై వచ్చిన మునిపుంగవునితో సంభాషిస్తూన్నారు. కొంత తడవుపట్టు"నని మనవి చేసినాడు.

అదివిని దూర్వాసుడు కోపముతో "లక్ష్మణా! వెంటనే రామునితో నా రాకను తెల్పుము. లేదా నిన్నూ, ప్రజలకు సర్వనాశనం గావించెద"నని చెప్పినాడు.

లక్ష్మణుడు ఎన్ని విధముల చెప్పినా దూర్వాసుడు వినకపోవుటచేత, మునిశాపమునకు మొత్తము అయోధ్యనే బలిచేయుటకన్నా, అన్నగారిచేతిలో తానొక్కడే హతుడగుట మేలని నిర్ణయించుకొని అన్నగారి ఆనతిని, అతిక్రమించి లోపలకు వెళ్ళి శ్రీరామునకు దూర్వాసుని రాకను చెప్పినాడు. ఇది చూచి యముడు వెళ్ళిపోయినాడు శ్రీరాముడు వచ్చి దూర్వాసుని కలిసి సంతృప్తిని గావించి పంపాడు తరువాత తమ నియమం ప్రకారం లక్ష్మణునికి శిరచ్ఛేదము గావింపక తప్పదు కదా? యని ఆలోచించుచు 'లక్ష్మణా! ఉత్తములకు సత్ప్రవర్తనలకు రాజ్య బహిష్కారమే మరణము అయోధ్య వదలి వెళ్ళిపోయని చెప్పినాడు.

## లక్ష్మణుని నిర్యాణము

అదివిని లక్ష్మణుడు అన్నగారి మాటను అతిక్రమించవలసి వచ్చిన అవసరాన్ని వివరించి, రాముని పాదారవిందములకు మ్రొక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు తన యింటివేపు కన్నెత్తి చూడక సరయూ నదికి వెళ్ళి అచమనం చేసి శ్రీరాముని ధ్యానించి నదిలో మునిగాడు. అప్పుడు దేవేంద్రుడు వచ్చి లక్ష్మణుని సశరీరముగా తీసుకొని వెళ్ళాడు.

## శ్రీరామాదుల అవతార సమాప్తి

లక్ష్మణుని విడిచి వుండలేని రాముడు ఇక తనుకూడా జీవితము చాలించదలచుకొని వశిష్ఠాది మహర్షులకు తెల్పాడు. అదివిని భరత శత్రుఘ్నులు కూడా రాముని వెంట బయలుదేరినారు. హనుమంతుడు యిది తెలిసి దుఃఖించగా, రాముడు హనుమంతుని ఓదార్చి, 'హనుమా! యింకా నీవు జీవించి వుండాలి. నాచరిత్ర యిక్కడ యెంతకాలం వాడుకలో వుంటుందో అంతకాలమూ నీవు వుండక తప్పదు. అని చెప్పి గాయత్రీపూజ



రాముడు సరయూనదిలో మునిగి విష్ణురూపమును పొందుట

చేసి కుమారులను ఆశీర్వదించి, వశిష్ఠాది మహర్షులకు నమస్కరించి, శుభఘడియలు సమీపించగా, అయోధ్యకు సమీపమున పశ్చిమాభి ముఖంగా పారుతూన్న పవిత్రమైన సరయూనదికి కాలినడకనే వెడలినాడు.

గాయత్రి జపము చేసి నదిలో దిగి తనవెంట వచ్చినవారిని వెనుకకుపంపి నీటిలో మునిగెను. రాముని వెనుకనే నదిలోమునిగిన భరత శత్రుఘ్నులు శంఖచక్రాలుగా మారిపోయిరి నీటమునిగిన రాముడు విష్ణురూపమును ధరించగా శంఖ చక్రాదులు విష్ణువు చేతిని అలంకరించినవి. దేవ గంధర్వాదులు పూల వర్షముకురిపిస్తుండగా అచ్చటకువచ్చిన గరుత్మంతునిపైనెక్కి విష్ణుమూర్తి వైకుంఠమేగి శేషపాన్పు నలం కరించి లక్ష్మిని కలసి ఆనందించెను. మరల వైకుంఠము కళకళ లాడినది. బ్రహ్మానందముతో మునులు, ఇంద్రాదిదేవతలు విష్ణుమూర్తిని స్తుతించారు. ఈవిధంగా శ్రీసీతారామ చరిత్ర సంపూర్ణమై లోకకళ్యాణమును గావించింది.

## మంగళం

**హరిః ఓం ॥ శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం**
**లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాథమ్ ॥**
**ఓం తత్సత్ - మంగళం మహత్ - శ్రీ శ్రీ శ్రీ**
**శ్రీ సీతారామచంద్రార్పణమస్తు - ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః**

## ఫలశ్రుతి

ముల్లోకాలకూ పరమ పవిత్రమూ పూజనీయమూ అయిన రామాయణ చరిత్రను నిశ్చల మనస్కులై యెవరు పఠింతురో అట్టివారు శ్రీ సీతారామానుగ్రహమునకు పాత్రులై యిహ పరములందు సౌఖ్యము లనుభవింతురు. ఆ బాలగోపాలము ఆనందించు రీతిని బాలకాండ మొదలు శ్రీరాముడు అవతారమును చాలించువరకు సంపూర్ణముగా సవిస్తరముగా వ్రాసి, నయనానంద కరములయిన బొమ్మలతో కూర్చబడిన ఈ సంపూర్ణ శ్రీ సీతారామ చరిత్రను భక్తితో పఠించినా చదువలేని వారికి రామాయణ చరిత్రను చదివి వినిపించినా శ్రీ సీతారామ కృపాకటాక్షము కలిగి శాశ్వత బ్రహ్మలోక నివాసము పొంది సుఖింతురు. రామాయణ గ్రంథము అంత మహత్తు కలిగియుండునని వాల్మీకి మహర్షి వివరించియున్నారు.

★★★

# మావద్ద లభించే గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| బాలల బొమ్మల మహాభారతం | 25-00 | హనుమచ్చరిత్ర | 33-00 |
| బాలల బొమ్మల మహాభాగవతం | 25-00 | సుందరకాండ (తాత్పర్యంతో) | 125-00 |
| బాలల బొమ్మల వేంకటేశ్వర లీలలు | 25-00 | శ్రీ దేవీ మాహాత్మ్యం | 25-00 |
| సంపూర్ణ వాల్మీకి రామాయణము | 45-00 | శ్రీ బ్రహ్మంగారి చరిత్ర | 45-00 |
| ఆంధ్రమహాభారతము | 45-00 | శ్రీ సద్గురుసాయిలీలామృతం | 46-00 |
| శ్రీమన్మహాభాగవతం | 45-00 | శ్రీసాయిసచ్చరిత్ర | 30-00 |
| శ్రీమదాంధ్ర మహాభారతము | 150-00 | శ్రీషిర్డిసాయి - పర్తిసాయి | 65-00 |
| శ్రీమన్మహాభాగవతము | 45-00 | శ్రీసాయికృప | 54-00 |
| శ్రీ మదాంధ్ర మహాభారతము | 150-00 | శ్రీ గురు లీలామృతం | 30-00 |
| సంపూర్ణ శివమహాపురాణము | 72-00 | శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం (భాష్యంతో) | 60-00 |
| అష్టాదశపురాణము | 66-00 | | |
| మహాభక్త విజయం | 100-00 | శ్రీ లలితా సహస్రనామస్తోత్రం (భాష్యంతో) | 60-00 |
| శివపురాణము | 16-00 | | |
| మాఘపురాణము | 16-00 | నవగ్రహ అనుగ్రహము | 45-00 |
| వైశాఖపురాణము | 16-00 | శ్రీ దుర్గా దేవీ ఆరాధన | 54-00 |
| కార్తీకపురాణము | 16-00 | నవగ్రహ కల్పసర్వస్వం | 60-00 |
| సంపూర్ణకార్తీక పురాణము | 24-00 | సర్వదేవతా నిత్యప్రార్థనలు | 28-00 |
| భగవద్గీత (తాత్పర్యంతో) | 45-00 | వేమన పద్యములు | 60-00 |
| గాయత్రి దివ్యశక్తి | 50-00 | మహారథి కర్ణ | 40-00 |
| శ్రీ దేవీ భాగవతం | 45-00 | భీష్మపితామహుడు | 36-00 |

పై పుస్తకములు వలయువారు ముందుగా ఎమ్.ఓ. ద్వారా సొమ్ము అడ్వాన్సు పంపుచూ వ్రాసిన వి.పి.పి.ద్వారా పోస్టు ఖర్చులకు పుస్తకములు పంపగలము. ఎమ్.ఓ ఫారం క్రింద మీ పూర్తి అడ్రస్, కావలసిన పుస్తక వివరములు తప్పకుండా వ్రాయవలెను. ఉచిత కేటలాగు కొరకై మాకు వ్రాయగలరు.

**గొల్లపూడి వీరాస్వామి సన్**

**కోటగుమ్మం, రాజమండ్రి - 533 101 (ఏ.పి.)**